ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-9-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 215 పేజీలు: 12 వెల: 6.50

చవితి వేడుకల్లో అపశ్రుతి
డ్యాన్స్ చేస్తూ 22 యేళ్ల యువకుడు మృతి! 2

భారత్, సింగపూర్ సంబంధాలు బలోపేతం 9

# ప్రజలందరికి ఆరోగ్య బీమా



## ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యసేవలు

### సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం కీలక నిర్ణయం

### మొత్తం 3,257 చికిత్సల క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా కొత్త విధానం

### రాష్ట్రంలో కొత్తగా 10 వైద్య కళాశాలల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

### గ్రామీణ మంచినీటి సరఫరా నిర్వహణ, పర్యవేక్షణ పాలసీలకు గ్రీన్‌సిగ్నల్

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలందరికి ఆరోగ్య బీమాను ఏపీ ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఏపీ మంత్రి మండలి సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ సచివాలయంలో గురువారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ భేటీలో సుమారు 30 అంశాలకుపైగా ఎజెండాగా కేబినెట్ చర్చించింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించే పలు బిల్లులు, చట్ట సవరణలకు ఆమోదం తెలపింది. ఈ క్రమంలోనే ఆయుష్మాన్ భారత్- ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద యూన్సివరల్ హెల్త్ పాలసీకి మంత్రివర్గం. ఆమోదం తెలిపింది. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25లక్షల వరక ఉచిత చికిత్సలు అందేలా కొత్త విధానానికి ఆమోదముద్రవేసింది. ఆర్దిక స్దితిగతులతో సంబంధం లేకుండా అందరికి హెల్త్ పాలసీ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 1.63 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా అందేలా ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. 2,493 నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యసేవలు పొందేలా ఎన్టీఆర్ వైద్యసేవ హైబ్రిడ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. మొత్తం 3,257 చికిత్సల క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా కొత్త విధానం రూపొందించారు. రూ.2.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు వ్యయాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరించనుంది. 1.43 కోట్ల పేద కుటుంబాలు, 20లక్షల మంది ఇతర కుటుంబాలకు వర్తించేలా నూతన విధానాన్ని తీసుకుని వస్తున్నారు. ఇందుకు మంత్రివర్గ ఆమోదం తెలిపింది, ఆతిథ్య హోటళ్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే అంశంపై చర్చించింది, ఆ దిశలో కీలక నిర్ణయం తీసుకుంది. వాహన పన్ను చట్ట సవరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.. గ్రామీణ మంచినీటి సరఫరా నిర్వహణ, పర్యవేక్షణ పాలసీపై చర్చించి తీర్మానం చేసింది.. ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టంలో పలు సవరణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ >>2

# 80 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ సన్నాహాలు

### నెలాఖరులోగా నోటిఫికేషన్లు జారీ

### గ్రూప్1, 2 ఫలితాల జాప్యంపై స్పష్టత ఇచ్చిన ఎపిపిఎస్సీ

### స్పోర్ట్స్ కోటా జాబితా అందకపోవడమే ఆలస్యానికి కారణమని వెల్లడి


### 7న అటవీ శాఖ ఉద్యోగాలకు స్క్రీనింగ్ టెస్ట్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రభుత్వ ఉద్యో గాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఏపీపీఎస్సీ శుభవార్త అందించింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 80 పోస్టుల భర్తీకి త్వరలోనే 20 నోటిఫికేషన్లు జారీ చేయ నున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో వేలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రూప్1, గ్రూప్2 ఫలితాల జాప్యంపైనా స్పష్ట త ఇచ్చింది. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో కమిషన్ కార్యదర్శి పి. రాజాబాబు ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉన్నందున, ఈ ప్రకటనలన్నింటికీ కలిపి ఒకే ఉమ్మడి పరీక్ష నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు.

గ్రూప్1, గ్రూప్2 తుది ఫలితాల జాప్యంపై రాజాబాబు మాట్లాడుతూ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల తుది జాబితా ఇంకా అందకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఆ జాబితా అందిన వెంటనే ఫలితాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్ కోటా మినహా మిగిలిన ప్రక్రియ మొత్తం పూర్తయిందని >>2


# 3 నెలల ముందే స్థానిక ఎన్నికలు!

### పురపాలక, పంచాయతీరాజ్ కమిషనర్లకు ఎస్ఇసి లేఖలు




**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు మూడు నెలల ముందుగా 2026 జనవరిలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఐదేళ్ళ పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగా ఎన్నికల నిర్వహణకు చట్టంలో ఉన్న వెసులుబాట్ల మేరకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని పంచాయితీరాజ్, పురపాలక శాఖల కమీషనర్లకు బుధవారం లేఖలు రాశారు. ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో...నగరపాలక, పురపాలక సంస్థలు, నగర పంచాయితీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. ఆలోగానే జనవరిలో ఎన్నికల నిర్వహణకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ ప్రకారం ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు ఇలా ఉండవచ్చునంటున్నారు. 2025 అక్టోబరు 15 లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు 15 లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి, ప్రచురించాలి. నవంబరు 1 నుంచి 15 లోగా ఎన్నికల >>2

# శ్రీశైలం నుంచి భారీగా లీకేజి




### 3,10 గేట్ల నుంచి దిగువకు వృధాగా పోతున్న నీరు

**హైదరాబాద్,సెప్టెంబరు4,ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు కు చెందిన 3,10నంబరు గేట్లులీక్ కావడంతో దిగువకు వృధాగా నీరు పోతున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో ఉన్న శ్రీశైలం డ్యామ్‌కు వర్షాకాలం ఆరంభంలో మరమ్మతులు చేశారు. గేట్లకు లక్షల రూపాయలు వ్యయంచేసి రబ్బరు సీళ్ళు బిగించారు. రెండునెలలుకూడా కాకముందే లీకేజి అరికట్టాల్సిన రబ్బరు సీళ్ళు విఫలమైనాయి. ఇంజనీర్ల పర్యవేక్షణ లేకవడంతో తూతూ మంత్రంగా ఆపరేషన్ అండ్ మేంటనెన్స్ పనులు చేయడంతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైంది. శ్రీశైలం డ్యామ్ ఉనికి ప్రమాదంగా లీకేజి మారింది. ఈ సంవత్సరం శ్రీశైలం జలాశయం త్వరగా నిండింది. కానీ ఆ నీటిని నిలుపుకోలేని పరిస్థితి నెలకొంది. శ్రీశైల జలాశయానికి జూరాల నుంచి ఈ ఏడాది జూన్ 1 నుంచి, సుంకేసుల నుంచి జులై 5 నుంచి వరద ప్రవాహం ప్రారంభమైంది. బుధవారం నాటికి 1133.57 టీంఎంసీల వరద నీరు వచ్చి చేరింది. 43 రోజుల పాటు శ్రీశైల జలాశయం గేట్లు ఎత్తారు. వరద >>2

## భారత ప్రభుత్వం

## రోడ్డు రవాణా మరియు హైవేస్ మంత్రిత్వ శాఖ




సంబంధిత ఆసక్తి పరులు వివరాలను పరివాహన్ వెబ్‌సైట్ https://parivahan.gov.in/ పై వీక్షించవచ్చును.

మరింత ఎక్కువ స్పష్టతలకు దయచేసి ఇ-మెయిల్: id helpdesk-vahan[at]gov[dot] in మరియు helpdesk-sarathi[at]gov[dot]in కు చేయండి.

CBC 37101/13/0010/2526

05-09pg2fBVTK VJA_05-09pg2fBVTK.qxd 9/5/2025 12:17 AM Page 1





అనంతనాగ్‌లో గురువారం నీట మునిగిన పలు కాలనీలు

## శ్రీశైలం నుంచి భారీగా లీకేజి

>> తగ్గడంతో గేట్లు మూసివేశారు. ప్రస్తుతం జలాశయంలో 883.20 అడుగులు, నీటినిల్వ 205.6627 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ నుంచి( జూరాల, సుంకేసుల) 1,73,883 క్యూసెక్కుల వరద వస్తోంది. విద్యుదుత్పత్తి చేస్తూ 66,568 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

## 80 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్సీ సన్నాహాలు

>> తెలిపారు. అలాగే గ్రూప్2కు సంబంధించి 1,634 మంది అభ్యర్థుల కంటిచూపు, 24 మంది వినికిడి సామర్థ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు కూడా రావాల్సి ఉందని వివరించారు. ఫలితాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని అభ్యర్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇక అటవీ శాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి మాట్లాడుతూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఈ నెల 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రాజాబాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 287 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై వివరాలను జాగ్రత్తగా నింపాలని, వైట్‌నర్ వాడినా లేదా సమాధానాలు చెరిపివేసినా ఆ పత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించారు. ప్రతి మూడు తప్పు సమాధానాలకు ఒక నెగటివ్ మార్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## 3 నెలల ముందే స్థానిక ఎన్నికలు!

>> అధికారుల నియామకం పూర్తి చేయాలి.నవంబరు 16 నుంచి 30 లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు,ఈవీఎంలు సిద్ధం చేయడం,సేకరణ వంటివి పూర్తి చేయాలి. డిసెంబరు 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి.డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి.2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి,అదే నెలలో ఫలితాలు ప్రకటించాలి.

## నేడు మదగడ గిరిజన గ్రామానికి డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 5వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు వ్యాలీ మండలం, మదగడ గిరిజన గ్రామాన్ని సందర్శిస్తారు. మదగడ గ్రామస్తులు నిర్వహించుకునే ఆదివాసీ సంప్రదాయ ఉత్సవం బలి పొరోబ్ లో పాల్గొంటారు. మదగడ గ్రామ పంచాయతీ పరిధిలో మాత్రమే 12 రోజులపాటు నిర్వహించే బలి పొరోబ్ ఉత్సవాలు గత నెల 25వ తేదీన ప్రారంభమయ్యాయి. అల్లూరి జిల్లాతోపాటు మన్యం జిల్లా, ఒడిశా రాష్ట్ర ఆదివాసీలు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. గిరి పుత్రుల ఆహ్వానం మేరకు చివరి రోజు ఉత్సవాలకు ప్రవన్ కళ్యాణ్ గారు హాజరవుతారు.

## మద్యం కుంభకోణంలో సజ్జల భార్గవ్‌రెడ్డి పాత్ర కీలకం!

### 12 కంపెనీల్లో సిట్ సోదాలు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న భీమ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీ సంస్థ చిరునామాకు వెళ్లి తనిఖీలు చేయగా అక్కడ ఈషా ఇన్‌ఫ్రా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట మరో కంపెనీ కూడా ఉన్నట్లు తేలింది. భీమ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీలో సజ్జల భార్గవరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రపతి ప్రద్యుమ్న డైరెక్టర్లుగా ఉన్నారు. ఈషా ఇన్‌ఫ్రా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ ప్రద్యుమ్న డైరెక్టర్‌గా ఉన్నారు. మద్యం ముడుపుల సొమ్మును ఈ కంపెనీల ద్వారా రూటింగ్ చేసినట్లు సిట్ అనుమానిస్తోంది. ఎర్రచందనం స్మగ్లర్, చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జి, ఆ పార్టీ తరఫున గత ఎన్నికల్లో పోటీచేసిన విజయానందరెడ్డికి చెందిన నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లో సిట్ బృందాలు బుధవారం సోదాలు చేశాయి. అపార్ట్‌మెంట్ పైభాగంలో ఆయన ఇల్లు, కింద కార్యాలయం ఉన్నాయి. సోదాలు చేసినప్పుడు ఆయన కార్యాలయంలో లేరు. సీఎంఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ చిత్తూరు నలందానగర్ బీవీరెడ్డి కాలనీలోని నిఖిలానంద అపార్ట్‌మెంట్, డోర్ నంబర్ 2 -1251-4 చిరునామాతో రిజిస్టర్ కావడంతో సిట్ బృందాలు అక్కడికి వెళ్లి తనిఖీలు చేశాయి.

## జిఎస్టీ సంస్కరణలు దసరా గిఫ్ట్

### ప్రజలకు దీపావళి కానుక కూడా ఇస్తాం

### విపక్షాల విమర్శలకు చెక్‌పెట్టిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జిఎస్టీలో తెచ్చిన తాజా సంస్కరణలపై స్పందించిన మోడీ విపక్షా లపై ధ్వజమెత్తారు. ప్రతి ఉత్పత్తి, వస్తువుపైనా కాంగ్రెస్ విపక్షాలు పన్నులువేసాయని, చిన్నపిల్లల వస్తువులు, చాక్లెట్లు మిఠాయిలను కూడా వదల్లేదని ఆయన ఆరోపించారు. నిత్యావసరాలు ఆహారం, వైద్యరంగంలోని మందులపైనా అత్యధిక పన్నులు వేసారని ఆరోపించారు. 2014లో తాను అధికారంలోకి రాకముందు కిచెన్‌లో వాడుకునే సామగ్రి, వ్యవసాయ ఉత్పత్తులు, మందులు, జీవితబీమా వంటి అన్నింటిపైనా పన్నులు ఎలాంటి మినహాయింపులేకుండా విధించారని ఆరోపించారు. టూత్‌పేస్ట్, సబ్బులు, హెయిరా యిల్‌లను 27శాతం పన్నులువేసారని, 18 నుంచి 28శాతం ఆహారం తినడానికి వాడే ప్లేట్లు, కప్‌ప్లేట్లు, స్పూన్లు, చివరకు పండ్లపొడిమీదకూడా 17శాతం పన్నువేసారన్నారు. ఇక చిన్నపిల్లలు తినుబండారాలపైనా కాంగ్రెస్ ప్రభుత్వం 21శాతం పన్నులువేసిందని దుయ్యబట్టారు. కోట్లాదిమంది ప్రజలు విభిన్న రంగాల నిపుణులు 17శాతానికి పన్ను తగ్గించాలనికోరారు. లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు స్వయం ఉపాధికి 16శాతం సుంకాలు వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఇళ్లనిర్మాణమే కష్టంగా మారిందని, 29శాతం సిమెంట్‌పై పన్నులువేసారన్నారు. అలాగే ప్రయాణాలుచేయడం కూడా మధ్యతరగతికి భారంగా ఉండేదని, హోటల్ గదులపై 14శాతం సుంకాలు వేసారన్నారు.

## పక్షి ఢీకొని నిలిచిపోయిన ఎయిరిండియా విమానం

**గన్నవరం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** గన్నవరం విమానాశ్రయంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో పక్షి ఢీకొట్టడంతో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి విమానాన్ని నిలిపి వేయటంతో ప్రమాదం తప్పింది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం బెంగుళూరు నుండి గురువారం ఉదయం 7.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. తిరుగు ప్రయాణంలో 100 ప్రయాణికులతో బయలుదేరిన విమానం గన్నవరం విమానాశ్రయంలో టేకాఫ్ కు రన్‌వేపై స్పీడ్ అందుకునే క్రమంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమైన పైలట్ విమానానికి అత్యవసర బ్రేక్‌లు వేసి నిలిపి వేసారు. వేగం అందుకుంటున్న క్రమంలో బ్రేక్‌లు వేయటంతో విమానం కుదుపులకు గురయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందగా విమానం నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన పైలట్ విమానాన్ని టాక్సీ వేలోకి తీసుకువచ్చి నిలిపివేసారు.విమానంలోని ప్రయాణికులందరినీ టెర్మినల్ భవనంలోకి తరలించారు.కొంతమంది ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రేపటికి వాయిదా వేసుకోగా మిగిలిని వారిని వేరే విమానంలో హైదరాబాద్ మీదుగా బెంగుళూరుపంపించారు. దెబ్బతిన్న విమానానికి మరమత్తులు చేపట్టారు.

## చవితి వేడుకల్లో అపశ్రుతి డ్యాన్స్ చేస్తూ 22 యేళ్ల యువకుడు మృతి!

**విజయనగరం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లా కేంద్రంలో జరుగుతున్న చవితి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. వేడుకల్లో భాగంగా చెవులు దద్దరిల్లేలా వినిపిస్తున్న డీజే సౌండ్ మరో ప్రాణాన్ని బలిగొంది. అది కూడా నిండా పాతికేళ్ళు కూడా నిండని యువకుడిని బలి తీసుకుంది. జిల్లా కేంద్రంలోని బొబ్బాదిపేటలో వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్ బాక్సుల ముందు డాన్స్ చేస్తూ బొబ్బాది హరీశ్ (22) అనే యువకుడు ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే అతడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆస్పత్రికి వచ్చేటప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అతడు ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం కూడా సాధించాడు. సంబరాల సంగతి ఎలా ఉన్నా డీజేలో వచ్చే భారీ శబ్దాల ధ్వని గుండెపై ఎఫెక్ట్ చూపిస్తుందని వైద్యులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

## వారం - వర్జ్యం

05-09-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
త్రయోదశి రా.3.11
శ్రవణ రా.11.34
వర్జ్యం : రా.3.27-తె.5.00
దు.ఉ.8.25-9.15, 2) మ.12.32-మ.1.22
శుభసమయం : ఉ.6.30-7.15,సా.7.30-8.10
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీకు సానుకూల పడని వ్యవహారాలు అనూహ్యంగా సానుకూలపడతాయి.

**వృషభం:** సమాజంలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసుకొంటారు.

**మిథునం:** తనఖాలో ఉంచిన డాక్యుమెంట్లను విడుదల చేసుకుంటారు. వాహనయోగం.

**కర్కాటకం :** ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందించగలుగుతారు. వస్తు సేకరణ.

**సింహం:** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు.

**కన్య :** వీసా పాస్‌పోర్ట్ అంశాలు కలిసి వస్తాయి. రాజకీయ విభేదములకు ఆస్కారమున్నది. జాగ్రత్త వహించండి.

**తుల :** స్వంత విషయములలో ఇతరుల జోక్యమును రానీయకండి. పంచాయితీలు మధ్యవర్తిత్వము రాణించరు.

**వృశ్చికం:** వ్యతిరేక వాతా వరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** నష్టం రావలసిన చోట నష్టం రాదు. స్పెక్యులేషన్ మధ్యస్తంగా ఉంటుంది.

**మకరం:** కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురి చేసినా, ఆచరణలో చెడుఫలితాలను మాత్రం ఇవ్వదు.

**కుంభం:** విదేశాలలోని మీ బంధుమిత్ర వర్గ సహాయసహకారాలు అందుతుంటారు.

**మీనం :** ముఖ్యమైన జఠిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రజలందరికి ఆరోగ్య బీమా

>> పీఎం జేఏవై డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ స్కీమ్ హైబ్రెడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీ తయారీ అమలుకు మంత్రిమండలిలో ఆమోదం తెలిపింది టెండర్ కమిటీలో స్వల్ప మార్పులు చేసి ప్రీబిడ్‌కు ఆమోదం తెలిపింది. జనవరి 1, 2025 తర్వాత చేయాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకోంది. ఏపీ మున్సిపాలిటీ యాక్ట్ 1965, ఏపీసీఆర్డీఏ యాక్ట్ 2014, ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ 2016లను సవరణ చేయడంతోపాటు డ్రాఫ్ట్ ఆర్డినెన్స్ జారీ ద్వారా యూఎల్బీ, యూడీఏ, ఏపీసీఆర్డీఏ రాజధాని ప్రాంతం మినహాయించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు ఫీనలైజేషన్ చేస్తూ రెగ్యూలరైజ్‌కు అవకాశం కల్పించింది ఆగస్టు 28వ తేదీన నిర్వహించిన ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా మదర్ డెయిరీ ఫ్రూట్ అండ్ వెజిటేబుల్ ప్రైవేట్ లిమిటెడ్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లకు కేబినెట్ ఆమోదం తెలపనుంది.

ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా చూసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, అధాని విల్మర్ లిమిటెడ్, ధైరోమర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, రామ్ సై బయో ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సర్వరాయ షుగర్స్ లిమిటెడ్, పట్టాడి ఆగ్రోఫుడ్స్‌లకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహం అందజేయడంపై చర్చించి నిర్ణయం తీసుకుంది. ఎస్ఐపీబీ సమావేశం నిర్ణయాల్లో భాగంగా అపోలో టైర్స్ లిమిటెడ్ సంస్థ గ్రౌండింగ్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది ఎస్ఐపీబీ నిర్ణయాల్లో భాగంగా వరాహ ఆక్వా ఫామ్స్ , అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రపెన్యూర్స్ ఆఫ్ ఇండియా, జె కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రతిపాదనల ద్వారా పీపీపీ పార్క్ పాలసీని అనుసరించి ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ నిర్ణయాల్లో భాగంగా పీపీపీ పార్క్ పాలసీని అనుసరించి ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఇఫ్కో కిసాన్ సెజ్ లిమిటెడ్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

**పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలలు**

కొత్త వైద్య కళాశాలల విషయంలోను కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పీపీపీ విధానంలో రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదాన్ని తెలిపింది. రెండు దశల్లో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలో పిపిపి పద్ధతిలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. రెండో దశలో మిగిలిన ఆరు ప్రాంతాల్లోని వైద్య కళాశాలలను పీపీపీ కింద ఏర్పాటు చేసేందుకు ఫీజిబిలిటీ రిపోర్టు సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఆదోని, మదనపల్లి,మార్కాపురం, పులివెందుల, పెను గొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల , పార్వతీపురంలో నూతనంగా పది మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు పీపీపీ మోడ్‌లో కేబినెట్‌ఆమోదించింది. వీటిలోఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల లో ఫేజ్1లో పీపీపీ మోడ్‌లో చేపట్టాలని నిర్ణయం తీసు కోంది మిగిలిన ఆరు మెడికల్ కళాశాలలకు ఫీజిబిలిటీ రిపోర్ట్, డ్రాఫ్ట్ ఆర్‌పీఎఫ్, కనెక్షన్ అగ్రిమెంట్ ఆమోదం తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టు నివారణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు. భావ ప్రకటన స్వేచ్ఛ ఉండొచ్చు కానీ అది శృతి మించ కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుల నివారణకు తీసుకురావాల్సిన విధి విధానాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. హోంమంత్రి అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని, పార్థసారథిలతో ఉపసంఘం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కొత్త చట్టం తీసుకొచ్చేందుకు నిబంధనల రూపకల్పనకు ఉపసంఘం కృషి చేయనుంది.తప్పుడు పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు ఉండేలా చట్టం ఉండాలని సీఎం వ్యాఖ్యానించారు. అక్రమ నిర్మా ణాలు క్రమబద్ధీకరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇకపై ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోకుండా అధికారులు కఠినంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం తాజా రాజకీయ అంశాల పై సహచరులతో చర్చించారు.జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రివర్గం అభినందనలు తెలిపింది. భారత్ త్వరలోనే ప్రపంచంలో తొలి 3 స్థానాల్లో ఉంటుందని సీఎం అభిప్రా యపడ్డారు. 2047 లక్ష్యాలకు అనుగుణంగా మొదటి స్థానంలో నిలుస్తామని సీఎం వెల్లడించారు. కేంద్రం తీసు కున్న ఈ నిర్ణయం భారతీయ సామాన్య,మధ్యతరగతి వర్గాలకు అత్యంత ప్రయోజనకరమన్నారు. మంత్రి వర్గ సమావేశం ముగిసిన సందర్భంలో సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులతో మాట్లాడుతూ మనం రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల లభ్యతను కల్పించామన్నారు.ఈ విషయంలో మంత్రులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఎరువులు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# వరద వణుకులో ఉత్తరాది



ఢిల్లీ శివార్లలో యమునా నది ఉధృతికి నీటమునిగిన కాలనీలు

### ఢిల్లీ, రాజస్థాన్, కాశ్మీర్, పంజాబ్, హిమాచల్‌లో భారీ వర్షాలు

### పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** ఉత్తరాది రాష్ట్రాలను జోరు వానలు వణికిస్తున్నాయి. దిల్లీ, జమ్మూకశ్మీర్, పంజాబ్‌లలో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. దిల్లీలో యమునా నది ప్రమాద స్థాయి 205.33 మీటర్లు దాటి ప్రవహిస్తోంది. పాత రైల్వే వంతెన వద్ద యమునా నది ప్రవాహం 207 మీటర్లకు చేరుకుంది. దీనివల్ల నిగమ్‌బోధ్ ఘాట్, యమునా బజార్ ప్రాంతాలు చెరువులను తలపిస్తు న్నాయి. కాళిందికుంజ్‌లోని పలు ప్రాంతాలు, విశ్వకర్మ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదలు అతలాకుతలంచేస్తుండటంతో లోతట్టు ప్రాంతాలప్రజ లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓల్డ్‌ఉస్మాన్‌పూర్, ఓల్డ్ గడీ మాండూ గ్రామాల్లోకి వరద చేరడంతో 2500 మందిని, వారి పెంపుడు జంతువులను సురక్షితప్రాంతాలకు తరలించారు.లోతట్టు ప్రాంతాలప్రజల్ని నాలుగు బృందా లు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. మరో 18 బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యమునా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నోయిడా సెక్టార్ 167 సమీపంలోని ప్రాంతాలు జలమయమయ్యాయి. సరయూ నది కూడా ఉధృతంగా ప్రవహిస్తుండగా పరివా హక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అటు రాజస్థాన్‌లోనూ జోరు వానలు కురుస్తున్నాయి. జైపుర్‌లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. టోంక్ రోడ్ సమీపంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. పంజాబ్, హరియాణాల్లోనూ వర్షాలు దంచికొడుతున్నాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సామగ్రిని పడవల ద్వారా చేరవేస్తున్నారు. జిరాక్‌పుర్‌లో భారీ వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంజాబ్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య 30కి చేరింది. హరియాణాలోని ఘగ్గర్ నదిలో నీటిమట్టం భారీగాపెరిగింది. చండీగఢ్‌లో జకీర్ హుస్సేన్ రోస్ గార్డెన్ వద్ద వరద పరిస్థితి తీవ్రంగా ఉంది. పంచ్‌కులలో పాఠశాల విద్యార్థులు వెళ్తున్న వాహనంపై చెట్టు విరిగిపడి, పలువురికి గాయాలయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎగువప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. అఖ్నూర్‌లో చీనాబ్ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సమీపంలోని గర్ఖాల్ గ్రామంలోకి భారీగా వరద చేరగా పెద్ద సంఖ్యలో ఇళ్లు నీట మునిగాయి. సుమారు 50 మంది వరదల్లో చిక్కుకోగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. ఉధంపూర్‌లోని థార్డ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆర్మీ, విదీఆర్ఎఫ్, శీదీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఛత్తీస్‌గఢ్ బలరాంపూర్ జిల్లా ధనేష్‌పూర్ గ్రామంలో ఓ చిన్న డ్యామ్ కూలి ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గల్లంతయ్యారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని.. అధికారులను ఆదేశించారు.

# తురకపాలెంకు కదిలిన అధికార యంత్రాంగం

### మరణాలకు దారితీసిన అంశాల నమోదుకు చర్యలు

### రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడి

### గ్రామంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితోపాటు అధికార యంత్రాంగం పర్యటన



మీడియాతో గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 4:** గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాల నమోదుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ తెలిపారు. గురువారం గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలలో 20 మరణాలకు దారితీసిన కారణాలను పరిశీలించడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మితో కలసి గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను, పరీక్షల వివరా లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ మీడి యా వారితో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని శాఖల నుండి మెకాని జంను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో ప్రతి రోజు సమీక్షించడం జరుగుతుందన్నారు. ఇది ఒకే గ్రామంలో జరగడం వలన దినపత్రికలల్లో, టీవీ న్యూస్ ఛానెల్స్‌లో ప్రసారం అవుతున్నందున ఇందుకు గల కారణాలను తెలుసుకోవడానికి నిపు ణుల బృందాన్ని రెండు రోజుల క్రితం ఏర్పాటు చేయడం జరిగిం దని, బృందం ప్రాథమిక నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. నివేదిక ప్రకారం నిర్ణయానికి రావడం సాధ్యపడదని, మెలైడియోసిస్ అని, ఆల్కహాల్ అని చెపుతున్నారని, రక్త నమూనాల పరీక్షల నివేదిక అనంతరం కారణాలను విశ్లేషించడం జరుగుతుందన్నారు. త్రాగుడు అలవాటు ఉన్నవారు 9 మంది చనిపోయారని చెపుతున్నారని, కేవలం త్రాగుడు వలనే చనిపోయారని చెప్పడం సరికాదన్నారు. గ్రామం గురించి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రసారం చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు పరిస్తితి అదుపులోనే వుందని పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతున్నదన్నారు. 12 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరి నుండి బ్లడ్, యూరిన్‌శాంపిల్స్ తీసుకుని 45 పారామీ టర్స్ క్రింద టెస్ట్ చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఎవరికైనా జ్వరం వుంటే బ్లడ్ కల్చర్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 32 మందికి బ్లడ్ కల్చర్ కి శాంపిల్స్ సేకరించడం జరిగిందన్నారు. జ్వరం వున్నవారు మెడికల్ క్యాంపుకు వచ్చి రక్తనమూనాలు అం దించాలని, రాలేని వారు తెలియజేస్తే వైద్య బృందం ఇంటికి వెళ్ళి రక్త సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు కోసం 14 మందితో ల్యాబ్ టెక్నీషియన్స్‌తో బృందాన్ని నియమించడం జరిగిందన్నారు. కల్చర్ టెస్ట్‌రిపోర్ట్‌కు 72 గంటలు పడుతుందన్నా రు. రిపోర్ట్స్ వచ్చిన తరువాత ఎటువంటి యాక్షన్ ప్లాన్ రూపొం దించాలో నిర్ణయం తీసుకొని పకడ్బంధీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పని లేద ని జిల్లా కలెక్టర్ చెప్పినట్లు ప్రతి నెల సాధారణ డెత్‌రేట్ వుం దన్నారు. జూలై, ఆగష్టు మాసాలలో ఎక్కువ మంది చనిపోయి నందున అందుకు గలకారణాలను విశ్లేషించడం జరుగు తున్నదన్నారు. రెండు మూడు రోజులలో కారణాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ బదులిస్తూ ప్రభుత్వం నుండి చనిపోయిన వారి మెడికల్ బిల్స్ తీసుకుని సీయంఆర్ఎఫ్ ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలుగా మరణాలు ఎక్కువగా వున్నాయని , ప్రభుత్వం మెడికల్ టీం ను పంపి గ్రామంలో ఎంత మంది చనిపోయారు , ఏ వ్యాధి కారణంతో చనిపోయారు , ఏఏ ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నారు తదితర అంశాలపై నివేదిక తీసుకోవడం జరిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన సంభవించే సహజ మరణాల కన్నా జూలై , ఆగష్టు మాసాలలో ఎక్కువ మరణాలు సంభవించినందున ఇందుకు గల కారణాల అన్వేషణ కోసం జీజీహెచ్ , గుంటూరు మెడికల్ కళాశాల నుండి డాక్టర్స్ ను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 14 టీములను జనరల్ మెడిసిన్ , బయోకెమిస్ట్రీ , పాథాలజీ , మైక్రో బయోలాజీ , తదితర ఆరు విభాగాల నుండి బృందాలను నియమించడం జరిగిందన్నారు. వీరితో పాటు రెగ్యులర్ మెడికల్ స్టాఫ్ , ఆశా వర్కార్లను కూడా నియమించడం జరిగిందన్నారు. ఈ టీములన్ని ఈ నెల రెండవ తేదీ నుండి గ్రామంలో ఇంటింటికి మరియు మెడికల్ క్యాంప్ వద్ద సర్వే చేపట్టడం జరుగుతున్నదన్నారు. గ్రామంలో 870 గృహాలు వున్నాయని , ఇప్పటి వరకు 400 గృహాలను సర్వే చేయడం జరిగిందని , మిగిలిన గృహాలను రెండు రోజులలో సర్వే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మరణాలు ఇక్కడే ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయో మల్టీ డిపార్ట్మెంట్ ఎనాలసిస్ చేపట్టడం జరుగుతున్నదన్నారు. వాటర్ శాంప్లిల్స్ టెస్టింగ్ కు ఇవ్వడం జరిగిందని , కెమికల్ ఎనాలసిస్ రిపోర్ట్ సాధారణంగానే వుందన్నారు. బ్యాక్టీరియ లాజికల్ రిపోర్ట్ అందవలసి వుందన్నారు. సాయిల్ టెస్ట్ కూడా చేపట్టడం జరిగిందన్నారు. మరణాలకు గల కారణాలు తెలియాలంటే మూడు రోజులు సమయం పడుతుందన్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో వున్న భయాలను పోగొట్టేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. క్వారీ నుండి ఏర్పడే పొల్యూషన్ ను అధ్యయనం చేయడానికి టీమును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చనిపోయిన వారికి సంబంధించి మెడికల్ బిల్స్ చెల్లింపుకు సీయంఆర్ఎఫ్ కు పంపడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా, పత్రికలలో ప్రజలను భయాందోళనకు గురి చేసే విధంగా నిరాధార వార్తలు వ్యాప్తి చేయకుండా వుండాలని కోరుతున్నానన్నారు. ఈ పర్యటన కార్యక్రమంలో ఆర్ డి ఓ కె.శ్రీనివాస రావు , జెడ్ పీ సీఈఓ జ్యోతిబసు, డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రావణ్ బాబు , తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**తురకపాలెంలోని మరణాల కారణాలపై సమగ్ర అధ్యయనం చేయాలి-మంత్రి శ్రీ సత్యకుమార్**

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలుసర్వైలెన్స్ ఖీ వ్యవస్థను పటిష్ఠం చేయాలి,తురకపాలెం మరణాలపై మంత్రి సమీక్ష.. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలోని మరణాలకు దారితీసిన కారణాలను సమగ్రంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ న్యాయవాదుల పారితోషికంపై స్పష్టత

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారుల తరపున వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాదులకు జీపీకి చెల్లించే పారితోషికం రెమ్యూనరేషన్ విషయంలో స్పష్టతనిస్తూ ప్రభుత్వం బుధవారం జిఓ జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎంత మంది ప్రతివాదులు,అధికారులు ఉంటే అంతమంది తరపునా జీపీలు వేర్వేరుగా వకాలత్‌లు దాఖలు చేసినట్లు,ఒక్కో అధికారికి రూ.5వేల చొప్పున రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ కొన్ని శాఖల నుంచి క్లెయింలు వస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ఆయా కేసుల్లో ముఖ్య శాఖకు సంబంధించిన అధికారి విషయంలోనే జిపి పారితోషికం చెల్లిస్తారని, ఎంతమంది ప్రతివాదులు ఉంటే వారందరికీ కాదని స్పష్టం చేసింది. బహుళ చెల్లింపులను నిలువరించేందుకు,చెల్లింపుల్లో ఒకే విధానాన్ని అనుసరించేందుకు...కోర్టు ధిక్కరణ కేసులలో సంబంధిత శాఖ...క్రియాశీలక మైనది,ముఖ్య మైనది అని తెలుపుతూ మిడిల్ లెవల్ ఆఫీసర్ హోదాకు తగ్గని అధికారి సర్టిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంది. ఈ విధానాన్ని అన్ని శాఖలూ పాటించాలని స్పష్టం చేసింది.



## జీఎస్టీ శ్లాబ్‌లు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయంపై సిఎంచంద్రబాబు హర్షం

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ స్లాబ్‌లు తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. జీఎస్టీ స్లాబ్ లను మారుస్తూ తీసుకువచ్చిన సంస్కరణల్ని స్వాగతిస్తున్నట్టు ట్వీట్ లో సీఎం సేర్కొన్నారు. నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్యరంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయన్న సీఎం ఈ నిర్ణయం పేదలకు వరంగా, అభివృద్ధి కారకం. సమాజంలోని వేర్వేరు వర్గాలకు ప్రత్యేకించి రైతుల నుంచి వ్యాపారుల వరకూ ప్రయోజనం కలుగుతుందనీ పేర్కొన్న ముఖ్యమంత్రి విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ గారికి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి అభినందనలు తెలియచేస్తున్నాననీ ట్వీట్ లో పేర్కొన్న ముఖ్యమంత్రి పౌరులకు ఉపకరించేలా తీసుకున్న ఈ నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు పన్నుల వ్యవస్థను వ్యూహాత్మకంగా మార్చడంతో పాటు ప్రతీ భారతీయుడి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయనీ స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు జీఎస్టీ స్లాబ్ లను మారుస్తూ తీసుకువచ్చిన సంస్కరణల్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఫలితంగా నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్య రంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు.ఈ నిర్ణయం పేదలకు వరంగా, అభివృద్ధి కారకంగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. సమాజంలోని వేర్వేరు వర్గాలకు, ప్రత్యేకించి రైతుల నుంచి వ్యాపారుల వరకూ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.. జీఎస్టీ స్లాబ్స్ తగ్గిస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి అభినందనలు తెలియచేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణలపై ఇచ్చిన హామీని నెరవేర్చిందని ఉద్ఘాటించారు. ఇప్పుడు జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా తదుపరి తరం సంస్కరణలను ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు పవన్ కల్యాణ్. పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల ఆరోగ్య సంరక్షణకు ఇది గణనీయమైన ఉపశమనమని చెప్పుకొచ్చారు. విద్య, బీమాపై జీఎస్టీని పూర్తిగా తొలగించడం వల్ల ప్రజలకు భారం లేకుండా ఉంటుందని వెల్లడించారు. పేదల భవిష్యత్తును మరింత వృద్ధి చేయడాన్ని తాను ప్రత్యేకంగా స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.

జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం చేసిన సంస్కరణలు (బిలీగ ట్లిస్సు) కోట్ల కుటుంబాల కష్టాలను తగ్గిస్తాయని కొనియాడారు. ప్రజల సంక్షేమంపై స్పష్టమైన దృష్టితో ఈ సంస్కరణలను తీసుకు వచ్చినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1కోటి విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లలో ఒకటైన ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు ఏకంగా ఓ దాత కోటిరూపాయలుపైగా విరాళం అందించాడు. తూర్పుగోదావరిజిల్లా వెలివెన్నుకు చెందిన శశి విద్యాసంస్థల అధినేత రవికుమార్ బురుగుపల్లి సంస్థ తరపున గురువారం ఉదయం ఈ భారీ మొత్తాన్ని అందజేశాడు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలసిన శశివిద్యాసంస్థల అధినేత రవికుమార్ దంపతులు 1,01,11,111 రూపాయలు విరాళాల డిడిని అందజేశాడు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు.

## శ్రీవారి చెంత తెలంగాణ సిఎస్ రామకృష్ణరావు



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణరాష్ట్రంనూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణరావు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. ఇక్కడ పద్మావతి అతిదిగృహాల సముదాయంలో ఆయనకు టిటిడి వసతికల్పన విభాగం సాదర స్వాగతం పలికింది శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారి దర్శనం చేసుకుంటారు.

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు మాజీ జడ్జి జాస్తి చలమేశ్వర్



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని గురూవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ జాస్తి చలమేశ్వర్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శుభాలు: ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు సినీనటులు తెలిపారు. గురువారం ఉదయం సినీనటుడు వరుణ్‌సందేశ్ కుటుంబంతో కలసి, సినీనటి శ్వేతపరాశర్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు

### - రాజకీయవ్యాఖ్యలు, రీల్స్ నిషేధమంటూ టిటిడి సూచన




**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటంలో భాగంగా ఆలయం ముందు పరిసరాల్లోగానీ తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయడం,అభ్యంతరకరమైన రీల్స్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేయడం నిషేధిస్తూ టిటిడి హెచ్చరించింది. అంతేగాక ఏకంగా ఈ నిబంధనలు పాటించాలని భక్తులకు,ప్రముఖులకు, రాజకీయనేతలకు విజ్ఞప్తి చేస్తూ ఆలయం ముందు ఏకంగా సూచనలతో రూపొందించిన బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరిక చేశారు. తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటంలో ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. అంతేగాక కొండపైభగవన్నామస్మరణ తప్ప మరెలాంటి పదం వినిపించకూడదని సిఎం చంద్రబాబు తనదైన శైలిలో తెలిపారు. ఈ నేపథ్యంలో గతనెలలో వైసిపికి చెందిన కడపజిల్లా నేత,వైఎస్ జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి రాజకీయ వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారం రేపింది. దీనిపై టిటిడి కూడా తీవ్రంగానే పరిగణించింది. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చిన రాజకీయప్రముఖులు, నాయకులు, ఇతరులు ఎవరూ కూడా రాజకీయంగా వ్యాఖ్యలు చేయరాదని, మరీ సామాజిక మాధ్యమాల్లో రీల్స్ కూడా నిషేధించినట్లు టిటిడి తెలిపింది. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించి తిరుమల పవిత్రతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఎల్లుండి శ్రీవారి ఆలయం మూత

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం కారణంగా 7వతేదీ ఆదివారం 12గంటలు పాటు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నారు. 7వతేదీ సాయంత్రం 3.30గంటల నుండి 8వతేదీ వేకువజామున 3గంటల వరకు ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సెప్టెంబర్ 7వతేదీ రాత్రి 9.50గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 8వతేదీ వేకువజామున 1.31గంటల వరకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న తెల్లవారుజామున 3గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా జరుపుతారు. ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పున:ప్రారంభమవుతుంది. ఆదివారం ఆలయంలో ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

## రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి : జిఎం ఎస్‌కె శ్రీవాత్సవ



రైల్వే జోనల్ వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎస్‌కె శ్రీవాత్సవ

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే అహర్నిషలు కృషి చేస్తుందని జనరల్ మేనేజర్,జెడ్‌ఆర్‌యూసిసి ఛైర్మన్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ,డిప్యూటీ జనరల్ మేనేజర్,కార్యదర్శి ఉదయ్‌నాథ్ కోట్లలు అన్నారు. రైల్ నిలయంలో నిర్వహించిన 76వ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఏపి రాష్ట్రానికి చెందిన ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అమలాపురం ఎంపి జీఎం హరీష్ బాలయోగి,సభ్యులు రవి అగర్వాల్,కె నాగేశ్వర్ రావు, ఎ వెంకట రంగయ్య తో పాటు మరో 17మంది సభ్యులు,దక్షిణ మధ్య రైల్వేకి చెందిన వివిధ విభాగాల ప్రధాన అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, కార్యదర్శి ఉదయ్‌నాథ్ కోట్లలు సమావేశంలో ప్రారంభ ఉపన్యాసం చేస్తూ రైల్వే జోన్ సాధించిన విశేష పనితీరును వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే తొలి ఐదు మాసాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒరిజినేటింగ్ రెవెన్యూను రూ.8,593కోట్ల స్థూల ఆదాయాన్ని అర్జించామని తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60.4మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న నూతన రైలు మార్గాలు మినహా వందశాతం విద్యుదీకరణ పూర్తి చేసామని,దక్షిణ మధ్య రైల్వే మీదుగా మొత్తం 6532రూట్ కి.మీలలో 4655రూట్ కి.మీలకు భారతీయ రైల్వేల స్వదేశీ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ అయిన కవచ్ తాజావర్షన్ 4.0మంజూరు చేయబడిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన,అనుసంధానం పెంపు గురించి వివరిస్తూ ప్రత్యేక శ్రద్ధతో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేశామని కాజీపేట-బల్హార్షా, కాజీపేట-విజయవాడ, విజయవాడ- గూడూరుల మధ్య ట్రిప్లింగ్ రైలు మార్గాలు చివరి దశలో ఉన్నాయన్నారు. జోన్‌లో 78స్టేషన్లలో సిసిటివి నిఘా వ్యవస్థ ఏర్పాటు, మరో 453స్టేషన్లకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. స్టేషన్ పునరాభివృద్ధి,ప్రయాణికుల సౌకర్యాలు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 119స్టేషన్ల పునరాభివృద్ధి జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ బేగంపేట, కరీంనగర్,వరంగల్లు స్టేషన్లను మే 2025లో ప్రారంభించారని తెలిపారు. ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలను అందించడంలో భాగంగా 208లిఫ్టులు, 92ఎస్కలేటర్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయని, ఈ ఏడాది మరో 7లిఫ్టులు,4 ఎస్కలేటర్లను ప్రారంభించామని భద్రతా వేగవంతం చేశామని చెబుతున్నారు.

## పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### - మంత్రి ఎన్‌ఎండి ఫరూక్

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎటీ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ తెలిపారు. మెగా డిఎస్‌సిలో సిఇడిఎం ఆధ్వర్యాన శిక్షణ పొందిన 152 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే వివిధ ఉద్యోగాలకు జరగబోయే పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే మైనార్టీ విద్యార్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో నైపుణ్యం కలిగిన సిబ్బందితో శిక్షణ ఇస్తున్నామన్నారు. మెగా డిఎస్‌సి పరీక్షలకు సిఇడిఎం పర్యవేక్షణలో 1,780 మంది మైనార్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1,200 మంది అభ్యర్థులు అర్హత కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకుని విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన 152 మందిని ఆయన అభినందించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ మందికి సులభంగా సేవలు చేరేందుకు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

## నిమజ్జనోత్సవానికి కదిలిన వినాయకులు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం గురువారం వినాయక నిమజ్జనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని సుమారు 400 ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. ఐదవ రోజు సుమారు 250 వినాయక ప్రతిమలను తెలుగుగంగ కాలవలో నిమజ్జనం చేసారు. గురువారం 9వ రోజు నిమజ్జనోత్సవానికి భారీ ఎత్తున ప్రధాన వినాయకులను నిమజ్జనానికి తరలింపు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ముఖ్యంగా బేరివారి మండపం వద్ద వినాయకుని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారథ్యంలో ఏర్పాటు చేసారు. ఇక్కడ లోక కళ్యాణార్థం సోమవారం గణపతి హోమాలను, నవగ్రహశాంతి హోమాలను భారీ ఎత్తున నిర్వహించారు.గురువారం సాయంత్రం నుంచి పట్టణంలో కోలా హాలంగా మారింది. బేరివారి మండపం వద్ద ప్రతిష్టించిన హంసవాహనంపై వినాయకుని అలాగే ఎపెండ్డి మండపం వద్ద ఏర్పాటు చేసిన పంచముఖ వినాయకుడు, ముత్యాలమ్మ గుడివీధిలోని కుమ్మరమిట్ట, సంతమైదానం, అలాగే మరి నాలుగుచోట్ల ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనానికి తరలించే కార్యక్రమాలు చేపట్టారు. ఇదో సందడిగా మారింది. మరి కొన్ని చోట్ల వినాయకులను 11వ రోజు నిర్వహించుటకు నిర్ణ యించారు. వినాయక నిమజ్జ నోత్సవం సందర్భంగా యువకులు తలలకు కాషాయం రిబ్బన్లు ధరించి డిజె సౌండ్స్‌కు అనుకూలంగా నాట్యాలు చేస్తే స్టేప్‌లు వేసు కుంటూ ముందుకు సాగారు.జైబోలో గణపతి, గణపతి బొప్పా అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువకులతో పాటు సంప్రదాయ నృత్యాలను వినాయక ప్రతిమల ముందు ఏర్పాటు చేసారు. ఇక డిజెలో గాయకులతో హుషారు కల్పించే సినిమా పాటలతో సాగించారు. ఓవైపు సంప్రదాయ కోలాటాలు, భజనలతో శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధులు దద్దరిల్లి పోయాయి. ఇక ప్రతి వినాయకుని ఎదురుగా ప్రసాదాల వితరణ అందించారు. బేరివారి మండపం వద్ద వినాయకుని రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఉదయం నుంచి అక్కడే ఉండి వినాయక ప్రతిమను కదిలించే ముందు పూజలు నిర్వహింపజేసారు.



ఆయనతో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి డివైయస్‌పి నరసింహ మూర్తి వన్‌టౌన్ సిఐ డి.గోపి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముత్యాల పార్థసారధి,మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్,రామిశెట్టి సాయి, ఢిల్లి,రాజు రెడ్డి మురళి,సుబ్రమణ్యం ఉన్నారు.

## పాణ్యం-నంద్యాల మధ్య రైళ్ల నిర్వహణకు సిఆర్‌ఎస్ గ్రీన్ సిగ్నల్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్,విద్యుత్ రైలు మార్గంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం-నంద్యాల మధ్య పూర్తి చేసిన 14.53కి.మీల డబ్లింగ్, విద్యుత్ రైలు మార్గాల ద్వారా రైళ్ల రాకపోకల నిర్వహణకు రైల్వే భద్రతా కమిషనర్ మాధవి పచ్చజెండా ఊపారు. తొమ్మిది దశల్లో చేపట్టిన ఈప్రాజెక్టును భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పటిష్టంగా సమర్థవంతంగా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి దక్షిణ మధ్యరైల్వే నిర్మాణాల విభాగం సరికొత్త రికార్డును నెలకొల్పింది. దీంతో కేంద్ర పౌరవిమానయాన శాఖకు చెందిన రైల్వే భద్రతా కమిషనర్ మాధవి బృందం ఈ నెల 1న పాణ్యం-నంద్యాల మధ్య కొత్తగా నిర్మించిన డబ్లింగ్,విద్యుత్ రైలు మార్గాలను విస్తృత తనిఖీలు నిర్వహించి పలు సలహా, సూచనలతో అంచెలంచెలుగా నిర్ణీత వేగంతో రైళ్లు నడిపేందుకు అనుమతించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## అశ్వవాహనంపై విహరించిన గణనాథుడు



స్వామివారి తిరుకళ్యాణంకు టీటీడీ తరపున నూతన పట్టువస్త్రసాలను తీసుకువస్తున్న ఛైర్మన్ దంపతులు

**కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఉభయదేవేరులతో కలసి అశ్వవాహనంపై కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అలరించారు. ఈకార్యక్రమానికి బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజవంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులచే ఉదయం స్వామివారికి అష్టోత్తర శతకలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే రాత్రి సిద్ది బుద్ది సమేత గణనాధుడు సర్వాలంకృతులై అలంకార మండపంలో వేదపండితుల మత్రోచ్ఛారణ నడుమ అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పుష్పాలతో దేధీప్యమానంగా అలంకరించిన అశ్వవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి సా ంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. అసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులతో మొక్కులను తీర్చుకున్నారు. కమనీయం వరసిద్దుని కళ్యాణం కాణిపాకం బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి తిరుకళ్యాణం కమనీయంగా అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు స్వామివారి తిరుకళ్యాణం నిర్వహించడానికి తల్లిదండ్రులైన శివపార్వతులు పగలు కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేశారు. ఈసందర్భంగా అలంకృతులైన శివపార్వతులు మణికంఠేశ్వరాలయంలో అర్చకసా ్వముల పూజలందుకున్న అనంతరం కాణిపాకం,కాకర్లవారిపల్లె గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ తమ పుత్రుడు వరసిద్ధుని తిరుకళ్యాణానికి భిక్షాటన చేశారు. అనంతరం రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, దేధీప్యమానంగా అలంకరించిన కళ్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి, సమేత గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే నూతన వధూవరులైన సిద్ధి, బుద్ధి గణనాధులకు పుణ్యాహావాచనం, కంకణదారణ, యజ్ఞోపవీతం గావించి స్వామివారికి పాదపూజ చేశారు.

అనంతరం అశేష భక్తజనం నడుమ స్వామివారిచే ఉభయదేవేరులకు మాంగల్యదారణ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లు తలంబ్రాలు పోసుకునే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## పోలవరం పునరావాస కాలనీల మౌలిక వసతులకు రూ.739 కోట్లతో టెండర్లు

### - మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాత వార్తప్రతినిధి:** పోలవరం పునరావాస కాలనీల ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం రూ.739 కోట్లతో టెండర్లు పిలిచామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పోలవరం నిర్మాణంతోపాటు భూసేకరణ, పునరావాసం పనులకు సమ ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ, పోలవరం పునరావాస పనులపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ.. వర్షాకాలం, భారీ వరదల్లో సైతం డివాటరింగ్ చేస్తూ పోలవరం పనులు జరుగుతుండటంపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బట్రస్ డ్యామ్‌తో ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజ్‌ను కంట్రోల్ చేసి పనులు చేయగలుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్యాప్‌రాక్‌ఫిల్ పనులపై సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు, అదే సమయంలో మోడల్ డ్యామ్‌ను పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఏజెన్సీతోపాటు స్వయంగా ఇరిగేషన్‌శాఖ ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీ, నాణ్యత పరికరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ఎడమ, కుడి కాల్వల కనెక్టవిటీస్‌కు గ్యాంట్రీస్ సంఖ్యను పెంచి 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు వేగంగా జరుగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతీయ రహదారుల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనరు రామ్‌సుందర్‌రెడ్డి, అడ్వైజరు వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఎస్‌ఇ, ఇఇలు, ఏజెన్సీ ప్రతినిధులు హాజరయ్యారు.

## అక్టోబరు నుంచి సిబిటిలో రైల్వే కారుణ్య నియామకాల పరీక్షలు

### - అక్రమాలకు చెక్ - సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్న రైల్వే

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 4,ప్రభాతవార్త** ప్రస్తుతం రైల్వేలో జరుగుతున్న కారుణ్య నియామకాలకు సంబంధించిన వ్రాతపరీక్షల నిర్వహణపై వస్తున్న ఆరోపణలను చెక్ పెట్టేందుకు అక్టోబరు నుంచి దక్షిణ మధ్య రైల్వే సిబిటి(ఆన్‌లైన్)పద్ధతిలో వ్రాత పరీక్షలను నిర్వహించేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం. కారుణ్య నియామకాలకు సంబంధించి సమగ్ర సమాచారం వివరాలను ఆయా వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు తాము సేకరించిన తాజా సమాచారాన్ని వాటికి సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేసి డివిజన్,జోన్‌కు సంబంధించిన పిసిపిఓ/జనరల్ మేనేజర్‌లకు ఈ ఆఫీస్ ద్వారా పంపాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మొత్తం 664కారుణ్య నియామకాలకు సంబందించిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. డివిజన్‌లలో వివిధ కారణాలతో తిర స్కరించిన దరఖాస్తులకు సంబంధించిన వాటిని మూసి వేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జోన్ మొత్తంలో 101కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

వార్త

ఐకమత్యం ద్వారా చిన్న చిన్న రాజ్యాలు అభివృద్ధి చెందుతాయి. కాని విభేదాలు జనిస్తే పెద్దపెద్ద దేశాలే సర్వనాశనమౌతాయి.

-టాల్‌స్టాయ్

# ధర్నాలతో సామాన్యులు విలవిల!

ఎం కిపెల్లి సుబ్బిచావుకు వచ్చిన్నట్లుంది ఎందరో నాయకులు ఆత్మబలిదానంతో నిర్విరామకృషి తో సాధించిపెట్టిన సమ్మె, రాస్తా రోకో, ధర్నాలు వంటి నిరసన కార్యక్రమాలు కొన్నిసార్లు సామాన్యుల జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఏ నిబంధనలు అంటూ లేకుండా ఎవరికి వారు ఎక్కడపడితే అక్కడ అప్పుడు ఈ కార్యక్రమాలు చేపడుతుండడంతో సాధారణ ప్రజలు అల్లాడిపోతున్నారు. అపరిష్కృతంగా తమ సమస్య పరిష్కారం కోసం ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రకారం ముందు తెలిపి సమ్మెలు, ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించడంలో కొంత అర్థముంది. అందుకు అన్ని వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉంది. అదికూడా చర్చల ద్వారా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు, మరో దారి లేనప్పుడు సమ్మె మార్గాన్ని ఎంచుకోవడంలో తప్పుపట్టలేం. కానీ చెప్పాపెట్టకుండా ఆకస్మికంగాఇలాంటి కార్యక్రమాలు చేపడితే సామాన్య ప్రజలు ఎంతటి ఇబ్బందులకు గురవుతున్నారో పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం. ఎవరికి ఏ సమస్యలు వచ్చినా రోడ్లమీదకు వచ్చేస్తున్నారు. రాకపోకలను స్తంభింప చేస్తున్నారు. గంటల తరబడి రోడ్ల మీదనే గడపడం ప్రయాణికులు తట్టుకోలేకపోతున్నారు. ఆస్పత్రిలో సరైన చికిత్స అందలేదనో, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరిగాయనో ఇక రకరకాల కారణాలతో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా పది, ఇరవై మంది గుమ్మిగూడి రాకపోకలు స్తంభింప చేయడం మామూలైపోయింది. నగరాల్లోనే కాదు పట్టణాల్లోనూ కాదు, చివరకు పల్లెల్లో కూడా రోడ్డుకు అడ్డంగా వస్తున్నారు. పోలీసు స్టేషన్‌లో దౌర్జన్యం జరిగిందని, ఆ పోలీసు అధికారిపై చర్య తీసుకోవాలని ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు మూడుగంటలసేపు గ్రామస్తులు వాహనాలకు అంతరాయం కలిగించారు. ఇలా దేశవ్యాప్తంగా రాస్తారోకోలకు అంతేలేకుండాపోతున్నది. ఇందువల్ల ప్రయాణికులు ఎంత బాధపడుతున్నారో వారు గ్రహించడం లేదు. ముఖ్యంగా ఆస్పత్రికి వెళ్లే రోడ్డు సకాలంలో చేరుకోలేక వైద్యసహాయం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి సమస్యకు సమ్మె రాస్తారోకోలు చేస్తే తప్ప ప్రభుత్వ దృష్టిని ఆకర్షించలేమనే నమ్మకం రానురాను పెరిగిపోతుండడంతో ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. అసలు ప్రభుత్వాలు సకాలంలో చర్యలు తీసుకొని సమస్య పరిష్కారంవైపు అడుగులు వేస్తే ఇటువంటివి జరిగే అవకాశాలుండవు. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా అవసరం ఉందనే విషయం పాలకులకు తెలియందికాదు. కొరత లేకుండా చూసుకుంటామని హామీ కూడాఇచ్చారు. కానీ తీరా వరినాట్లు అన్నీ పూర్తయి యూరియా వేయాల్సిన తరుణంలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో పలు రాష్ట్రాల్లోనూ ముఖ్యంగా తెలంగాణలో రైతులు రాత్రింబవళ్లు వేచిచూసి చివరకు ఎక్కడికక్కడ రాస్తారోకోలకు దిగారు. అన్నదాతలు ఎలాంటి సమస్యలు వచ్చినా తమలోతాము బాధపడడం తప్ప ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలు సహజంగా చేపట్టరు. కానీ వారు కూడా ఇప్పుడు ధర్నాలకు దిగారు. ఇలా రాస్తారోకోలు, ధర్నాలు చేస్తే తప్ప తమ సమస్యలవైపు పాలకపెద్దలు దృష్టి సారించరనే నమ్మకం వారిలో కూడా ఏర్పడింది. ఏదిఏమైనా ధర్నాలు, రాస్తారోకోలు రానురాను పెరిగిపోతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల్లో వీటిపట్ల అసహనం కూడా పెల్లుబుకుతున్నది. ఈ సమ్మెలు, నిరసన కార్యక్రమాల ఆవిర్భావానికి ఎంతో సుదీర్ఘచరిత్ర ఉంది. ఎన్నో పోరాటాల అనంతరం మరెందరో మహానుభావుల అవిరామకృషి, తాగ్యాలతో ఈ సమ్మె, నిరసన కార్యక్రమాలు చేపట్టే హక్కు లభించింది. ఆనాటి సమ్మెలకు, నిరసన కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉండేది.ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సాధ్యమైనంతవరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకునేవారు.కొందరు ఈ హక్కులను సద్వినియోగం చేసుకోవడం లేదేమోననిపిస్తున్నది. ఇక పార్టీల గురించి చెప్పాల్సిన పనిలేదు. అధికారంలో ఉన్నప్పుడు ఒకతీరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక తీరుగా వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిగత సమస్యలతో కూడా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇది గ్రామాలకు కూడా పాకింది. గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదనో, మురికి కాలువలు శుభ్రం చేయడం లేదనో రోడ్లపైకి వచ్చేస్తున్నారు. అందువల్ల ప్రయాణికులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. చివరకు ఇంటి నుంచి బయలుదేరిన వారు గమ్యానికి చేరడానికి ఎంత సమయం పడుతుందో ఏ రాస్తారోకోలో ఇరుక్కుపోతారో, ఆ తర్వాత ట్రాఫిక్ ఎంతసేపటికి క్లియర్ అవుతుందో చెప్పలేని దుర్భర పరిస్థితుల్లో హైదరాబాద్ నగరవాసులు అల్లాడుతున్నారు. ముఖ్యంగా అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లేవారు, సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకొని సకాలంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని తపనపడుతున్నవారు. విమానప్రయాణికులు, కార్యలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు అన్నింటికంటే ముఖ్యంగా పరీక్షల కాలంలో విద్యార్థులు పడుతున్న టెన్షన్ అంతా ఇంతా కాదు. ఒకరేమిటి రాస్తారోకోలో ఇరుక్కొని లక్షలాది మంది పడే మానసిక ఒత్తిడి వర్ణనాతీతం.సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పులేదు.కాని దానికో పద్ధతి ఉండాలి. దాన్ని ఆచరించాలి. అంతేకాని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏ రకంగా న్యాయం కాదు. పెద్దలందరూ విజ్ఞతతో ఆలోచించాల్సిన తరుణమిది.

> ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంత వరకూ విజయం సాధించలేడు.



ఎమర్సన్

> ఎక్కువ తక్కువలు, కుల, మత భేదాలు ఉండటం మానవ జాతికి అవమానకరం.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### జాగ్రత్తే రక్షణ

ఇటీవలి కాలంలో పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన కొన్నికేసులు డిజిటల్ ప్రపంచంలో మనం ఎంత అప్రమత్తంగా ఉండాలో గుర్తు చేస్తున్నాయి. మోసగాళ్లు ప్రముఖ ఆర్థిక సంస్థల పేర్లు వాడి సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనలు పెడుతున్నారు.ఆకర్షణీయమైన లింకుల ద్వారా వాట్సాప్ గ్రూపులకు చేర్చి, పెట్టుబడులు పెట్టమని ప్రోత్సహిస్తున్నారు. ప్రారంభంలో చిన్న మొత్తాలు వెనక్కి ఇవ్వడం ద్వారా నమ్మకం కలిగించి, ఆ తర్వాత పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి ఖాతాలను బ్లాక్ చేస్తున్నారు. ఈ విధంగా అనేక మంది తమ కష్టార్జిత సొమ్మును కోల్పోతున్నారు. అధికారుల ప్రకారం అసలు ఆర్థిక సంస్థలు ఎప్పుడూ మూడో వ్యక్తుల ఖాతాలకు డబ్బు పంపమని అడగవు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

వైద్యుడు మనిషి ప్రాణం కాపాడే దేవుడు. ఆ అవకాశం అందరికీ రాదు. వైద్యవిద్య తర్వాత ఉన్నత పట్టా పొందిన వారికి సీనియారిటీ, మెరిట్ ప్రకారం వైద్యుల ఖాళీలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కూడా ఉండొచ్చు. ఆ పోస్టులకువారిని నియామకం జరిగినప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఉన్నసదుపాయాలు అక్కడ ఉండవు. కావున ఆ విధి నిర్వ హణ ఒక అవకాశంగా తీసుకొని, యవ్వనంలో ఆ ప్రజలకు సేవచేసే భాగంగా వారు తమ సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలి. సదుపాయాలను సరిబెట్టుకోవటం మన అవగాహన,ఓపికమీదే ఉంటుంది.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### విధుల పట్ల నిర్లక్ష్యం

రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల్లో విధుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం నిత్యం పత్రికావార్తల్లో చోటు చేసుకుంటున్నాయి. మరో వైపు అసలు కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు.ఈజాడ్యం అన్ని శాఖలకు విస్తరించింది. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి కావాలని తప్పుడు నిర్ణయాలు చేస్తున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి.ప్రభుత్వంఇలాంటివారిని డిస్మిస్ చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### అమెరికా వాగుడుకి ఎస్.సి.ఓ. విరుగుడు

ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా భద్రత, శాంతి, స్థిరత్వం, కీలకమని, మానవత్వానికే పెనుసవాలుగా ఉన్న ఉగ్రవాదం, వేర్పాటువాదంపై ఐక్యంగా పోరాడాలని, పరస్పర మన్నన, విశ్వాసం, సున్నితత్వంప్రాతిపదికన సంబంధాలను పెంచుకునేందుకు కట్టుబడాలన్న భారత్ పిలుపు, ఆర్థిక అభివృద్ధిపై కేంద్రీకరించి, ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని, ఇరు దేశాల సంబంధాలు మరింతగా వృద్ధి చెందాలన్న చైనా ఆకాంక్ష పరస్పర ప్రాధాన్యతలకు అద్దంపట్టేవే. ప్రచ్ఛన్నయుద్ధ మానసిక స్థితి నుంచి బయటపడాలని, అంతర్జాతీయ సంబంధాల్లో అదిరించే, బెదిరించే ఎత్తుగడలు, కూటముల ఘర్షణలు సాగవని,మనదేశంసంయమనంతో వ్యవహరిస్తున్నా, అంతర్గత వ్యవహారాల్లోతలదూర్చుతూ తరచూ వాచాలత్వం ప్రదర్శిస్తున్న ట్రంప్, అమెరికా వాణిజ్య సలహాదారు పీటర్ నవారో లాంటి వారిని ఈ పరిణామాలు మరింత కలవరపెట్టేవే.

-డా.దన్నాన అప్పలనాయుడు,చీపురుపల్లి

### విద్యార్థులపై ఒత్తిడి పెంచకండి

ప్రభుత్వ పాఠశాలలు,జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిర్వహించాలి. వాటి నిర్వహణ తీరును చూసి ప్రభుత్వ అనుమతితో, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ హెక్టార్లలో నడపబడుతున్న ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ ప్రభుత్వం విధిస్తున్న మార్గదర్శకాలు విధిగా పాటించాలి. కానీ అందుకు విరుద్ధంగాఈరోజుల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తీరును ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలల్లో విద్యార్థిని విద్యార్థుల మీద ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మీద రుద్దాలని ఉన్నతాధికారులు చూడడం సరైనదికాదు. ఎక్కువ సమయం పాఠశాలలో ఉండాలని, యూట్యూబ్లో వెబినియార్లు చూపించాలని చెబుతూ ఉన్నారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మూర్ఛ అనేది వైకల్యం కాదు

మూర్ఛ అనేది వైకల్యంకాదు అని కేంద్రప్రభుత్వం స్పష్టం చేయడం సంతోషకరం. తెలంగాణ రాష్ట్రంలో మూర్ఛ పేరుతో వైకల్యం పేరుతోఆసరా పెన్షన్‌లను రద్దుచేయాలి.ప్రభుత్వం నుండి పొందిన రుణాలను వారి వ్యక్తిగత రుణాలుగా పరిగణించి వాయిదా పద్ధతిలో చెల్లించేవిధంగా ప్రభుత్వం చూడాలి. మూర్ఛ వ్యాధి పేరుతో ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నేర్పించాలంటే నేర్చుకోవాల్సిందే!

**తరగతి గదుల్లోనే భావి భారత పౌరుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందన్న విషయం తెలిసిందే. వారి భవితకు రూపకల్పన చేయడం ఒక్క గురువుకే సాధ్యపడుతుంది. గురుదేవోభ! ఈ మాట గురువులకు సంతరించిన దివ్యత్వాన్ని, మానసా వాచా కర్మణా తైత్తరీయ ఉపనిషత్తులో వ్యక్తీ కరించిన అంశం. విద్యా బోధనతోబాటు సదవగాహన కల్పించే విధేయత, వినయశీలత, నైపుణ్యశుద్ధి, విజయ కాంక్ష, వినయశీలత, దయ సానుభూతి, సహానుభూతి విధి నిర్వహణలో పటిష్ట ప్రమాణాలు పాటించాల్సిన తరుణం. మానవతా విలువలు మటు మాయమవుతున్న తర్ణునకంలో విద్యార్థులను తులసి మొక్కలుగా పెంచి సమాజానికి పనికి వచ్చే వ్యక్తులుగా తయారు చెయ్యాలి. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయడంలో గురువులదే ప్రధాన బాధ్యత.బోధనా సరళిలో, శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో కూడిన అభ్యాసం నేడు ప్రతి విద్యార్థికి అవసరం. విద్యార్థులకు బోధనా పద్ధతులలో విస్తృత మార్పులు, కూర్పులు చేయాల్సి ఉంటుంది. అందులో ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వాలి.**



పరిమి శ్యామలా రాధాకృష్ణ

స్వయంకృషితో గురువై, ఉత్తమ గురువై, అంచెలంచెలుగా ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ప్రథమ పౌరుని స్థానానికి ఎదిగి అందలాలు అందుకున్న కీర్తి శిఖరాయమానుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబరు 5న జన్మించారు. ప్రతి ఏటా ఇదే రోజు ఆయన స్ఫూర్తిగా తన జీవిత కాలంలో సాధించిన సమున్నతఅధ్యాపక వృత్తికి, అభ్యున్నతికి ఆలంబనగా 'ఉపాధ్యాయ దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీ. అదే గురుపూజోత్సవం వేడుక. ఆయన ప్రపంచానికే గురుతుల్యులు. సామాన్య కుటుంబంలోపుట్టిన ఆయన విద్యావేత్త, వేదాంతి కూడా. మానవ జీవితంలో సదాలోచనకు పునాదులు వేసేది తల్లితండ్రులైతే, వాటికి విజ్ఞాన పరిమళలందించి సదవగాహన కల్పించేది గురువే! ప్రతి విద్యార్థి మీద ఉపాధ్యాయుని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తరగతి గదుల్లోనే భావి భారత పౌరుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందన్న విషయం తెలిసిందే. వారి భవితకు రూపకల్పన చేయడం ఒక్క గురువుకే సాధ్యపడుతుంది. గురుదేవోభ! ఈ మాట గురువులకు సంతరించిన దివ్యత్వాన్ని, మానసా వాచా కర్మణా తైత్తరీయ ఉపనిషత్తులో వ్యక్తీకరించిన అంశం. విద్యా బోధనతోబాటు సదవగాహన కల్పించే విధేయత, వినయశీలత, నైపుణ్యశుద్ధి, విజయ కాంక్ష, వినయశీలత, దయ సానుభూతి, సహానుభూతి విధి నిర్వహణలో పటిష్ట ప్రమాణాలు పాటించాల్సిన తరుణం. మానవతా విలువలు మటు మాయమవుతున్న తర్ణునకంలో విద్యార్థులను తులసి మొక్కలుగా పెంచి సమాజానికి పనికి వచ్చే వ్యక్తులుగా తయారు చెయ్యాలి. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయడంలో గురువులదే ప్రధాన బాధ్యత.బోధనా సరళిలో, శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో కూడిన అభ్యాసం నేడు ప్రతి విద్యార్థికి అవసరం. విద్యార్థులకు బోధనా పద్ధతులలో విస్తృత మార్పులు, కూర్పులు చేయాల్సి ఉంటుంది. అందులో ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వాలి. ఇప్పుడు కృత్రిమ మేధ వంటి డిజిటల్ రంగంలోకి ప్రవేశించాం. బోధన ప్రమాణాల పెంపునకు ముందడుగు వేయాలి. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి విధానాల ద్వారా విద్యాబోధనలో మౌలిక మార్పులు తీసుకురావడం అవసరం. ఇందుకోసం ప్రభుత్వాలు కూడా బాధ్యత తీసుకోవాలి. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల్లోనూ మార్పు రావాలి. మారిన, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు బోధించేవారు కూడా నేర్చుకోవాలి. పరిణామం ఎంత సహజమో, అంతలా శాస్త్రీయ సాంకేతిక పరిణామాలతో బాటు నేడుఅందరినోట, అన్నిరంగాల్లో వేగంతో దూసుకుపోతుండగా, మరి మన ఉపాధ్యాయులు కూడా అందుకు సాటిగా తాము విద్యార్థులకు తమ బోధనా సరళిలో విస్తృత మార్పులు, కూర్పులు చేయడంలో తర్ఫీదు పొందాలి. ఒకప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ముందుడుగువేయని గురువులు నేడు కాలరీత్యా ప్రావీణ్యులవుతున్నారు. పవర్పాయింట్ ప్రెసెంటేషన్‌తో చిన్నారులకు నేర్పే డిజిటల్ యుగమిది. మనం కూడా భాగస్థులం కావడం బోధనా ప్రమాణాలకు ముందుస్థానమే కాకుండా, ప్రభుత్వాలు చేయూతనిస్తే అంకిత భావంతో పనిచేయగలమని,'తగ్గేదేలే' అని విద్యార్థుల్లో వ్యక్తిత్వం, గుణశీల లక్షణాయుత రేపటి పౌరులుగా



నేడు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి

నాయకత్వ లక్షణాలను రంగరించి పోషించగలమని, ఎవరికి వారు ప్రతిన పూనుకుంటే, మానవ యత్నానికి దైవకృపా కటాక్షాలు ఉంటాయి. పరిశోధనలో ఏఐ వినియోగాన్ని నైతికంగా అనుసరించాలి. ఇదొక నూతన ప్రక్రియ.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చేరడానికి, ప్రాశస్తంలోకి రావడానికి సమయం పడుతుంది. ఉపాధ్యాయులు విచక్షణతో ఆలోచించి, తమ స్వీయ మేధనుపయోగించి విద్యార్థి అవగాహనను బట్టి అత్యంత జాగురూకులై ఉండాలి. ఏది ఏమైనా నేటి విద్య విధానంలో గురువు పాత్ర అత్యంత కీలకమైనది. ఎందుకంటే గురువు శిష్యుల జీవితాలను, భవిష్యత్తును తీర్చి దిద్దడంలో నైపుణ్యాలు, విలువల సంక్రమణలో, నిరంతర అభ్యసన ప్రక్రియలో మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. మారుతున్న ప్రపంచంలో, అందులోనూ, నేటి అస్తవ్యస్త జీవన విధానం, కౌమారంలో శారీరక మార్పులు, హార్మోన్ల ప్రభావంతో యువత మానసిక ఆందోళనల, అలజడులు, స్థిమితత్వానికి బ్రేకులు పడేస్తుంటే, తల్లితండ్రులకు, గురు వులకు, చెప్పుకోలేని పరిస్థితిలో ప్రతికూల దారులు త్రొక్కి, వాళ్లు మాదకద్రవ్యాలకులోనై, పర్యవసానంగా సంఘ విద్రోహక చర్యలకు వెనుకంజ వేయని మాయలో తమ జీవిత గమ్యం ఇది అని స్పష్టత లేక, జన్మనిచ్చినవారు, తోబుట్టువులు, తాము చదివే విద్యాలయాలు, గురువులను ప్రక్కకు పెట్టి, భవితను కోల్పోతున్న నేటి మన దేశమే కాదు విశ్వమంతా యువత వనరులకు చెద చేరిందా,యువతను తొలిచివేస్తున్నదా? అన్నట్లుంది సమాజం.దీనికి ఎవరు బాధ్యులు? పాఠశాలల్లో తొమ్మిది, పది తరగతుల పిల్లలకు ప్రధాన ఉపాధ్యాయులు, వైద్యుని, మనస్తత్వశాస్త్రజ్ఞుని సహాయంతో కౌన్సిలింగ్, తల్లితండ్రులకు కూడా ఇప్పించాల్సిన బాధ్యత ముమ్మాటికీ గురువుదే. రాజ్యాంగబద్ధమైన స్ఫూర్తిని పెంపొందించి, ఆధునిక సాంకేతికతను (ఐసిటి) బోధనలో ఉపయోగించుకుని, అభ్యసనాన్ని సులభతరం చేయడం గురువు చేతుల్లోనే వుంది, కాకపోతే అంకితభావం తో వృత్తికి న్యాయం చేస్తున్నామా అన్న ఆత్మావలోకనం గురువులకు అవసరం! విద్యార్థుల పురోగతికి గురువు ఆలంబన, మద్దతు,ఆధారం, పునాది, ప్రాథమికత. అందుకు గురువుకు తనపై తనకు విశ్వాసమే ఆలంబన! వారికి పుర స్కారాలు, పారితోషికాలు నిష్పక్షపాతంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానించడం ఆనవాయితీ. యోగ, ధ్యాన సాధన, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లి, సదాలోచనలు, చుట్టూ ఉన్న వారి, అక్కడి పరిస్థితులపై సదవగాహన, నిజాయితీ వైఖరిగల జీవనశైలి,దయ, ఇచ్చిపుచ్చుకోవడం, స్త్రీపట్ల గౌరవం, సహనం, స్వామీ వివేకానంద ఆశలు,ఆశయాలన్నీ మన యువతపైనే ఉండేలా చూడాలి. 'మనదేశ సంస్కృతి విశిష్టత అది అత్యున్నతమైన జీవిత ఆదర్శాలను సాధిం చడానికి, ప్రతీఒక్కరి అభిరుచి, మనస్తత్వం, ప్రతిభలకూ తగిన విధానాలను అందిస్తుంది. అంతర్గత ప్రశాంతతకు, శారీరక మానసిక ఆరోగ్యాలకు ఏవిద్య అయినా గురు సమ్ముఖంలో రాణిస్తుంది. కాబట్టి పాఠశాలల్లో, విశ్వవిద్యా లయాల్లో ధారణాశక్తికి, ఏకాగ్రతకు 'ధ్యానం'అన్నప్రక్రియ బోధనా సరళిలో ఒక భాగమైపోవాలి. వయస్సు మళ్ళిన వారికి కాదు, చిన్నతనం నుండే ప్రార్ధన ప్రాముఖ్యత తల్లి దండ్రులతో ఆరంభం కావాలి ! ప్రభుత్వాలు కూడా గురువు స్థాయి, స్థితి,శిష్యుని స్థితిని పరిధ విల్లేలా చేయడం బాధ్యత ,కర్తవ్యం.తరగతులకన్నా పారిశుధ్యం, నిఘా,పర్యవేక్షణలు సర్వదా ఆవశ్యకం, విద్యాలయాలను గురువులను కర్తవ్య బద్ధులై నిర్వహణ లోపం లేకుండా మంచిప్రభుత్వాలుగా భారతమాత ముద్దుబిడ్డలను భావి నాయకులను చేయండి ! విద్యార్థుల్లో దేశం పట్లగౌరవం, అంకితభావం పెంచడం, దీనికి గురువే ఆలంబన, మూలస్తంభం, అని జాతీయ విద్యావిధానం 2020 ఆకాంక్షిస్తున్నది! గురుభ్యోన్నమః! గురువులకు పదవీచ్యుతి లేదు, స్థాన భ్రంశం లేదు,ఎన్ని నూతన పరిజ్ఞాన తెన్నులు విస్తరించినా, ఆచంద్రార్కము గురువులు నక్షత్రాలు,అజ్ఞాన తిమిరాన్ని తుడిచివేసే దివ్వెలు గురుబ్రహ్మలే. ●

# ఎఐ విప్లవం కొత్త యుగానికి నాంది

సాయికృష్ణ గుమ్మడిదారి

ఒకప్పటి కలలు ఇప్పుడు వాస్తవాలు అవుతున్నాయి. మనం ఊహించిన భవిష్యత్తు ఇప్పుడు మన కళ్లముందే రూపుదిద్దుకుంటుంది. మానవ చరిత్రలో ఎన్నో మార్పులు చూసాం. ఆదిమానవుడు నిప్పు కనుగొన్నటువంటి సమయం నుండి నేటి మానవుడు రూపొందించిన కృత్రిమ మేధస్సు వరకు ఎవరు ఊహించని మార్పులు చూసాం. ఈ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం మానవ బుద్ధిని అనుకరిస్తూ నేర్చుకుంటూ తనను తాను మెరుగుపరుచుకుంటూ అనేక రంగాల్లో అసాధారమైన వేగంతో విప్లవాత్మక మార్పులు తెస్తుంది. ఇది కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణ కాదు ఇది మన జీవన విధానాన్ని ఆలోచనలను నిర్ణయాలను అభివృద్ధి మార్గాన్ని సమూలంగా మార్చేస్తున్న శక్తి. ఇప్పుడు అన్ని రంగాలలో కృత్రిమ మేధస్సు విప్లవాలని సృష్టిస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగం అనేది గత రెండు దశాబ్దాలుగా భారత దేశం వంటి దేశాలకు అభివృద్ధికి ప్రధాన నడిపిన శక్తి. కోడింగ్, డేటా ప్రాసెసింగ్, బాక్స్ ఫిక్సింగ్, డేటా ఎంట్రీ, క్లైంట్ సపోర్టింగ్ ఫోన్‌కాల్స్ అంటే విభిన్న పనులుపై ఆధారపడిన రంగం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఈ మార్పు ఎంతో ఉన్నప్పటికీ ఉద్యోగాల భద్రతపై గంభీరమైన ప్రశ్నలు కూడా లేవనెత్తుతుంది. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలంటే అనేక భాషలు నైపుణ్యం అవసరం కానీ ఇప్పుడు పైలెట్ టూల్స్‌ని ఉపయోగించి ఏఐ కోడ్స్ సృష్టించడం మాత్రం చాలా సులభం. కొన్ని సందర్భాల్లో చిన్న మొబైల్ యాప్ పూర్తిగా ఏఐ సహాయంతో తయారవుతున్నాయి. వైద్యరంగంలో కూడా ఏఐ పాత్ర కీలకంగా మారింది. మానవాళి భద్రతకు కేంద్ర బిందువుగా మారింది. ఒకప్పుడు డాక్టర్ల కృషి, పరీక్ష పద్ధతులు, రోగి పరిచర్యలే వైద్యవ్యవస్థ నడిపించేది. కానీ ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఈ రంగంలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఇది ఆరోగ్య పరిరక్షణకు కొత్తదారులను తీసుకొస్తూ ప్రతి దశలో వేగాన్ని కచ్చితత్వాన్ని నమ్మకాన్ని పెంచుతుంది.మానవ తప్పిదాలను తగ్గించడంతోపాటు గ్రామీణ ప్రాంతంలో సైతం వైద్య సేవలను విస్తరించినందుకు ఈ సాంకేతికత ముఖ్య భూమిక పోషిస్తుంది. వైద్యుల పరిరక్షణలో పరీక్షల ద్వారా తెలియని అంశాలను ఏఐ ఆధారిత డయాగ్నెట్ స్టూల్స్ ఉచితంగా విశ్లేషించగలుగుతుంది. ఉత్పత్తి రంగంలో కూడా ఏఐ పాత్ర ఎక్కువగానే ఉంది. సమకాలీన పరిశ్రమలు ప్రొడక్షన్ రంగం సాఫీగా సమర్థవంతంగా నడవడానికి కృత్రిమ మేధస్సు ఎంతో కీలకపాత్ర పోషిస్తుంది. మానవ శ్రమను తగ్గించడమే కాక, ప్రతి దశలో ఖచ్చితమైన వేగవంతమైన సమాచారం అందించడం ద్వారా సంస్థల ఉత్పాదకత పెంచుతుంది. ప్రొడక్షన్ నుంచి లాజిస్టిక్స్ వరకు ఆర్థిక నిర్వహణ నుండి డేటా విశ్లేషణ వరకు ఏఐ ఆధారిత సాంకేతికత సంస్థల మరింత ఆధునికతవైపు దారితీస్తుంది.గతంలో మనుషులు చేతితో తయారు చేసిన స్టాక్ లెక్కింపు తప్పుడు గణనకు దారితీసేది. అయితే ఏఐ ఆధారిత సెన్సార్లు డివైస్ల ద్వారా నిల్వ ఉత్పత్తుల సంఖ్యను, వాటి వివరాలు రియల్ టైంలో తెలుసుకోవచ్చు. ఇది నిల్వ తగ్గించడం అధికంగా నిలువ పెట్టడం వంటి పొరపాట్లు నివారించి ఖర్చులను తగ్గిస్తుంది. ఉత్పత్తి దశలో ప్రగతి ఎటువంటి స్థాయిలో ఉందో ఏ ఆధారంగా సేకరించి తక్షణమే తెలుసుకోవచ్చు. సినిమా రంగంలో చలన చిత్రరంగంలో ఏఐ తెచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రస్తుతం టెక్నాలజీ సామర్థ్యాలు పూర్తిగా తిరగరాస్తున్నాయి.సినిమాల రూపకల్పన నిర్మాణం ఎడిటింగ్,గ్రాఫిక్స్, డబ్బింగ్,నటీనటుల ముఖరూప సృష్టి మొదలైన విభాగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం విపరీతంగా పెరిగింది. సినిమాల్లో గ్రాఫిక్స్ ఒక ముఖ్యమైన భాగం అయింది. వ్యాపార రంగంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తుంది. చిన్న స్టార్ట్ అప్స్‌నుండి భారీ మల్టీనేషన్ కంపెనీ వరకు ఏఐఆధారిత టూల్స్‌వాడి వ్యాపారాలమరింత సమర్థవంతంగా,ఖర్చు తగ్గిస్తూ మార్కెట్లో ముందంజలో నిలబడుతున్నారు. ●

# సూడాన్ విపత్తుకు బాధ్యులెవరు?

డి జయరాం

రెండువేల ఇరవైఐదు ఆగస్టు 31న సూడాన్‌లోని మారుమూల గ్రామం తరాసిన్‌లో జరిగిన ఘోర కొండచరియల విపత్తు, కేవలం ఒక ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. ఇది వాతావరణ మార్పు, అంతర్యుద్ధం, ప్రభుత్వాల నిస్సహాయ వైఖరివల్ల సంభవించిన ఒక విషాదపరిణామం. ఒకవారం పాటు కురిసిన భారీ వర్షాలు ఈ విపత్తుకు కారణమైనప్పటికీ, దాని తీవ్రత, దానిపై వచ్చిన స్పందనలు అంతర్జాతీయ, స్థానిక రాజకీయాల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇలాంటి సంక్షోభాలను మనం ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విపత్తుకు కారణాలు వర్షం, అంతర్యుద్ధం, నిస్సహాయత. తరాసిన్ గ్రామం విపత్తుకు గురికావడానికి శాస్త్రీయ కారణం స్పష్టంగా ఉంది. జెబెల్ మర్రా పర్వతంలోని తూర్పు వాలులలో ఒక వారం పాటు కురిసిన భారీవర్షాలు, అక్కడి నేలను, రాతి పొరలను పూర్తిగా తడిపివేసి, భారీగా కూలిపోవడానికి దారితీశాయి. ఇలాంటి ఘటనలువాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు సాధారణం అవుతున్నాయి.అయితే, తరాసిన్ విషాదాన్ని ఇతర విపత్తుల నుండి వేరు చేసే ఒక ముఖ్యమైన అంశం ఉంది. అదే సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం. మర్రా పర్వతాలు ఒక తిరుగుబాటు గ్రూపు ఆధీనంలో ఉన్నాయి. ఈ రాజకీయ వాస్తవం సహాయక చర్యలకు పెద్ద ఆటంకంగా మారింది. ఈ ప్రాంతంలోని భద్రతా సమస్యలు ఐక్యరాజ్యసమితి, డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ వంటి అంతర్జాతీయ సహాయ సంస్థలు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కష్టతరం చేశాయి. ఇలాంటి విపత్తులు సంభవించినప్పుడు, రాజకీయ నాయకులుత్వరగా ప్రకటనలు చేసి ఇతరులపై నిందలు వేయడం సహజం. తరాసిన్ విషయంలో, ప్రాంతాన్ని పాలించే తిరుగుబాటు గ్రూపు మొదట విపత్తును వెల్లడించింది. వారి తక్షణ స్పందన, సహాయం కోసం పిలుపు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించాయి. మరోవైపు, డార్ఫర్ సైన్యంఅనుసంధాన గవర్నర్, ఈ సంఘటనను 'మానవతా విషాదం'గా అభివర్ణించారు. కానీ ఈ ప్రకటనలు, సమస్యకు మూల కారణమైన రాజకీయ, భద్రతా అంశాలను పరిష్కరించలేకపోయాయి. తరాసిన్ విషాదం రాజకీయ మాటలకు, ఆచరణకు మధ్య ఉన్న లోతైన అంతరాన్ని బయటపెట్టింది. తిరుగుబాటు గ్రూపులు లేదా ప్రభుత్వ అధికారులు తరచుగా విపత్తు స్పందనలను వారి సొంత అజెండాల కోసం ఉపయోగిస్తారు. ఈ తిరుగుబాటు గ్రూపు తమ పాలనకు చట్టబద్ధతను, అంతర్జాతీయ మద్దతును పొందాలని ప్రయత్నిస్తే, సూడాన్ ప్రభుత్వం తమ అంతర్యుద్ధ పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందించే అవకాశం ఉంది. ఈ రాజకీయ ఆటలో బాధితులైన తరాసిన్ ప్రజలు కేవలం పావులుగా మిగిలిపోయారు. ఇలాంటి విపత్తుల నుండి బయటపడాలంటే, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలి. కేవలం లక్షణాలను మాత్రమే కాకుండా, సమస్యలకు మూల కారణాలను పరి



ష్కరించే సమగ్ర విధానాలు అవసరం. తరాసిన్ విషాదం నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాలు కావాలంటే, కేవలం తాత్కాలిక సహాయక చర్యలు సరిపోవు. సూడాన్ దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఒకేసారి పరిష్కరించే వ్యూహాలు అవసరం. సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం, అత్యవసర సహాయక చర్యలకు అతి పెద్ద ఆటంకం. తరాసిన్ వంటి ప్రాంతాలకు చేరుకోవడానికి అంతర్జాతీయ సంస్థలకు సాధ్యం కావడం లేదు. ఇది ఒక తీవ్రమైన మానవతా వైఫల్యం. ఈ సమస్యను పరిష్కరించడానికి,ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ వంటి సంస్థలు సూడాన్ సాయుధ దళాలు, రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ తో చర్చించి, విపత్తు ప్రభావిత ప్రాంతాలలో సహాయం అందించడానికి తాత్కాలికంగా కాల్పుల విరమణను ఏర్పాటుచేయాలి. మానవతా సహాయం సురక్షితంగా ప్రజలకు చేరేలా ఒక తటస్థ, మూడవ పక్షం పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇది తిరుగుబాటు గ్రూపులు, ప్రభుత్వ దళాల మధ్య నమ్మకాన్ని పెంచేందుకు తోడ్పడుతుంది. అలాగే, మర్రా పర్వతాల వంటి తిరుగుబాటు గ్రూపుల ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు సహాయం అందించడానికి, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సూడాన్ తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావాలకు గురవుతోంది. కరువులు, వరదలు, ఇప్పుడు కొండచరియల వంటి విపత్తులు సర్వసాధారణమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, జెబెల్ మర్రా వంటి పర్వత ప్రాంతాలలో అడవుల నరికివేతను ఆపడానికి, నేల క్షీణతను నివారించడానికి పెద్దఎత్తున అటవీకరణ కార్యక్రమాలను చేపట్టాలి. స్థానిక మొక్కలను నాటడం ద్వారా నేల స్థిరీకరణను పెంచవచ్చు. అనూహ్యంగా కురుస్తున్న భారీ వర్షాల నుండి వచ్చే వరదలను నివారించడానికి, మెరుగైన జల నిర్వహణ వ్యవస్థలను, డ్రెయినేజీ నిర్మాణాలను ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా, వాతావరణ మార్పుల వల్ల సంభవించే విపత్తుల గురించి ప్రజలకు ముందుగానే హెచ్చరించడానికి, గ్రామీణ ప్రాంతాలకు చేరువయ్యేలా సరళమైన, సమర్థవంతమైన సమాచార, హెచ్చరికవ్యవస్థలను ఏర్పాటుచేయాలి. సూడాన్ వంటి దేశాలలో ప్రభుత్వ, తిరుగుబాటు గ్రూపుల మధ్య సమన్వయం లేకపోవడంవల్ల విపత్తు నిర్వహణ చాలా బలహీనంగా ఉంది. దీనిని మెరుగుపరచడానికి, తిరుగుబాటు గ్రూపుల వంటి స్థానిక పాలక సంస్థలకు విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై శిక్షణఇవ్వడానికి అంతర్జాతీయ సంస్థలు సహాయం అందించాలి. ఇది ప్రజ లకు తక్షణ సహాయం అందించడానికి వీలుకల్పిస్తుంది. శిథిలాల నుండి మృతదేహాలను, ప్రాణాలతో ఉన్నవారిని వెలికితీయడానికి అవసరమైన భారీ యంత్రాలు, శోధన, రక్షణ పరికరాలను అందించాలి. చివరిగా ఐక్యరాజ్యసమితి వంటిసంస్థలు, సూడాన్‌కు ప్రత్యేకంగా విపత్తు నిర్వహణకు నిధులు సమీకరించాలి. ఈ నిధులను అవినీతికి తావు లేకుండా, నేరుగా సహాయక చర్యలకు ఉపయోగించాలి. తరాసిన్ గ్రామం ఒక విషాదకరమైన ఉదాహరణ. కానీ అది సూడాన్ భవిష్యత్తుకు ఒక మేల్కొలుపు కావాలి. రాజకీయ నాయకులు, తిరుగుబాటు గ్రూపులు, అంతర్జాతీయ సమాజం స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, ప్రజల భద్రత, శ్రేయస్సును మొదటి ప్రాధాన్యతగా ఉంచినప్పుడు మాత్రమే ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఆపగలం. ●

# విజయవాడ వార్త



## కాల్వలోకి ప్రవాహ మార్గాన్ని చేపట్టండి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 4,ప్రభాతవార్త: వర్షపు నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారంగా సమీప కాల్వలోకి ప్రవాహ మార్గం చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం తన పర్యటనలో భాగంగా ఆయన పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్,బెంజిసర్కిల్ నుండి రామవరప్పాడు నేషనల్ హై సర్వీస్ రోడ్,మాచవరం ప్రాంతాలన్ని పర్యటించి క్షేత్రస్థాయిలో డ్రైనేజీ



వ్యవస్థను పరిశీలించారు. వర్షం కురిసినప్పుడల్లా పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్,జమ్మి చెట్టు సెంటర్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలు నిలవడానికి గల కారణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి గల కారణాలు,వాటిని అధిగమిస్తూ శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు బెంజి సర్కిల్ హైవే సర్వీస్ రోడ్ వద్ద ఉన్న డ్రైన్లను పెంచాలన్న ప్రణాళికను ప్రణాళికను కమీషనర్ ముందుకు అధికారులు తీసుకురాగా,పిన్నమనేని పాలిక్లినిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకునేటట్టు ప్రణాళికను సిద్ధం చేసి కార్యాచరణ మొదలుపెట్టాలని ప్రణాళికను ఆదేశించారు. మరోవైపు పుల్లేటి కాలువ విస్తరణకు చర్యలు తీసుకోవడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం ఉంటుందని ఆయన అన్నారు. ఏలూరు రోడ్‌లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాల్వల్లో ప్రవహించేందుకు శాశ్వత పరిష్కారంలో భాగంగా మాచవరం,శ్మశానం వద్ద ఉన్న డ్రైన్లు పరిశీలించారు. ఆ డ్రైన్లను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ కె.షమ్మీ,చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్,ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ,జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సాంబయ్యం,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు తైవాన్ స్ప్రేయర్లు

విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 4,ప్రభాతవార్త: మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మలేరియా సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా తైవాన్ స్ప్రే చేశారు. బుడమేరులో




నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా ఉండేందుకు బుడమేరు కాల్వలో అడ్డుగా ఉన్న మొక్కలను కూడ మలేరియా సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు మాట్లాడుతూ నీరు నిల్వ ఉంటేనే దోమలు వచ్చే అవకాశాలుంటాయని,అందుకోసమే నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు నీటి ప్రవాహం ఉండేటట్లు అడ్డొచ్చిన వ్యర్థాలు,పిచ్చిమొక్కలు,గుర్రపు డెక్కలు,తొలగిస్తున్నామన్నారు. బుడమేరు కాల్వ గట్ల వద్ద అక్కడక్కడ గుంతల్లో ఉన్న నీటి నిల్వల్లో దోమలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నందున,వాటిని నిర్మూలించేందుకు యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా తైవాన్‌ను స్ప్రే చేశారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ ప్రాణాలను కాపాడిన ఎన్టీఆర్ జిల్లా పోలీసులు

విజయవాడ క్రైం,సెప్టెంబరు 4,ప్రభాతవార్త: మహిళ ప్రాణాలను కృష్ణలంక,ఒన్‌టౌన్ పోలీసులు గురువారం కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు గ్రామానికి చెందిన వివాహిత కుటుంబ సమస్యల నేపథ్యంలో భర్తతో గొడవపడి చనిపోతానని చెప్పి విజయవాడ వచ్చేసినట్లు కంకిపాడు పోలీసులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే కంట్రోల్ రూం వారు కృష్ణలంక,ఒన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ కృష్ణలంక పోలీసులు అప్రమత్తమై సిబ్బందితో బస్టాండ్,పద్మావతిఘాట్,సీతమ్మ వారి పాదాలు,మార్కెట్,రథం సెంటర్,ప్రకాశం బ్యారేజి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో ప్రకాశం బ్యారేజి వద్ద సదరు మహిళను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకొని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నందు కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. అతి తక్కువ వ్యవధిలో ఒక మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా మహిళ కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే జయరామ్ క్షమాపణ చెప్పాలి

ఎ కొండూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త : తెలుగుదేశం కూటమికి చెందిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ప్రజా సంఘాల నాయకులను బెదిరించి అనుచితంగా ప్రవర్తించిన ఎమ్మెల్యేపై సిఎం చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు



నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు సెంటర్ విజయవాడ తిరువూరు జాతీయ రహదారి-30 పక్కన నిరసన ఆందోళన జరిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే జయరామ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మరియు ప్రజా సంఘాల నాయకుల పట్ల బెదిరింపు ధోరణి ప్రవర్తిస్తూ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించడానికి ప్రభుత్వం భూసేకరణ జరిపిందని ఆ సమయంలో రైతు సంఘం ప్రజా సంఘాలు ఆ ప్రాంతానికి పర్యటించటానికి వెళ్లిన సందర్భంలో ఎమ్మెల్యే అర్ధగంటలో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లాలని లేని పక్షంలో అక్కడకు వస్తే తంతానని అసభ్య పదజాలంతో దూషించి, బెదిరించిన ఎమ్మెల్యే జయరామ్ ప్రజాస్వామ్య విలువలను రాజ్యాంగ విలువలను కాలరాశాడని పూటకో పార్టీ మార్చే ఎమ్మెల్యే జయరామ్ మాట్లాడే వ్యవహార శైలిని వీరు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ అధికార పార్టీ ఎమ్మెల్యే ధోరణి ప్రజాస్వామ్య విలువలను మంట కలిపిందని మద్దిరెడ్డి వెంకటరెడ్డి క్షమాపణ చెప్పాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ల అమ్మిరెడ్డి కౌలురైతు సంఘం నాయకులు పానెం ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు రైతు సంఘం నాయకులు చెరుకు వీరారెడ్డి, రామకృష్ణ, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాన్‌సింగ్ తండాలో గణేష్ నిమజ్జనం

ఎ కొండూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం పంచాయతీ శివారు మాన్‌సింగ్ తండాలో వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా గ్రామంలో వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గణపతి నవరాత్రుల ముగింపు రోజు బుధవారం గ్రామంలో గణపతి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి కోలాహలంగా ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఎఎంసి డైరెక్టర్ భరోతు రాణి, భరోతు తిరుపతిరావు దంపతులు, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు మాజీ సర్పంచ్ పిన్నమనేని శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కె ఖాదర్ బాబా, కరీముల్లా, మొహిద్దీన్, భరోతు రెడ్డి, భరోతు గోపయ్య, భరోతు శ్రీను, లావూరి చంటి తదితరులు పాల్గొన్నారు. గిరిజన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి అన్నదానం నిర్వహించారు.



## నిమ్మకూరులో 'పద్మభూషణ్' నందమూరి బాలకృష్ణ సందడి

### ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులు

పామర్రు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: సినీ ప్రస్థానం 50 ఏళ్లు పూర్తిచేసుకుని, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న అనంతరం. నిమ్మకూరుకు నటుడు బాలకృష్ణ చేరుకున్నారు. ఈసందర్భంగా స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు బాలయ్యకు మంగళ హారతిలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు బాలకృష్ణ నివాళులర్పించారు.అనంతరం



బాలయ్య మాట్లాడుతూ, దేశంలో మొదటి కళాకారుడుగా బుక్ ఆఫర్ రికార్డ్స్ లో స్థానం పొందడం...వరుస సినీ విజయాలను... ప్రజల విజయాలుగా భావిస్తున్న.పదవులు నాకు ముఖ్యం కాదు అని అన్నారు. రాయలసీమను నా అడ్డాగా భావిస్తానని, దృఢ సంకల్పం ఉంటే భగీరథులు కావచ్చని అన్నారు.. రాయలసీమకు నీరిచ్చి చంద్రబాబు నిరూపించారని అన్నారు. హిందూపురంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించడం సంతోషంగా ఉందని, ఎన్టీఆర్,తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నేడు భౌగోళికంగా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. సందేశం ఉండాలన్న లక్ష్యంతో ప్రతి సినిమా చేస్తున్నానని,బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అంతర్జాతీయ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. తన సంతోషాన్ని గ్రామస్తులతో పంచుకోవాలని నిమ్మకూరు వచ్చానని బాలయ్య పేర్కొన్నారు. పామర్రు





ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, తెలుగుదేశం పార్టీ పామర్రు మండల అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, బాలకృష్ణ అభిమానులు తదితర నాయకులు ఉన్నారు.

## రాజమండ్రిలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక సమ్మిళితత్వ చాచురేషన్ డ్రైవ్

విజయవాడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : కేంద్ర ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం కింద శాచురేషన్ క్యాంపెయిన్లో భాగంగా రాజమండ్రిలో మెగా క్యాంప్ ను బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహించింది. 2025 జులై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు ఈ క్యాంపెయిన్ జరుగుతుంది. ప్రభుత్వ స్కీంలను ప్రజలకు చేరువ చేయడంలో ఈ క్యాంపెయిన్ ఎంతో ఉపయోగకరంగా నిర్వహించారని ముఖ్య అతిథి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పి ప్రశాంతి అన్నారు. దీర్ఘకాలికంగా




ఆర్థిక, సామాజిక అభ్యున్నతి సాధించేందుకు అందరూ ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. బ్యాంక్‌ఆఫ్ బరోడా ఫైనాన్స్ చేసిన మహిళల విజయగాదలను బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి వివరించారు. బరోడా డిఫెన్స్ శాలరీ ప్యాకేజ్, ఒక్కొక్కటి రు.2లక్షలు, రు.15లక్షల చొప్పున పిఎంజెజెబివై క్లైం సెటిలెమెంట్‌లకు సంబంధించిన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కొత్త స్వయం సహాయక బృందాలు, పరిశ్రమలకు ఫైనాన్సింగ్ కోసం చెక్కులను కూడా అందించారు. 1000 మందికి పైగా ఈ క్యాంపులో పాల్గొన్నారు.

## ఆక్సియో సేకరణ పూర్తి చేసిన అమేజాన్

విజయవాడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :భారతదేశం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి నియంత్రణ ఆమోదం పొందిన తరువాత ఆక్సియోతో అమేజాన్ వారి ప్రస్తుత భాగస్వామ్యంపై రూపొందించిన ప్రముఖ డిజిటల్ లెండింగ్ చెకవుట్ ఫైనాన్స్ ప్రొవైడర్ ఆక్సియో (ఇంతకు ముందు కాపిటల్ ఫ్లో) సేకరణ పూర్తయిందని అమేజాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సేకరణతో భారతదేశంలో తమ ఆర్థిక సేవల ఆఫరింగ్స్ విస్తరణ సాధ్యపడుతుందన్నారు. ఆరేళ్ళకు పైగా భారతదేశంలో అమేజాన్‌పే కోసం బై నోపే లేటర్ సేవలందిస్తామన్నారు.

## మారుతి సుజుకి నుండి కొత్త ఎస్యువి విక్టోరిస్

విజయవాడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :
బారతమార్కెట్లోకి విక్టోరిస్ ఎస్యువి కార్‌ను విడుదల చేసినట్లు మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. హైపర్ కనెక్టెడ్ టెక్నాలజి, సంపూర్ణ భద్రత, అధునాతన, నాజూకైన డిజైన్‌లతో అద్భుత పెర్ఫార్మెన్స్ ఇస్తుందన్నారు. స్ట్రాంగ్ హైబ్రిడ్, ఆల్‌గ్రిప్ సెలక్ట్, పర్యావరణానుకూలమైన ఎస్-సిఎన్‌జి టెక్నాలజీతో పెట్రోలులో లభిస్తుందని, కస్టమర్లు బుక్‌చేసుకోవచ్చన్నారు.

## ఆర్టీసి బస్సు వృద్ధుడి మీదుగా వెళ్ళటంతో అక్కడికక్కడే మృతి

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలోని ఏపిఎస్ ఆర్టీసి బస్టాండు ఎదుటే డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు కిందపడి ఒక వృద్ధుడు దుర్మరణం చెందాడు. గురువారం జరిగిన ఈప్రమాదం వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చాటుతోంది. సేకరించిన సమాచారం ప్రకారం పెనుగంచిప్రోలు మండలం పాత ముండ్లపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ (66) ఈప్రమాదంలో మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికునిగా పనిచేసే ఈవృద్ధుడు జగ్గయ్యపేట అడ్డాకు నిత్యం వచ్చి పనులు చేసుకుని వెళ్తుంటాడు. అయితే ఆర్టీసి బస్టాండ్ వద్ద గతంలో కూడా ఇదే ప్రదేశంలో బస్సుల కిందపడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో బస్సులు స్టేషన్‌లోకి ప్రవేశించే మార్గంలో కట్టడాలను తొలగించిన తర్వాత ప్రమాదాలు ఆగాయి. డ్రైవర్లు బస్సులను లోపలకు తీసుకువెళ్ళి తిరిగి బయటకు వచ్చే సందర్భాల్లో ఇక్కడ ఇరుకైన ఇబ్బంది ఉండటంతో ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశాలు ఏర్పడ్డాయి. వృద్ధుడు బస్సు వేగంగా మలుపుతిరిగి రావటాన్ని గమనించకపోవటం, డ్రైవర్ కూడా రోడ్డు మలుపులో ఎవరూ ఉండరనే ధీమాతో నడపటం వలన బస్సు వెనుకచక్రం కింద వృద్ధుడు పడిపోవటం, బస్సుటైరు తలమీదుగా వెళ్ళటంతో అక్కడికక్కడే మృతి చెందటం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్‌నకు అవరోధాలు కలిగించే కట్టడాలు, ఆక్రమణలు, విగ్రహాలు, బ్యానర్లు, కటౌట్లు తొలగించటంలో కూడా ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. కాగా జరిగిన ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుని కుటుంబానికి న్యాయం చెయ్యాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.



## పెండింగ్‌లోని ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని నిరసన


జగ్గయ్యపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలో గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు పెండింగ్‌లోని ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తంచేస్తూ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిఓ నెం.77ను రద్దుచేసి ఇతర విద్యారంగ




సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సోమోజు ప్రణయ్‌తేజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదలచేయకపోవటం దారుణమన్నారు. గత మూడేండ్లుగా ఈనిధులు విడుదల కాకపోతుండటంతో విద్యార్థులు, వారి తలిదండ్రులు అప్పులుచేసి ఫీజులు చెల్లించే దుస్థితి పాలకులవల్ల దాపురించిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులపై వారి భవిష్యత్తుపై బాధ్యత ఉంటే తక్షణమే నిధులు విడుదలచేసి నిజాయితీని ప్రదర్శించాలని సవాల్‌చేశారు. కార్యక్రమంలో రిహాన్, రెహమత్, వంశీ తదితర విద్యార్థి సంఘ నేతలు పాల్గొన్నారు.

## వైభవంగా సిద్ధి-బుద్ధి విఘ్నేశ్వరస్వామి కళ్యాణం

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : జగ్గయ్యపేట పట్టణంలో బంగారం కొట్ల కూడలిలో గల స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం సిద్ధి-బుద్ధి విఘ్నేశ్వరస్వామి కళ్యాణ



మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బంగారం వ్యాపారులు, భక్తులు ఈవేడుకలో పాల్గొన్నారు. అనంతరం విశేష అలంకరణ, పూజలు, అర్చనాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు తెలిదేవరపల్లి భరద్వాజశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## అపర్ణ ఫార్మా కు ఈయుజిఎంపి సర్టిఫికేషన్

విజయవాడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో పైడి భీమవరం లోని తమ కంపెనీ తయారీ కేంద్రానికి ఈయుజిఎంపి సర్టిఫేషన్ పొందినట్లు తద్వారా బహుళ అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అందుకున్నట్లయిందని అపర్ణ ఫార్మాస్యూటికల్స్ ఎండి రాకేష్‌రెడ్డి తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో 7300 చ.అ. విస్తీర్ణంలో అత్యాదునిక పరిశోదన, అభివృద్ధి కేంద్రంను ప్రారంభించడంతో రెండు మైలురాళ్లు అధిగమించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో విశ్వసనీయ భాగస్వామిగా మారడం మాలక్ష్యమన్నారు.

## వరుణ్ మోటార్స్‌లో కెటిఎం 160 డ్యూక్ ప్రారంభం

విజయవాడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : అత్యంత సరసమైన ఎంట్రీలెవల్ బైక్ కెటిఎం 160 బైక్‌ను వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కెటిఎం డివిజన్ సిఇఓ ఎ శ్రీనివాస్, జిఎం సురేష్, ఏఎస్ఎం ఏ గోపీచంద్, బిఎం కిషోర్లు గురువారం విజయవాడలోని భవానీపురం బ్రాంచ్, గుడివాడల్లో ప్రారంభించారు. స్పోర్ట్స్ లుక్‌తో, లిక్విడ్ కూల్డ్ 4స్ట్రోక్, సింగిల్ సిలిండర్, ఎస్ఓహెచ్‌సి, ఇంటర్నల్ కంబషన్, స్థానభ్రంశం 164.2 సిసి, గరిష్టశక్తి 19 పిఎస్‌లు, గరిష్ట టార్ 15.5ఎంఎం, గేర్‌బాక్స్ 6 ట్రాన్స్మిషన్ వెనుక సస్పెన్షన్ డబ్ల్యుపి మోనోషాక్ కెర్బ్ బరువు 147కిలోలు, 10.1లీటర్ల ఇంధన ట్యాంక్, ట్యూబ్లెస్ టూర్లు, 17 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో లభిస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు



## గొట్టిపాడు గ్రామంలో పొలంబడి...

ప్రత్తిపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: మండలంలోని గొట్టిపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కేంద్రియ సస్య రక్షణా కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి మరియు మండల వ్యవసాయ అధికారి షేక్.సుగుణ బేగం హాజరైనారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్తి పొలాలను పరిశీలించడం జరిగింది. కె.వీరయ్య చౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి పంటలో తామర పురుగులు మరియు పేను బంక గుర్తించడం జరిగింది పురుగులను గుర్తించడం జరిగింది.వీటి నివారణకు వేప నూనె ఒక లీటర్ నీటికీ 5 ఎమ్ఎల్ చొప్పున పిచ్చికారి చేసుకోవాలి.అదేవిధంగా రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఉన్న ఎడల ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా ఎసిటమిప్రిడ్ 0.2 గ్రాములు లీటరునీటికి పిచ్చికారి చేసుకోవాలని తెలియజేశారు.మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఎరువుల విషయంలో ఎలాంటి ఆందోళన చందనవసరం లేదు అని తెలియజేశారు. అదేవిధంగా యూరియా మీ చెంతకు అనే కార్యక్రమం ద్వారా ఎరువుల విషయంలో రైతులందరికీ అవగాహన కల్పించడం జరిగింది.మండలంలో సాగు చేసిన పంటలకు కావాల్సిన ఎరువులు రైతు సేవ కేంద్రాలు,పిఎసిఎస్ మరియు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. కావున రైతులందరూ ఎటువంటి ఆందోళన ఆందోళన చ్నెదనవసరం లేదు అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో వి.హెచ్.ఏ.షణ్ముఖ రెడ్డి మరియు గ్రామం రైతులు హాజరైనారు.

IN THE COURT OF
HON'BLE III RD ADDL
SENIOR CIVIL JUDGE:
RANGA REDDY
DISTRICT
AT: L.B. NAGAR
I. P. NO. 46 2019
Between:-
Sri. Potharaju. Santosh Mallikarjun
---Petitioner
And
Smt. Rami Reddy, Padma and others
To
Sri. Sunil S/o Chinni, aged about 30 yrs, Occ; business, R/o Kamala Theater, Main Road, Seethrampuram, Jaggayyapet, A.P.
Sri. Gopi C/o Sunil, aged about 34 yrs, Occ; business, R/o Kamala Theater, Main Road, Seethrampuram, Jaggayyapet, A.P.
-- Respondents
Please take notice that a suit for an Insolvency Petition has been filed. It is scheduled to be heard in the said court on 16-09-2025 at 10.30 a.m. Otherwise the matter will be heard and decided in your absence if you do not appear.
By court order
Sd/- G.MALLA REDDY
SMT. SHOBHA RANI
ADVOCATES
R/O H.NO. 2-3-339,
SAI NAGAR, ROAD NO.4,
NAGOLE, HYD
CELL: 9849436476

## 'కూటమి' ప్రభుత్వంలో గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి పెద్దపీట : బాలాజీ



చిలకలూరిపేట, సెప్టెంబర్4, ప్రభాతవార్త: పల్లెప్రగతి, దేశప్రగతి అని గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో సాకారమైందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేసి, గ్రామ స్వరాజ్యానికి కృషి చేయాల్సిన గత వైసిపి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గతంలో స్థానిక సంస్థల నిధులు ఇవ్వకుండా వాటిని ఇతర అవసరాలకు ప్రభుత్వమే మళ్లించిందని, కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థల ఖాతాలలోకి వెళ్లకుండా దారి మళ్లించిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో ఇవి పంచాయితీ ఖాతాలలో జమకానున్నాయని, పల్లెల అభివృద్ధికి తోడ్పాటుకానున్నాయని వెల్లడించారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించి ప్రత్తిపాటి ప్రతిష్టను పెంచే విధంగా పనిచేద్దాం

### - డైరక్టర్ల తొలి సమావేశంలో యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా

చిలకలూరిపేట, సెప్టెంబర్4, ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని రైతు సోదరులకు మరింత మెరుగైన సేవలు అందించి మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రతిష్టను పెంచేవిధంగా మనందరం పనిచేద్దామని గురువారం మార్కెట్‌యార్డ్ సమావేశమందిరంలో యార్డ్ డైరక్టర్లతో నిర్వహించిన తొలి సమావేశంలో యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా అన్నారు.



నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఈ క్రాప్ నమోదు పూర్తి స్థాయిలో జరిగేటట్లు రైతులను చైతన్యవంతం చేయాలని, అలాగే క్షేత్రస్థాయిలో అధికారులు కూడా ఈ క్రాప్ నమోదు విషయంలో పూర్తిస్థాయిలో రైతులకు సహకారం అందించాలని తెలిపారు. అలాగే గ్రామాలలో వ్యవసాయ పనుల నిమిత్తం పంటపొలాలలకు వెళ్లే పలు డొంక రోడ్లను అభివృద్ది చేయాలని, వాటికి సంబందించిన వివరాలను డైరక్టర్లు అందచేయాలని కోరారు. అదేవిధంగా పాత, కొత్త యార్డులతలో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని పాలకవర్గ సమావేశంలో నిర్ణయించారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో రైతులను యార్డ్ పాలకవర్గాలు గాలికి వదిలేసారని, నాటి తప్పులను సరిచేసి, రైతులకు యార్డ్ ద్వారా అందే ప్రతి ప్రయోజనాన్ని పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకొని ప్రత్తిపాటి ప్రతిష్టను ఇనుమడింపచేసేందుకు అందరం కృషి చేద్దామని చైర్మన్ వివరించారు. ఈ సమావేశంలో గౌరవ సభ్యుడు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, యార్డ్ కార్యదర్శి రాయుడు, డైరక్టర్లు అనంత వీరకుమారి, గుదె అంజలి, కూరపాటి నాగమల్లేశ్వరి, చెన్నంశెట్టి పద్మావతి, పల్లపు సుమలత, మందా దుర్గాభవాని, నెల్లూరి శాంతిప్రియ, జాష్టి రవి, షేక్ అబ్దుల్ నబీ, కాట్రు శ్రీనివాసరావు, పోపూరి హనుమంతరావు, ఆముదాల లీలాకిషోర్, మోగిలి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పసుమర్రు హైస్కూల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ డిఇఒ సుభాని

చిలకలూరిపేట, సెప్టెంబర్4, ప్రభాతవార్త: పసుమర్రు గ్రామంలో ఉన్న మద్దికామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం నరసరావుపేట ఉపవిద్యాశాఖాధికారి మహబూబ్‌సుభాని, మండల విద్యాశాఖాధికారి బి సత్యనారాయణ సింగ్‌లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.



ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి 10వ తరగతి విద్యార్దులను పరీక్షలకు సన్నద్ధం చేయుటకు తగు సూచనలు, సలహాలు అందించారు. సాయంత్రం పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడైన బొప్పూడి వెంకటేశ్వర్లు, పాఠశాలలోని సీనియర్ గణిత ఉపాధ్యాయుడు ఎన్ శంకరరావులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు యడవల్లి హనుమంతరావు అధ్యక్షత వహించి ఉపాధ్యాయ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత విద్యార్దులకు తెలియచేశారు. పాఠశాల విద్యార్దిని, విద్యార్దులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను సన్మానించారు.

## 'మోడరన్ స్టెల్లార్' లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

చిలకలూరిపేట, సెప్టెంబర్4, ప్రభాతవార్త: పట్టణంలోని మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ప్రసున సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి జీవిత విశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తమ ప్రసంగాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ చేబోలు మహేష్, ప్రత్యూష, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ప్రసూన, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తకు భాజపా నేతల ఆర్థికసాయం

నాదెండ్ల, సెప్టెంబర్4, ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కంభంపాటి ఆనందరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బిజెపి



నాయకులు గురువారం గణపవరం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, ఒబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, బిజెపి నాయకులు పోతూరి బ్రహ్మానందం, ఆళ్ల శివకోటిరెడ్డి, గోరంట్ల పిచ్చియ్య, చేరెడ్డి విజయభాస్కరరెడ్డి, సంగారెడ్డి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేపర్ బాయ్స్‌కు సత్కారం

చిలకలూరిపేట, సెప్టెంబర్04, ప్రభాతవార్త: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు గురువారం పలు పేపర్లలో పనిచేస్తున్న బాయ్స్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు.



ఆంధ్రజ్యోతి పేపర్‌కు పాఠకులకు అందించే పేపరుబాయ్ గణేష్, ప్రజాశక్తి పేపర్ పాఠకులకు అందించే కిరణ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు ఎవియస్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు ఐతా వెంకటప్రసాద్, క్లబ్ సభ్యులు శనగపల్లి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శివసుబ్రహ్మణ్యం, దేవూరి కృష్ణమూర్తి, శిఖాకొల్లి రామారావు, ఆలపాటి కాలేషా, పొట్టి సుబ్బారావులు పాల్గొన్నారు.

## బిఆర్‌విజి మున్సిపల్ హైస్కూల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



చిలకలూరిపేట, సెప్టెంబర్4, ప్రభాతవార్త: పట్టణంలోని పండరీపురంలో ఉన్న భారతరత్న ఇందిరాగాంధి మున్సిపల్ హైస్కూల్‌నందు గురువారం ముందస్తు ఉపాధ్యాయదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేరా నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి అన్ని వృత్తులలో పవిత్రమైనదని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల మధ్య అనుబంధం, తల్లిదండ్రులు బిడ్డలపట్ల చూపించే ప్రేమవలే పరస్పరం నిర్మలమైనదని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షనతో ఎదిగా ఉన్నతస్దానాలను అధిరోహించాలని ఎల్లప్పుడు కోరుకునే వ్యక్తి ఉపాధ్యాయుడని వివరించారు. విద్యార్దిని, విద్యార్దులు వివిధ సాంస్క్రతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సభలో సీనియర్ ఉపాధ్యాయునీలు అయిన కే మేరిగ్రేస్, యం స్వరూపరాణి, షేక్ మహ్మద్ ఆలీలను ఘనంగా సత్కరించారు.

## ఇంటర్ విద్యార్థికి రూ.10వేల ఆర్థికసాయం

చిలకలూరిపేటటౌన్, సెప్టెంబర్04, ప్రభాతవార్త: స్దానిక స్వచ్ఛంద సేవాసంస్ద ఆర్‌ఆర్‌హెచ్‌డియస్ ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్ పూర్తిచేసిన మానస అనే విద్యార్దినికి అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ యం సుధేవ్ ద్వారా రూ 10వేల నగదును ఆ విద్యార్దిని తండ్రి యం రమేష్‌కు అందచేశారు.



సంస్ద సిఈఓ పులిపాటి కెనడీ మాట్లాడుతూ తమ సంస్ద చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. చిలకలూరిపేట ఐడిఎఫ్‌సి బ్యాంక్ మేనేజర్ మహేష్, ఎబియం గోపికృష్ణ, విడదల శంకరరావు, విడదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎస్ఆర్ఎంలో ఘనంగా గురుపూజోత్సవం

మంగళగిరి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం సాయంత్రం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్ ( హైదరాబాద్) ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైన వృత్తిలో కొనసాగుతున్న గురువులందరూ దేశభక్తి, ఆలోచనాత్మక పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా తన గురువైన డాక్టర్ ప్రపుల్ల చంద్ర రే జీవిత ప్రస్థానాన్ని ప



వర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా. వివరించారు. యూనివర్సిటీ ప్రోవైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే శక్తి గల టీచర్లు దేశాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లందరూ బాధ్యతగా బోధన, పరిశోధనల్లో తమకున్న ప్రతిభను విద్యార్థులకు పంచాలన్నారు. ఎస్ఆర్ఎం విద్యానం స్థల రీసెర్స్ (గ్రూప్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయులకున్న విలువ వెలకట్టలేనిదనీ, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన సుందర్ ఫీచాయ్, సత్య నాదెళ్ల వంటి వారంతా వారివారి టీచర్ల ద్వారా అభివృద్ధి పథంలో నడిచిన వారేఉన్నాడు.

### 10 మందికి అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ అవార్డులు.......

ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం బోధనలో రాణిస్తున్న 10 మంది ప్రొఫెసర్లకు అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ ఆవార్డులను ప్రకటించింది. డాక్టర్ కే ఏ సునీత, డాక్టర్ తో సిఫ్ ఖాన్, డాక్టర్ ప్రద్యుల్ కుమార్ సాంకి, డాక్టర్ రమేష్ వడ్డి, డాక్టర్ జేసిపీ భగత్ సింగ్, డాక్టర్ జాకర్ అహమ్మద్ దార్, డాక్టర్ జతీష్ కుమార్ దాస్, డాక్టర్ లలిత్ మహాపాత్ర, డాక్టర్ వినీ త్ థామస్, డాక్టర్ నలేటి సుమలతలు అవార్డులను అందుకున్నారు. డాక్టర్ వీ ఎస్ రావు ఫౌండేషన్ ఏటా డాక్టర్ హెచ్చీ తివారీ పేరిట అందజేసే ప్రతిష్టాత్మక పురస్కారం ఈ ఏడాది డాక్టర్ ఆనిర్బన్ ఘోష్కు లభించింది.. వీరందరికీ ఆవార్డు కింద రూ.50 వేల నగదు పారితోషికం, ప్రశంసా పత్రం జ్ఞాపికలను ప్రదానం చేశారు. అనంతరం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మరో 22 మంది అధ్యాపకులను వేదికపైకి ఆహ్వానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు స్వయంగా ఎంపిక చేసిన మరో 9 మంది ప్రొఫెసర్లకు పాపులర్ బెస్ట్ ఫ్యాకల్టీ పురస్కారాలను అందజేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, హెచ్ ఆర్ డైరెక్టర్ సామల ఐజక్, శివరంగన్, రేవతీ బాలక్రిష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## దైవప్రవక్త ముహమ్మద్ జన్మదినోత్సవ శుభాకాంక్షలు

మంగళగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినోత్సవ సందర్భంగా దేశ ప్రజలందరికి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జలీల్ మాట్లాడుతూ ప్రవక్తసౌదీ అరేబియా దేశంలోని మక్కా పట్టణం లో జన్మించి మదీన నగరంకు వెళ్ళి ప్రపంచం లో దాదాపుగా 195 దేశాల్లో ఇస్లాం ను వ్యాపింపచేచారు.



ముహమ్మద్ ప్రవక్త గొప్ప జీవితాన్ని స్మరించుకునే రోజు ఇది. ఆయన బోధనలు మనల్ని ధర్మం, శాంతి వైపు నడిపిస్తాయనినమ్ముతున్నారు. మన జీవితాన్ని ప్రేమ, ఆనందాలతో నింపాలని ఆకాంక్షి స్తున్నాను. ఇస్లాం అనేది శాంతి కి చిహ్నం. మొదట మానవుడు, ప్రవక్త ఆదమ్, హవ్వా నుండి చివరి దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) 1,24,000 ప్రవక్తలు కృపాశీలుడు, అనంత కరుణామయుడు సృష్టికర్త అయిన అల్లాహ్ ఒక్కడే ప్రపంచ మానవాళికి ఆరాధ్యదైవం దీన్, దునియా, అఖిరాత్, షరియత్, తరిఖత్, మారిఫత్ హఖీఖత్ సూక్తులను ఆచరించారు. హఫీజ్, ఆలిం, ముఫ్తీ, ఫాజిల్ ఖురాన్ గ్రంధాని అనువాదం చేసి ప్రతి విశ్వాసి అనుసరించే విధంగా చేశారు. అదేవిధంగా ఇస్లాంను స్వీకరించిన ప్రతి విశ్వాసి తౌరాత్ జబూర్, ఇంజీల్, ఖురాన్ గ్రంధాలను అల్లాహ్ పంపబడిన గ్రంధాలుగా విశ్వసించాలన్నారు. వాటితో పాటు ముఖ్యంగా కల్మే , తయ్యిబ ,నమాజ్ రోజ ,హజ్జ్ ,జకాత్ ను ఆచరించిన వ్యక్తి నిజం అయిన ముస్లిం అని దైవప్రవక్త ముహమ్మద్ ప్రచారం చేశారు. అల్లాహ్ పంపించబడిన దైవదూత జీబ్రాయిల్ అలైహి సలాం ఆకాశం నుండి వచ్చిన ఖురాన్ ను ఆచరించాలని హితబోద చేసేవారు. మానవుని పుట్టుక సముద్రం లోని ఒక్క బిందువు లాంటిది. మున్కీర్, నక్కీర్ ద్వారా చనిపోయిన ప్రతి మానవుడిని తను చేసిన పాపపుణ్యాలను లెక్కించబడతాయి, మనిషి చనిపోయినాక ,మన్ రబ్బుక, మన్ దీనుక, మన్ నబ్బీయుక ఈ మూడు ప్రశ్నకు సమాధానం చెప్పిన వ్యక్తి స్వర్గంకి చెప్పని వ్యక్తి నరకానికివెళ్తారని అని ముహమ్మద్ ప్రవక్త వారు హితబోద చేసేవారు. ముహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు జరుపుకోవటం ఆనందముగా, సంతోషంగా ఉందని జలీల్ పేర్కొన్నారు. ఈ పండుగరోజున మీపై, మీ కుటుంబ సభ్యులందరిపై అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని జలీల్ తెలియజేశారు.

## కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ బ్రాంచ్ కార్యాలయాన్ని తనిఖీ

### చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ఆగ్రహం..



మంగళగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మంగళగిరి బ్రాంచ్ ఇంచార్జ్ పని తీరుపై వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వారి కిరణ్ చంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న మంగళగిరి బ్రాంచ్ కార్యాలయాన్ని మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ గురువారం తనిఖీ చేశారు. రైతులకు యూరియా బస్తాలను సక్రమంగా అందించాలని, రైతుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని, పని తీరు మార్చుకోకపోతే ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. రైతుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని అధికారులను సూచించారు.

## మైనార్టీల అభ్యున్నతికి కృషి : లోకేష్ ధన్యవాదాలు

మంగళగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకుడు, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం ను గురువారం మంగళగిరి పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్ టిడిపి కార్యాలయంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ఇబ్రహీం ని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



అనంతరం మాట్లాడుతూ ఆయన, "ఇబ్రహీం నియామకం మైనారిటీలకు గర్వకారణం. ఆయన కృషి, పట్టుదలతో నియోజకవర్గ అభివృద్ధి మరింత బలపడుతుంది. మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషికి ఇది సరైన గుర్తింపు" అని అన్నారు. ఇబ్రహీం నియామకం టిడిపి బలోపేతానికి తోడ్పడుతుందనీ తెలియజేసారు...సత్కరించిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, మాదాల రమేష్ బాబు తదితరులు సత్కరించారు.

## స్వచ్ఛ ఆంధ్ర మిషన్ డైరెక్టర్ భూలక్ష్మికి అభినందన

మంగళగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: మంగళగిరి పార్క్ రోడ్డు యాదవపాలెంలో ఇటీవల రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన ఆరుద్ర భూలక్ష్మి ్మని ఆమె కార్యాలయంలో టీడీపీ పట్టణ బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ బీసీ నాయకులు కలసి అభినందించారు.



రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, నాయకులు భూలక్ష్మి ్మని శాలువాతో సత్కరించి బోకే అందజేశారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలుగా భూలక్ష్మి ్మ మహిళలను సమన్వయం చేస్తూ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ముందంజలో ఉండి, పార్టీలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ను ఆదర్శంగా తీసుకొని పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్, గుంటూరు పార్లమెంటు పద్మశాలి సాధికార సమితి కార్యదర్శి జొన్నాదుల బాలకృష్ణ, టీడీపీ బీసీ నాయకులు రుద్రు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళి, దానబోయిన రామారావు, తన్నీరు కృష్ణబాబు, ఓడిశా నరేష్, కలవకొల్లు వీర రాఘవులు, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నవులూరులో తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్ వేడుకలు



మంగళగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: నవులూరులో టీడీపీ నాయకులు కొల్లి వెంకట్రావు కార్యాలయంలో బుధవారం రాత్రి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బోగి వినోద్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రు శ్రీనివాసరావు, మర్రి ఏసుబాబు, బత్తుల నాగరాజు, పేరుబోయిన వెంకటేశ్వరరావు, ఊదారపు శేషగిరిరావు, తోట శ్రీనుబాబు, మూరకొండ ఉమా, తోట సాంబ, పానకాలరావు, శ్రీకాంత్, రుద్ర గోపి, బత్తుల హనుమంతరావు, కాటా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీటింగ్స్ పంచుతున్న ఎస్ఎఫ్ఐ సంఘ నాయకులు

పెదనందిపాడు, సెప్టెంబర్ 4 , ప్రభాతవార్త: భారతీయ విద్యార్థి ఫౌండేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు అనంతరం పెదనందిపాడు కాకుమాను మండలాలలోని వివిధ స్కూల్స్, పాఠశాలలు. కాలేజీల అధ్యాపకులకు. ఉపాధ్యాయులకు గ్రీటింగ్ కార్డు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు . ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు అనిల్ కుమార్ అభిలాష్ లు మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్ని వృత్తులు ఉన్న వారి అందరినీ తయారు చేసే వృత్తి



ఉపాధ్యాయ వృత్తి అని.అందుకే ఆ వృత్తి అంటే మాకు ఎంతో గౌరవం అనే నినాదంతో ఉన్న గ్రీటింగ్ కార్డును ఉపాధ్యాయులకు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు . కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యా విధానం 2020 వల్ల భవిష్యత్తులో ఉపాధ్యాయులు ఉండే వాళ్ళని చరిత్రలో చెప్పుకునే రోజులు రాబోతున్నాయని వారు విమర్శించారు. ఎన్ ఈ పి వ్యతిరేకిస్తేనే భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తి ఉంటుందని లేకపోతే కనుమరుగైపోయే ప్రమాదం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రదీప్, శ్యామ్, భాగ్యరాజు ,తదితరులు పాల్గొన్నారు.

## బాల బాలికలకు సమాన హక్కులు అవకాశాలు కల్పించాలి

పెదనందిపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: సమాజంలో బాలబాలికలకు స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు సమాన గౌరవాలు కల్పించడం.లింగ వివక్షతను తగ్గించడం వలన న్యాయమైన సమాజాన్ని నిర్మించగలమని చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారిని జి విజయలక్షి ్మ అన్నారు. వరగాని సబ్ సెంటర్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.



అమ్మాయిలకు 18 సంవత్సరాలు అబ్బాయిలకు 21 సంవత్సరం నిండిన తర్వాతే వివాహం చేయటం ఆరోగ్యపరమే కాకుండా అన్ని విధాల మంచిదని. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. అమ్మాయిలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందాలని వారి శారీరకంగా మానసికంగా పురుషులతో సమానంగా గౌరవించాలని అప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి సూపర్వైజర్ ఎండి జరీన. లావణ్య. అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

పెదనందిపాడు సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: విద్యార్థులను ఉపాధ్యాయులు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని. వారి మనసెరిగి విద్యాబోధన చేయటం పట్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని పెదనందిపాడు మండల విద్యాశాఖ అధికారులు కేఎఫ్ కెనడీ పి జాకబ్ లు అన్నారు. గురువారం పెదనందిపాడు భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న. ఐ ఈ ఆర్ పి ఉపాధ్యాయులు. పూర్ణచంద్రరావు. సురభి. పరిమళలను. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం



సందర్భంగా అడ్వాన్స్ గా వారి కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. ఇదేవిధంగా మండలంలోని పలు పాఠశాలలోని ఉపాధ్యాయులను ఎంఈఓ 1 కెఎఫ్ కెనడి. ఎంఈఓ 2. పి జాకబ్ లు ఘనంగా సత్కరించి వారికి పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలను సూచించారు.

## పెద్ద గొట్టిపాడు గ్రామంలో పొలంబడి

ప్రత్తిపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త: మండలంలోని గొట్టిపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కేంద్రీయ సస్య రక్షణా కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి మరియు మండల వ్యవసాయ అధికారి షేక్.సుగుణ బేగం హాజరైనారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్తి పొలాలను పరిశీలించడం జరిగింది. కె.వీరయ్య చౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి పంటలో తామర పురుగులు మరియు పేను బంక గుర్తించడం జరిగింది పురుగులను గుర్తించడం జరిగింది.వీటి నివారణకు వేప నూనె ఒక లీటర్ నీటికీ 5 ఎమ్ఎల్ చొప్పున పిచ్చికారి చేసుకోవాలి.అదేవిధంగా రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఉన్న ఎడల ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా ఎసిటమిప్రీడ్ 0.2 గ్రాములు లీటరునీటికి పిచ్చికారి చేసుకోవాలని తెలియ ేశారు.మండల వ్యవసాయ అధికారి మాటా



డుతూ రైతులు ఎరువుల విషయంలో ఎలాంటి ఆందోళన చందనవసరం లేదు అని తెలియజేశారు. అదేవిధంగా యూరియా మీ చెంతకు అనే కార్యక్రమం ద్వారా ఎరువుల విషయంలో రైతులందరికీ అవగాహన కల్పించడం జరిగింది.మండలంలో సాగు చేసిన పంటలకు కావాల్సిన ఎరువులు రైతు సేవ కేంద్రాలు,పిఎసిఎస్ మరియు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. కావున రైతులందరూ ఎటువంటి ఆందోళన ఆందోళన చ్నెదనవసరం లేదు అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో వి.హెచ్.ఏ.షణ్ముఖ రెడ్డి మరియు గ్రామం రైతులు హాజరైనారు.

## కెఎల్ యూనివర్సిటీలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

తాడేపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : యువతలో మాదక ద్రవ్యాల అలవాటు పెద్ద సవాలుగా మారిందని,మొదట స్నేహితుల ఒత్తిడి లేదా ఆసక్తితో మత్తు పదార్థాలతో మొదలై తర్వాత డ్రగ్స్‌కి బానిసై జీవితాన్ని పూర్తిగా నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఈగల్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఆకే రవికృష్ణ అన్నారు.విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒకసారి ఈ చీకటి లోకంలోకి అడుగు పెట్టాక,బయటకు రావడం చాలా కష్టం అన్నారు.ప్రభుత్వం,పోలీసులు,సమాజం కలసి ఈ సమస్య నుండి అధిగమించే దిశగా పయనిస్తూ మాదక ద్రవ్యాలను అరికడుతున్నామని,అదేవిధంగా విద్యార్థులు "డ్రగ్స్ ఒద్దు బ్రో" అనే నినాదంతో ముందుకు సాగి రాబోయే తరాలకు ఆదర్శంగా



నిలవాలని తెలిపారు.గంజాయి,డ్రగ్స్ పై ఉక్కుపాదరం మోపుటకు ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చి ఏపిలో గంజాయిసాగు పూర్తిగా అరికట్టడం జరిగిందన్నారు.ఒడిస్సాలో 5జిల్లాల నుండి ఏపి లోకి గంజాయి రవాణా జరుగుతుందని దీన్ని అరికట్టడానికి ఇంటర్ స్టేట్ చెక్ పోస్టు ఏర్పాటు చేశామన్నారు.గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ ఏటివి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దు ష్ప్రలితాల గురించి అవగాహన పెంచుకొని ఇతరులకు తెలియజేయాలని కోరారు.వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ తమ వర్సిటీలో ఎటువంటి ర్యాగింగ్ లేకుండా ప్రతి విద్యార్థి ఎంతో సంతోషంగా,భద్రంగా ఉంటున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రసాద్,ఈగల్ డిఎస్పీ సింగయ్య,ఇన్‌స్పెక్టర్ విక్టర్,ఎస్సై సునీల్,ఈగల్ సిబ్బంది,1000మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కెఎల్‌యులో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభం

తాడేపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో నెట్ వర్కింగ్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్,సైబర్ సెక్యూరిటీ వంటి రాబోయే తరాలకు చెందిన సాంకేతికతలలో నైపుణ్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళే దిశగా ఒక ముఖ్యమైన అడుగు సూచిస్తుందని జునిఫర్ అకాడమీ గ్లోబల్ హెడ్ అర్చన యాదవ్ తెలిపారు.వర్సిటీలో జునిఫర్ ఏఐ డ్రివెన్ క్యాంపస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స ప్రారంభించి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.గౌరవాతిధిగా ఎడ్యూ స్కిల్స్ సిఈఓ శుభజిత్ జగదేవ్



హాజరుకాగా విసి డాక్టర్ కె.రాజశేఖరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. అర్చన యాదవ్,శుభజిత్ జగదేవ్,రాజశేఖరరావు లు మాట్లాడుతూ ఇది పరిశ్రమ ఆధా రిత జ్ఞానం,ప్రపంచ ప్రామాణిక శిక్షణా కార్యక్రమాలతో విద్యార్థులు,అధ్యాపకులను సాధికార పరచడంలో కెఎల్‌యు నిరంతర నిబద్ధత ప్రతిబింబిస్తుందన్నారు.ఒక ప్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించి అందులో 60మంది శిక్షణ పొందుతున్నారన్నారు.కార్య క్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జిపిఎస్ వర్మ,ప్రొఫెసర్ డాక్టర్ జిపిఎస్ వర్మ,డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు హాజరయ్యారు.

## అన్నిదానాల్లో కెల్లా అన్నదానమే మిన్న



పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: అన్ని దానముల కన్న అన్నదానమె మిన్నయని, ప్రతి ఒక్కరూ ఆకలిగా ఉన్నవారికి పట్టెడన్నము పెట్టాలన్న ఆర్యోక్తిని ఆచరణలో పెట్టాలని టిడిపి నియోజకవర్గ నాయకుడు సుఖవాసి సుధీర్‌చంద్ అన్నారు. నిడుబ్రోలు రైలుపేటలో రెల్లి కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపం వద్ద గురువారం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌చంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇక్కడ మట్టి వినాయకున్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినియక చవితి సందర్భంగా నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని అన్న సంతర్పణ చేయాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడుబ్రోలు పట్టణాధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయవృత్తి ఉన్నతమైంది

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: వృత్తులన్నింటిలోకి ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సాయి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల



గౌరవభావంతో ఉండి క్రమశిక్షణాయుతమైన విద్యను అభ్యసించాలని కోరారు. చదువు ద్వారానే సమాజంలోని అంతరాలు తొలగుతాయన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యనభ్యసించి ఉన్నతులుగా ఎదగాలన్నారు. లయన్స్‌క్లబ్ రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి మాట్లాడుతూ విద్యార్థులకు చక్కగా పాఠ్యాంశాలు బోధించిన ఉపాధ్యాయులు ఎన్నటికీ గౌరవింపబడతారన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వి పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేస్తున్నామన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తమ స్కూల్‌లోని ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఇరువురు ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, కార్యదర్శి జి.శోభ కలూష, కోశాధికారి పి.నిర్మలాదేవి, క్లబ్ సభ్యులు కె.నరసింహాచారి, జి.కృష్ణకుమారి, పరాశరం శేషుకుమారి, పి.ఉమాకుమారి, టి.శ్రీలక్ష్మి, పి.మోహనలక్ష్మి, విమల తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నాయకుడు డక్కుమళ్లకు పితృవియోగం

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి డక్కుమళ్ళ రవి తండ్రి డక్కుమళ్ళ మృత్యుంజయరావు(83) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రో జుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. మృత్యుంజయరావు మృతి వార్త విన్న నాయకులు, కార్యకర్తలు నిడుబ్రోలు రవి ఇంటికి వెళ్ళి మృత్యుంజయరావు మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో వైకాపా నాయకులు వడ్రాణం ప్రసాదరావు, బొనిగల రాజారావు, షేక్ నాజర్, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, ఆకుల వెంకటేశ్వరరావు, బోయిన శివనాగరాజు, షేక్ షఫాయితుల్లా, చింతలపూడి మురళీకృష్ణ, అమిరినేని సాంబశివరావు, ఎందేటి వెంకటసుబ్బయ్య తదితరులున్నారు.

## ఇలా ఉంటే....వర్షపాతం నమోదు ఎలా...?

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: పొన్నూరు మండలంలో ఎంత మేరకు వర్షం కురిసింది అని



తెలుసుకునేందుకు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వర్షపాతం నమోదు చేసుకొనేందుకు రెయిన్‌పాల్ గేజ్‌ని ఏర్పాటు చేశారు. దానికి భద్రత కల్పించేందుకు చుట్టూ పెన్సింగ్ వేశారు. ఈ ఏర్పాటు చేసిన గేజ్‌లోకి పశువులు, మనుష్యులు ఇతర జంతువులు ఏవీ వెళ్లకుండా ఉండేందుకు ప్రగడ్బందీ చర్యలు తీసుకున్నారు. అంత వరకు బాగానే ఉంది. రెయిన్‌పాల్ గేజ్ చుట్టూ అడవిని తలపించేవిధంగా పిచ్చి మొక్కలు పెరిగి రెయిన్‌పాల్ గేజ్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఈ విధంగా చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉంటే రెయిన్ పాల్ గేజ్‌లోకి వర్షం ఎలా పడుతుంది....? వర్షం ఎంత కురిసిందో ఖచ్చితమైన కొలత వస్తుందా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రెయిన్ గేజ్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి సక్రమంగా వర్షపాతం నమోదు చేసేందుకు వీలుగా చూడాలని పలువురు కోరుతున్నారు.

## ఎన్ఐఆర్ఎఫ్‌లో విజ్ఞాన్స్‌కు 70వ ర్యాంకు

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్ఆర్‌డీ) గురువారం విడుదల చేసిన 2025వ సంవత్సరం ఉన్నతస్థాయి విద్యాసంస్థల ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకులలో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో 70వ ర్యాంకు లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్ స్లర్, కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ



వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు లభించిందన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలో కూడా80వ రా ్యంకు సాధించినట్లు చెప్పారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్‌సెప్షన్ కేటగిరీల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ పనితీరును కేంద్రం పరిశీలించి 100పాయింట్లు స్కోర్ ప్రామాణికంగా ఈ ర్యాంకులను కేటాయించిందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు లభించడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ ఏజన్సీల నుంచి గ్రాంట్లు అందుతాయన్నారు. విజ్ఞాన్‌కు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు లభించడం వల్ల ప్రముఖ బహుళ జాతి కంపెనీలు వర్సిటీ విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సమాజంలోని అన్ని రంగాల నుంచి వచ్చిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తు కోసం వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, పరిశోధనలను ప్రోత్సహించడం వల్లే జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకును సాధించామన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఈ ర్యాంకును సాధించడానికి ముఖ్య కారణం వర్సిటీ ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్స్, స్టూడెంట్స్ అని అన్నారు. యూనివర్సిటీలో పరిశోధనలను ప్రోత్సహించడానికి దేశంలోని ప్రముఖ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సంస్థలతో అవగాహన ఒప్పందాలను కూడా ఏర్పరచుకున్నామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూఏసీ టీంను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్నికల హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని ఏపిటిఎఫ్ అధ్యక్షుడు ఎంఎం



ఖుద్దూ ్దస్ డిమాండ్ చేశారు. మండలంలో ఏపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మేరకు న ఆలుగు డిఏలను తక్షణమే విడుదల చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. పిఆర్సీ కమీషన్‌ను నియమించాలని, పిఆర్సీ కమీషన్ ఆలస్యం అయితే 30శాతం మధ్యంత భృతి ప్రకటించాలన్నారు. జిల్లా కార్యదర్శి గడ్డిపాటి శివరామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల పని భారం తగ్గించాలని, అసెస్మెంట్ పుస్తకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరంలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కిషోర్‌షా, ఎ.శ్రీనివాసరావు, బాలకృష్ణ, నాయక్, రమేష్, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం ప్రాణత్యాగం చేసినఉమేష్‌చంద్ర -మంత్రి నాదెండ్ల మనోహర్


తెనాలి, సెప్టెంబర్ 4 (ప్రభాతవార ్త) : ప్రజల కోసం ప్రాణం ధారపోసిన పోలీస్ అధికారిగా ఉమేష్‌చంద్రను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువరని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ సందర్భంగా నిజాయితీ, ధైర్యం ప్రజాసేవ ఆయన మనకు అందించిన వారసత్వం వంటివని కొనియాడారు. దివంగత ఐపిఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 26వ వర్ధంతి కార్యక్రమం గురువారం తెనాలి చెంచుపేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా హాజరైన మనోహర్ మాట్లాడుతూ ప్రజాసేవ పరమ ధర్మమని చదలవాడ జీవితం చాటి చెప్పిందని, ఆయన చరిత్ర నేటి పోలీస్ అధికారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ధైర్యానికి పర్యాయపదంగా అరాచక శక్తులను అణిచివేసారన్నారు. ఫ్యాక్షన్ గడప కడపలో ప్రజల మనిషిగా గుర్తింపు పొందలిగారన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఆయుధం లేకుండా సాయిధ నక్సలైట్లకు ఎదురు వెళ్ళటం ఉమేష్ చంద్ర ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఆఖరి శ్వాస వరకు తన పోరాటం ఆపలేదన్నారు. బుల్లెట్లు శరీరాన్ని చిద్రం చేస్తున్నా నక్సలైట్లను నిలువరించే ప్రయత్నం చేసారన్నారు. కేవలం మృత్యువు మాత్రమే ఆయన సాహసాన్ని నిలువరించగలిగిందని, ఆ క్షణాలే పోలీస్ చరిత్రలో అమర గాథగా నిలిచాయని ఆలపాటి వివరించారు. ఉమేష్‌చంద్ర మరణం రాష్ట్రాన్ని కదిలించగా సంఘటన జరిగిన సంజీవరెడ్డి నగర్ సెంటర్‌తో పాటు తెనాలిలో కూడా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఉమేష్‌చంద్ర సతీమణి, పశ్చిమ గోదావరి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నిజాయితీ పరుడైన ఒక పోలీసు అధికారిని ప్రజలు ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటారనటానికి ఈ వర్ధంతి కార్యక్రమమే నిదర్శనమన్నారు. స్వచ్ఛందంగా నివాళులు అర్పించేందుకు తరలి వచ్చిన ప్రజలకు చదలవాడ కుటుంబీకురాలిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహ మాట్లాడుతూ తన తండ్రి నుండి దివంగత ఉమేష్‌చంద్ర గురించి తెలుసుకుని ప్రేరణ పొందానన్నారు. తెనాలి డిఎస్పీ జనార్ధన్ మాట్లాడుతూ పోలీస్ అంటే ఎలా ఉండాలన్న దానిని ఉమేష్‌చంద్ర చూపారని, ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది అదే బాటలో పయనిస్తే ప్రజల మెప్పును పొందగలుగుతారన్నారు. ప్రత్యేకించి ఉమేష్‌చంద్ర ఎస్పీగా ఉన్న కాలంలో ఆయన దగ్గర పనిచేసిన అధికారులు చెప్పిన మాటలు ఆహుతులను ఆలోచించేసాయన్నారు. తొలుత నాదెండ్ల, ఆలపాటి, చదలవాడ తదితరులు ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చిన్నారులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. సభాకార్యక్రమం తదుపరి కలెక్టర్ నాగరణి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పుర ప్రముఖులు, పోలీసు సిబ్బంది ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చదలవాడ కుటుంబీకులు భుజంగరావు, క్రాంతి, ఉమామహేశ్వరరావు, సాంకేతిక విద్యాశాఖ అధికారులు, కోస్తా జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. చదలవాడ కటుంబీకుల భావోద్వేగాలు, అభిమానులు, స్థానిక విద్యావేత్తల ప్రసంగాలు పలకరింపులు అక్కడి వాతావరణాన్ని మరింత గంభీరంగా హృద్యంగా మార్చాయి.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): తెనాలి నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 మంది లబ్ధిదారులకు 10



లక్షల ఎనిమిది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా లక్షలాదిమంది పేదల వైద్యానికి సహాయం అందించి వారి జీవితాలకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ పేదలు కూడా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య సహాయం పొందలేని స్థితిలో ఉండకూడదని కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా వారికి ఆర్థికంగా ఆరోగ్యపరంగా భరోసా కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా పేదలు కార్పొరేట్ వైద్యశాలలో కూడా వైద్యం చేయించుకునే సౌకర్యం కల్పించింది కూటమి ప్రభుత్వమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దుస్,రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యంలో బంగారు పతకం సాధించిన తెనాలి యువతి

తెనాలి టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): పట్టణంలోని నందుల పేటకు చెందిన కొండవీటి సాయి శ్రీనిజ ఆయుర్వేద వైద్యం తుది పరీక్షల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. డాక్టర్ ఎన్టీఆర్



హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన బీఎఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ) తుది పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, డాక్టర్ నూరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాల బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ గా ఎంపికయింది. మొత్తంగా మూడు బంగారు పతకాలు,ఒక వెండి పతకం సాధించి సెప్టెంబర్ 9న నిర్వహించే స్నాతకోత్సవంలో అందుకోనుంది.ఆమేరకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందినట్లు సాయి శ్రీనిజ తండ్రి శంకర్ సాయి శర్మ గురువారం తెలిపారు.సాయిశ్రీనిజ పట్టణంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి, ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద విద్యాలయంలో ఎండి కోర్సు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు సాయిశ్రీనిజ ని అభినందించారు.

## శ్రీ భావనాఋషి ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం:

తెనాలి టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): పట్టణంలోని షరాఫ్ బజారులో వేంచేసిన శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనాఋషిస్వామి వారి దేవస్థానం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణా ధికారిణి శారదాదేవి సమక్షంలో,కమిటీ



ఛైర్మన్ గా చిన్నం హరిగోపాల్ ప్రమాణ స్వీకారం చేయగా,సభ్యులుగా జొన్నాదుల మదన్మోహన్రావు, ఆకురాతి శ్రీనివాసరావు, తాడిపర్తి శ్రీనివాసరావు,గుంటి ధనలక్ష్మి ్మ,బాధ్యతలు స్వీకరించారు.నూతన కమిటీని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ ఇతర పద్మశాలి సంఘ సభ్యులు అభినందించారు.

## ఎల్ఐసి ఆర్థిక భద్రతకు భరోసా

తిరువూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త : భారతీయ జీవిత భీమా సంస్థ (ఎల్ఐసి) 69వ భీమా వార్షికోత్సవ సదస్సు తిరువూరు శాటిలైట్ కార్యాలయంలో మేనేజర్ ఎం.రమేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ ఉదయ్ భాస్కరరావు



మాట్లాడుతూ ఎల్ఐసి ఆర్థిక భద్రతకు భరోసాలాంటిదని, ఒకనాడు నా చేత బలవంతంగా పాలసీ చేయించారని అనుకున్నాను. కానీ నా పిల్లల చదువులకు ఎంతో ఉపయోగపడిందని, అత్యవసర సమయంలో ఆర్థిక లోటు భర్తీ చేయడానికి ఎల్ఐసి బాండ్ మీద లోన్ తీసుకుని ఆర్థిక ఇబ్బందుల నుండి తప్పించుకొనవచ్చాన్నారు. ఆ క్రమంలో పోటీల్లో గెలిచిన విద్యార్థులకు మరియు వార్షికోత్సవం సందర్భంగా ఏజెంట్లకు బహుమతులు అందచేశారు. కార్య క్రమంలో కార్యాలయ ఏవోలు వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, క్లియాలు, డివోలు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

## సుపరిపాలన కూటమితోనే సాధ్యం

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: రాష్ట్రంలో సుపరిపాలన అందించే సత్తా ఒక్క కూటమి ప్రభుత్వానికే ఉందని ప్రజానీకం నమ్మారని, అందుకు కనీ వినీ ఎరుగని రీతిలో ఫలితాలను అందించారని టిడిపి నియోజకవర్గ నాయకుడు చెన్నుపాటి భాస్కర్ అన్నారు. స్థానిక ఆరవ వార్డులో రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ



సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ నిర్వహణను సక్రమంగా నిర్వహించలేదన్నారు. కార్డుదారులకు నిత్యావసరాలు ఇవ్వడంలో కూడా పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్‌కార్డులను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా అధికార ప్రతినిధి తానికొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్డుదారులందరికీ ఇంటింటికి తిరిగి కార్డులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరూ కార్డు రాలేదని చింతించాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం నూతన అధ్యాయానికి నాంది పలికిందన్నారు. గత ప్రభుత్వం ఒక్కరికి కూడా కొత్త కార్డు ఇవ్వలేదన్నారు. ఇక రేషన్ అయితే బియ్యాన్ని వారి ఇష్టం వచ్చినట్లు మాఫీక చేతుల్లోకి వెళ్ళిపోయిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ రేషన్ మాఫీయాపై ఉక్కుపాదం మోపారన్నారు. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు శాఖాధికారులకు అక్రమ రేషన్‌పై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారన్నారు. గత పాలకులు పేదలకు చెందాల్సిన బియ్యాన్ని పందికొక్కుల్లా మెక్కారన్నారు. రానున్న రోజుల్లో కార్డుదారులకు వివిధ రకాలైన నిత్యావసరాలు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో భరణి, నాయకులు లింగమల్లు మోహన్, తోట శ్రీనివాసరావు, నన్నపనేని మురళీ, గోవాడ వెంకటకృష్ణారావు, ధరణికోట సాయి, నరసింహారావు తదితరులున్నారు.

## యూరియాపై ఆందోళన వద్దు

పొన్నూరు, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: యూరియా ఇతర ఎరువులపై రైతులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని కోరారు. చేబ్రోలు మండలంలోని అన్ని రైతు



సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు, గ్రామసభలు,ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ అని ్న రైతే సేవా కేంద్రాలలో ఎరువులు ఉన్నాయన్నారు. రైతులు కూడా ఈ పంటకు అవసరమైన ఎరువులను మాత్రమే తీసుకోవాలన్నారు. కొంత మంది రైతులు వచ్చే సీజన్‌కు కూడా ముందే తీసుకోవడం వల్ల కొంత ఇబ్బంది అనేది కలుగుతుందన్నారు. ఎవరైనా రైతులు ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటికే 1100మెట్రిక్ టన్నుల సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇంకో 4300మెట్రిక్ టన్నులు జిల్లాకు రానున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు ఎరువులపై సమీక్ష చేస్తున్నారన్నారు. రైతులు అవసరమైన మేరకు మాత్రే ఎరువులు తీసుకోవాలన్నారు. రైతుల్లో అపోహలు తొలగించేందుకు గ్రామసభలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు.

## జైజై గణేషా...గణపతి పప్పా మోరియా...



కొల్లిపర,సెప్టెంబరు 4 ప్రభాతవార్త: జై గణేషా..జైజై గణేషా...గణపతిపప్పా మోరియా..అంటూ భక్తులు గ్రామాల్లో మారు మ్రోగించారు.మండల కేంద్రం కొల్లిపర బ్రహ్మణ ఐక్య వేదిక భవనం నందు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం 9 వ రోజున పుణ్య దంపతులు గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు.కుడుములు,ఉండ్రాళ్ళు,పొంగళ్ళు,పానకం వంటివి గణేష్ మహరాజ్‌కు నైవేద్యం పెట్టి ఘనంగా పూజలు నిర్వహించి ట్రాక్టరుపై ఊరేగించి కృష్ణానదిలో నిమజ్జనం చేసారు.గణపతి ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేస్తున్నారు.ఇదేవిధంగా మండలంలోని వల్లభాపురం,మున్నంగి,దావులూరు,తూములూరు,చక్రాయపాలెం,కొల్లిపర తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సుందరంగా తీర్చిదిద్ది గత 9 రోజులుగా ఘనంగా పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఫణిమాస్టరు,కల్వకుంట్ల వీరభద్రయ్య,పోగుల రామలింగేశ్వరశర్మ, పరాశరం జగన్నాధాచార్యులు,రమణశర్మ,నిరంజ్‌శర్మ,చిలుకూరి వెంకటేశ్వశర్మ,కొల్లిపర రాంబాబు శర్మ,భక్తులు పాల్గొన్నారు.

## తడిచెత్త..పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలి

కొల్లిపర,సెప్టె ంబరు 4 ప్రభాతవార్త: తడిచెత్త..పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు.గురువారం మండల పరిధిలోని అత్తోట పంచాయతీ దగ్గరలో స్వచ్ఛ సంపద



తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్,కార్యదర్శి లక్ష్మి,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కొల్లిపర,సెప్టెంబరు 4 ప్రభాతవార్త: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈవో ఝాన్సిలత అన్నారు.గురువారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా గురుపూజోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.దినోత్సవ గ్రీటింగ్ కార్డులను ప్రదర్శన చేసారు.ఈ



సందర్భంగా ఝాన్సిలత మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.ధనలక్ష్మి, పాధ్యాయులు రాము,వెంకాయమ్మ,శ్రీలక్ష్మి,నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం

తెనాలి మున్సిపాలిటీ . సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): పురపాలకసంఘ పరిధిలో 23వ వార్డు,చంద్రబాబు నాయుడు కాలనీలో పురపాల సంఘ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ యేసుబాబు,అర్బన్



హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రమేష్ బాబు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొని షుగర్ బీపీ మలేరియా టైఫాయిడ్ వంటి రక్త పరీక్షలు నిర్వహించారు.సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలుబు దగ్గు జ్వరం వంటివి వచ్చినప్పుడు వెంటనే వైద్యం సంప్రదించాలని డాక్టర్ మొవ్వ ఏసుబాబు సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ వంటి వ్యాధులు దోమల వల్ల వస్తాయి అని అందువలన ప్రజలు దోమలు కొట్టకుండా దోమతెరలు వాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సరోజిని,వైద్య సిబ్బంది,ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి ప్రత్యేకపూజలు నిర్వహించిన ఆలపాటి

తెనాలి టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): వినాయక నవరాత్రులు ముగింపు సందర్భంగా,ఎంఎల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేకపూజలు



నిర్వహించారు.మండల గ్రామం కొలకలూరులోని బీసీ కాలనీలో గత పాతిక సంవత్సరాల నుండి అబ్బయ్య అబ్బమ్మ పేరంటాల గౌడ సంఘం వినాయక చవితి ఉత్సవాలను అతి వైభవంగా నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం తొమ్మిదోరోజు కావడంతో స్వామివారి ఊరేగింపు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కాలనీలో ఉన్నవాళ్ళందరూ ఎంతో సామరస్యంగా ఉత్సవాలు నిర్వహించుకుంటూ ఆదర్శంగా నిలవటం చూస్తుంటే చాలా ముచ్చటగా ఉందన్నారు.అనంతరం ఎంఎల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పంది నారాయణ,పెద్దబాబు, వేముల సుమంత్,పంది నరేష్,హరికృష్ణ,ధర్మారావు, పంది శ్రీనివాస్,బత్తిన నరసింహారావు,పంది ప్రసాద్, ఎస్.కే అజీజ్,ఎస్ కే జిలాని, గ్రామతెలుగుదేశంపార్టీ, జనసేన,బిజెపి పార్టీల నాయకులు నాయకులు కార్యకర్తలు,పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు

# 'కొత్తలోక 'ను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



ప్రముఖ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ కి చెందిన వేఫేరర్ ఫిలిమ్స్ నిర్మాణ సంస్థ నిర్మించిన మలయాళ చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్, నస్లెన్ కె. గఫూర్ ప్రధాన పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ, 'కొత్త లోక 1: చంద్ర' పేరుతో విడుదల చేశారు. భారతదేశపు మొట్టమొదటి మహిళా సూపర్ హీరో చిత్రంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొత్త లోక 1: చంద్ర'.. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోంది. భారీ వసూళ్ళను రాబడుతూ మలయాళ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. మొదటి వారంలోనే రూ.100 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి సంచలన విజయం దిశగాదూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులునాగ్ అశ్విన్, వెంకీ అట్లూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రముఖ కథానాయకుడు, చిత్ర నిర్మాత దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ,కొత్త లోక కోసం ఇంత మంచి టీంతో పనిచేయడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ సినిమా కోసం మనసుపెట్టి పనిచేశారు. ఉత్తమ నటీనటులు, ఉత్తమ సాంకేతిక నిపుణుల మద్దతుతోనే ఇంతగొప్ప సినిమా చేయగలిగాము. అందరూ తమ డ్రీమ్ లా ఈ సినిమా కోసం పని చేశారు. కొత్త లోక సినిమాని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నన్ను ఎలాగైతే మీ వాడిగా భావించారో, అలాగే కొత్త లోకను కూడా మీ సినిమాగా భావించి ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలుఅన్నారు.ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ.. ఇలాంటి మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. తెలుగు ప్రేక్షకులు మరింతగా ఆదరిస్తారని నమ్ముతున్నానునని అన్నారు. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ... ఈ సినిమాని నమ్మి నిర్మాతగా ధైర్యం చేసిన దుల్కర్ సల్మాన్‌ని ముందుగాఅభినందించాలి. అలాగే సినిమాటోగ్రాఫర్ నిమిష్ రవి, ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ లను ప్రత్యేకంగా అభినందించాలి. సినిమాలో ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. కళ్యాణి ప్రియదర్శన్ గొప్పగా నటించింది. ఈ సినిమా ఇంత గొప్పగా మలిచిన దర్శకుడు డొమినిక్ అరుణ్ ప్రతి ప్రశంసకు అర్హుడు. నాగవంశీ ఈ సినిమాతో విజయం సాధించడం ఆనందంగా ఉంది. అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ చూసి తెలుగులో నేనే విడుదల చేయాలి అనుకున్నాను.చిత్ర కథానాయిక కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ,నాకు ప్రేమ చూపించిన మొదటి ప్రేక్షకులు తెలుగువారే. అది నేను ఎప్పటికీ మరచిపోను. . కొత్తలోక సినిమాని తెలుగు సినిమాలా భావించి ఆదరిస్తున్నారు. ప్రముఖ యాంకర్ సుమ వ్యాఖ్యాతగా వైభవంగా జరిగిన ఈ వేడుకలో నటులు అరుణ్‌కురియన్, చందు, ఛాయాగ్రాహకుడు నిమిష్ రవి, కళా దర్శకుడు బంగ్లాన్, రచయిత్రి శాంతి, గీత రచయిత రాంబాబు పాల్గొని'కొత్త లోక 1: చంద్ర' చిత్ర విజయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సినిమాకి బ్రహ్మరథం పడుతున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విడుదలకు ముందే రికార్డుల వేట

ఇంకా ట్రైలర్ కూడా విడుదల కాకముందే,



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నూతన చిత్రం 'ఓజీ'ఉత్తర అమెరికా బాక్సాఫీస్ వద్దసంచలనాలు సృష్టిస్తూ, తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రీమియర్ ప్రీసేల్స్‌లో 1 మిలియన్ డాలర్లను రాబట్టి, ఈ సంచలనాత్మక ఘనతను అత్యంత వేగంగా సాధించిన చిత్రంగా నిలిచింది పవన్ కళ్యాణ్ స్టార్ డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. తన అసాధారణ క్రేజ్ తో ఎన్నో రికార్డులను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు 'ఓజీ'తుఫానుతో మరోసారి బాక్సాఫీస్ లెక్కలు సరి చేస్తున్నారు. అభిమానులతో పాటు, ట్రేడ్ వర్గాలు సైతం పవన్ కళ్యాణ్ సృష్టిస్తున్న సరికొత్త రికార్డుల పట్ల ఆసక్తిగా ఉన్నారు. ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు మూడు వారాల ముందే.. ఓజీగా ఆయన బాక్సాఫీస్‌ను శాసిస్తున్నారు. ఆకలితో ఉన్న చిరుతపులిలా, పవన్ కళ్యాణ్ ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టుగా రికార్డులను వేటాడుతున్నారు. ఓజీ చిత్రం నుండి ఇప్పటిదాకా విడుదలైన ప్రతి పోస్టర్, ప్రతి గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. ఖిఓజీఖిపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 'ఓజీ'వసూళ్ల పరంగా బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించి, మైలురాయి చిత్రంగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. పవన్ కళ్యాణ్ గంభీరగా గర్జించనున్న 'ఓజీ'చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ వంటి అద్భుతమైన తారాగణం ఉన్నారు. దర్శకుడు సుజీత్ ఈ చిత్రాన్ని ఒక సినిమాటిక్ తుఫానుగా రూపొందిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు..ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.




# 'ఆల్క' రూపంలో సరికొత్త థ్రిల్లర్ డ్రామా

అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "ఆల్కహాల్" చిత్ర టీజర్ విడుదలైంది. ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేసే, ఒక గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. "ఆల్కహాల్" చిత్రం ఒక ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామా అని తెలిపేలా టీజర్ ను అద్భుతంగా రూపొందించారు. మద్యం కథానాయకుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, తాగడానికి ముందు , తాగిన తరువాత అతని ప్రవర్తన, దాని చుట్టూ జరిగే సంఘటనల సమాహారాన్ని ఈ టీజర్ సూచిస్తుంది.హాస్యం మాత్రమే కాకుండా, నవరసాలను అద్భుతంగా పలికించగల నటుడిగా పేరుగాంచిన అల్లరి నరేష్,"ఆల్కహాల్" రూపంలో మరో వైవిధ్యమైన చిత్రాన్ని అందించబోతున్నారు. ఇందులో ఆయన సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. ఈ సినిమాతో నరేష్, పూర్తిగా కొత్త మార్గంలో అడుగుపెడుతున్నట్లు కనిపిస్తోంది. ఇది ప్రేక్షకులలో ఉత్సుకతను పెంచుతుంది. సుహాస్ నటించిన ఫ్యామిలీ డ్రామా తో విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈసారి ఆయన, ఈ సినిమాని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రసిద్ధి చెందిన నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. "ఆల్కహాల్" టీజర్ లో సాంకేతిక నిపుణుల ప్రతిభ అడుగడుగునా కనిపించింది. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, చేతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రాహకుడిగా జిజు సన్నీ, ఎడిటర్‌గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు.. అల్లరి నరేష్, సత్య కలయికలో పండే వినూత్న హాస్యం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వీరి కలయిక, ఈ మిస్టరీ మరియు థ్రిల్లింగ్ డ్రామాకు వినోద పొరలను జోడిస్తుంది. ఈ చిత్రం జనవరి 1, 2026న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



# 'మటన్‌సూప్' సాంగ్ విడుదల



డిఫరెంట్ కథ, కథనాలతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. విట్‌నెస్ ది రియల్ క్రైమ్ ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మాతలు గా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధిం చిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్, పాటలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రీసెంట్‌గా తనికెళ్ల భరణి రిలీజ్ చేసిన 'హర హర శంకరా 'అనే పాట కూడా మంచి ప్రశంసల్ని దక్కించి, మంచి వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ క్రమంలోతాజాగా ప్రముఖ నటుడు మురళీ మోహన్ ' కల్లు కొట్టు కాడ 'అంటూ సాగే మరో మంచి మాస్ ఎనర్జిటిక్ నంబర్‌ను రిలీజ్ చేశారు. ఈ ప్రత్యేక గీతాన్ని సూరన్న రచించారు. సూరన్న, రేలారే రేలా గోపాల్, సుజాత వాసు కలిసి ఆలపించిన ఈ పాటకు వెంకీ వీణ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక లిరికల్ వీడియోని చూస్తుంటే సత్య మాస్టర్ కొరియోగ్రఫీ మరో స్పెషల్ అట్రాక్షన్ కానున్నట్టుగా కనిపిస్తోంది.సాంగ్ రిలీజ్ చేసిన అనంతరం మురళీ మోహన్ మాట్లాడుతూ,మటన్ సూప్‌టైటిల్ చాలా బాగుంది.యంగ్ టీం చేసిన ఈ ప్రయత్నానికి పెద్ద సక్సెస్ దక్కాలి. సాంగ్ చాలా బాగుంది. అల వైకుంఠపురములో సూరన్న మంచి పాటను పాడారు. జాన పద గీతాలు ప్రస్తుతం ఎక్కువ సక్సెస్ అవుతున్నాయి.'మటన్ సూప్' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.చిత్ర దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుత., 'కల్లు కొట్టు కాడ' పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి థాంక్స్ ఈ పాట ఎస్ఆర్‌కే గారి వల్లే పుట్టింది. గోపాల్ లేకపోతే ఈ ప్రాజెక్ట్ ఉండేది కాదు. మా అన్న ,రామకృష్ణ నాకు ఈ ప్రయాణంలో అండగా నిలిచారు. మా హీరో రమణ్ సహకారం ఎప్పటికీ మర్చిపోలేను. మా సినిమాను పర్వతనేని రాంబాబు నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు. త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ.ాలాంటి చిన్న వాళ్లను ఆశీర్వదించేందుకు వచ్చిన మురళీ మోహన్‌కి థాంక్స్.కల్లు కొట్టు కాడసాంగ్ చాలా బాగా వచ్చింది. వెంకీ వీణ మంచి బాణీని ఇచ్చారు. ఈ పాట వినగానే గ్రాండ్‌గా తీయాలని ఫిక్స్ అయ్యాం. త్వరలోనే మా 'మటన్ సూప్' చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది అని అన్నారు.నిర్మాత రామకృష్ణ సనపల మాట్లాడుతూ.,'మటన్ సూప్' చిత్రంలో 'కల్లు కొట్టు కాడ' అంటూ సాగే రెండో పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి థాంక్స్. ఇలాంటి పెద్దల సహకారం వల్లే మా లాంటి చిన్న నిర్మాతలు, మాలాంటి వాళ్లు తీసే చిన్న చిత్రాలు నిలబడుతున్నాయి. త్వరలోనే మా సినిమాను ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.హీరో రమణ్ మాట్లాడుతూ..'మటన్ సూప్'సినిమాలోని మాస్ సాంగ్‌ను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి ధన్యవాదాలు. ఈ విషయంలో సహకరించిన ప్రభుకి, పర్వతనేని రాంబాబుకి థాంక్స్. రామచంద్రఈ చిత్రాన్ని బాగా తీశారు. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నామని అన్నారు.నటుడు గోవింద్ శ్రీనివాస్ మాట్లాడుతూ,ఈ చిత్రంలోని'కల్లు కొట్టు కాడ' పాటను రిలీజ్ చేసిన మురళీ మోహన్‌కి ధన్యవాదాలు. ఈ చిత్రంలో రామచంద్ర నాకు మంచి పాత్రను ఇచ్చారు. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ మూవీని త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నామని అన్నారు.

# సీజన్ 4లో సందడి చేసిన జెనీలియా



సెఆహా ఓటీటీ "తెలుగు ఇండియన్ ఐడల్ తెలుగులో అతి పెద్ద సింగింగ్ షో ఆహా ఓటీటీ తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4 సక్సెస్ ఫుల్‌గా ప్రేక్షకుల్ని అలరిస్తోంది. ఈ సీజన్4 ఎపిసోడ్ లో తాజాగా హాసినీగా తెలుగు ఆడియెన్స్ కు గుర్తుండిపోయిన హీరోయిన్ జెనీలియా అతిథిగా పాల్గొన్నారు. జెనీలియా అతిథిగా సందడి చేయడం తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4కు ఒక హైలైట్ గా నిలుస్తోంది.ఈ సంగీత కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకులు తమన్, గాయకులు కార్తీక్ మరియు గీతా మాధురి జడ్జెస్ గా అలాగే శ్రీరామచంద్ర హోస్ట్ గా, సమీరా భరద్వాజ్ కో హోస్ట్ గా వ్యవహరిస్తున్నారు. ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 7 గంటలకు ఆహా ఓటీటీలో తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4ప్రసారమవుతోంది. ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూనే ప్రతిభ ప్రోత్సహించేందుకు ఈ తరహా రియాలిటీ షోలను ఆహా అందించడంపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి .

# అన్నిఏజ్ గ్రూప్‌ల వారిని అలరిస్తుంది

"లిటిల్ హార్ట్స్" హిలేరియస్ రోమ్ కామ్ మూవీ, అన్ని ఏజ్ గ్రూప్ ఆడియెన్స్‌ను ఎంటర్ టైన్ చేస్తుంది హీరో మౌళి తనుజ్ "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ "లిటిల్ హార్ట్స్" మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా ఈ నెల 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు హీరో మౌళి తనుజ్.నేను రైటర్, డైరెక్టర్ అవుదామనే ఇండస్ట్రీకి వచ్చాను. ఇండస్ట్రీకి వచ్చాక నటుడిగా అవకాశం వచ్చింది. అలా "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్"తో మీ అందరిలో గుర్తింపు తెచ్చుకున్నా. "లిటిల్ హార్ట్స్" కథ విన్నప్పుడే ఇది థియేట్రికల్‌గా బాగుంటుందనినిర్ణయించుకున్నాం. ఈటీవీ విన్ వాళ్లు కూడా మా నిర్ణయాన్ని సపోర్ట్ చేశారు. ఇప్పుడు మా ప్రయత్నమంతా థియేటర్స్ కు ప్రేక్షకుల్ని రప్పించాలి. మా ప్రమోషనల్ కంటెంట్ తో "లిటిల్ హార్ట్స్" బాగుంటుందనే అభిప్రాయం ప్రేక్షకుల్లో కలిగింది. ఈ బ్యాచ్ మనల్ని థియేటర్స్‌లో నవ్విస్తారు అనే నమ్మకం ప్రేక్షకుల్లో కలుగుతోంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం ప్రమోషనల్ యాక్టివిటీస్ కోసం స్క్రిప్ట్ సైడ్ నేనే వర్క్‌చేశా. కొత్తగా ఉండేలా ప్లాన్‌చేశా. "లిటిల్ హార్ట్స్" లో అలాంటి కంటెంట్ ఉంది.వీలైనన్ని మంచి చిత్రాల్లో నటించాలని ఉంది. ఇప్పుడు నటుడిగా అవకాశాలు వస్తున్నాయి కాబట్టి నటిస్తుంటా. మా కుటుంబంలో ఎవరికీ సినిమా ఇండస్ట్రీతో పరిచయాలు లేవు. నేను కూడా ఇక్కడ స్థిరపడగలనని మా ఫ్యామిలీ వారికి నమ్మకం లేకుండేది. "లిటిల్ హార్ట్స్" సినిమా స్క్రిప్ట్ వరకు నా ఇన్వాల్వ్ మెంట్ లేదు. "లిటిల్ హార్ట్స్" సినిమాను మా పేరెంట్స్ ఇంకా చూడలేదు. రేపు చూపిస్తాను."లిటిల్ హార్ట్స్" చాలా ఎంటర్ టైనింగ్ గా ఉంటుంది. అన్ని క్యారెక్టర్స్ మీకు బాగా కనెక్ట్ అవుతాయి. రోమ్ కామ్ మూవీస్ లో చివరలో ఒక మంచి అనుభూతి కలగాలి. అలా ప్రేక్షకులు ఫీల్ అయితే సినిమా వారి మనసుకు హత్తుకున్నట్లు."లిటిల్ హార్ట్స్" చూశాక ప్రేక్షకులు మంచి సినిమా చూశామనే అనుభూతికి లోనవుతారు "లిటిల్ హార్ట్స్" ప్రమోషన్స్ లో మేము జెన్యూన్‌గా మాట్లాడుతున్నాం. ప్రేక్షకులకు కనెక్ట్ అవుతున్నాం. ఇలాంటి సినిమాను థియేటర్స్ లో చూస్తేనే కామెడీ ఫీల్ అవుతారు. ఓటీటీలో చూస్తే అంతగా కనెక్ట్ కారు. అందుకే థియేటర్స్ లో చూడమని కోరుతున్నాం.




# 'మిరాయ్' లో పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేశా




సూపర్ హీరో తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా విజువల్ వండర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ట్రైలర్ మ్యాసీవ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

. మిరాయ్ ప్రాజెక్ట్ అప్రోచ్ ఎలా జరిగింది?

కార్తీక్ ఈవెంట్ కలిసినప్పుడు మంచి స్క్రిప్ట్ వుంటే కలిసి సినిమా చేద్దాం తమ్ముడుఅని చెప్పాను.రోజు మా గేమింగ్ స్టూడియోలో వున్నప్పుడు తేజ వచ్చి మిరాయ్ గురించి చెప్పాడు, కార్తిక్‌చెప్పిన కథ చాలా నచ్చింది.

ఇందులో మీ క్యారెక్టర్ మోడరన్ రావణ అనుకోవచ్చా?

అనుకోవచ్చు. కానీ ఆడవారి జోలికి వెళ్లడు.

. డైరెక్టర్ కార్తీక్ గురించి?

కార్తీక్ గ్రేట్ టెక్నీషియన్. ఇదే కంటెంట్ ని మరో డైరెక్టర్ చేస్తే మాత్రం ఈ బడ్జెట్ లో అవ్వదు. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాని తీశారు. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను.

నిర్మాత విశ్వప్రసాద్ సపోర్ట్ గురించి?

విశ్వ ప్రసాద్ విజన్ అప్రిషియేట్ చేయాలి. ఆయన పని రాక్షసుడు. చాలా గ్రాండ్ స్కేల్లో సినిమా తీశారు. ఎక్కడ కాంప్రమైజ్ అవ్వలేదు.ఈ సినిమా దాదాపుగా అన్ని లైవ్ లొకేషన్ లోనే షూట్ చేశాం. రియల్ లొకేషన్స్ లో గ్రాఫిక్స్ ని వాడి సినిమా ఎక్స్పీరియన్స్ ని మరింతగా అన్హాన్స్ చేశాం. ఇందులో యాక్షన్స్ అంతా లైవ్ గా వుంటుంది.ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?

నా లైఫ్ లో హైయస్ట్ రెస్పాన్స్ వచ్చిన ట్రైలర్ ఇది. ఇనిషియల్ డేస్ లో మిస్టర్ నూకయ్య, నేను మీకు తెలుసా సినిమాలకు కూడా చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఈ స్కేల్లో సినిమా రావడం, ప్రపంచంలో నలుమూలల నుంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది.

# క్రేజీ యాక్షన్ ఎంటర్ టైనర్

శివకార్తికేయన్ హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్ మదరాసి. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టీజర్, ట్రైలర్, రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

ఫస్ట్ టైం ఎ.ఆర్. మురుగదాస్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?

మెగాస్టార్ చిరంజీవి, సూపర్‌స్టార్ మహేష్‌బాబు లాంటి పెద్ద స్టార్స్ ని డైరెక్ట్ చేసిన డైరెక్టర్ మురుగదాస్. చాలా కూల్ గా ఉంటారు. చాలా క్లారిటీ ఉంటుంది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా షూటింగ్ అంతా చాలా పాజిటివ్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. ఆయనతో కలిసి వర్క్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. సాలిడ్ ఫిల్మ్ ఇచ్చారు.

ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ పాత్ర ఎలా వుంటుంది? ఈ

సినిమాలో లవ్, యాక్షన్ రెండు పిల్లర్స్. అందులో లవ్ పోర్షన్ అద్భుతంగా రావడానికి కారణం రుక్మిణి. ఈ సినిమాలో తన పాత్ర చాలా కీలకం. కథకి ఎమోషన్ యాడ్ చేసే రోల్ అది. తన పెర్ఫార్మెన్స్ సినిమాకి బిగ్ ఎసెట్.

మదరాసి సినిమా ఎలా ఉండబోతోంది?

మదరాసి కథ చాలా కొత్తగా వుంటుంది. హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి. ఎమోషన్, యాక్షన్, కాన్వాస్ పరంగా బిగ్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది.ఈ సినిమాలో యాక్షన్ బ్లాక్స్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తాయి. యాక్షన్‌లో మ్యాడ్ నెస్ వుంటుంది. అది ఆడియన్స్ కి చాలా డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది.బిగ్ స్క్రీన్ పై సినిమా సెలబ్రేట్ చేసుకునేలా వుంటుంది .



05-9Pg5 9_05-9Pg5.qxd 9/4/2025 10:56 PM Page 1



# భారత్, సింగపూర్ సంబంధాలు బలోపేతం




ప్రధాని మోడీతో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ భేటీ

ఆధునిక సాంకేతికత దిశగా ఉభయదేశాల పయనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీస్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోడీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా ప్రధానిమోడీ మాట్లాడుతూ, 'భారత్ యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దు తామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐపేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షిం చాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## టారిఫ్‌ల కేసు విచారణ తక్షణమే జరపండి



### 'సుప్రీం'ను ఆశ్రయించిన అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** ప్రపంచ దేశాలపై ఇబ్బడిముబ్బడిగా పన్నులు విధించేందుకు బ్రేకులు పడుతుండటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫెడరల్ చట్టం ప్రకారం అధ్యక్షుడికి దిగుమతులపై సుంకాలు విధించే హక్కు ఉందని పేర్కొంటూ ఈ కేసును అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది. ఎమర్జెన్సీ అధికార చట్టం ప్రకారం ట్రంప్ సుంకాలు విధించారని ఇటీవల అప్పీల్స్ కోర్టు తీర్పునిచ్చింది. ఆ సుంకాలు చట్ట విరుద్ధమని పేర్కొనడంతో ట్రంప్ యంత్రాంగం తాజాగా సుప్రీం తలుపుతట్టింది. దీనిపై గురువారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నవంబరు ప్రారంభంలోనే ఈ కేసుపై వాదనలు వినాలని సొలిసిటర్ జనరల్ డి.జాన్ సావర్ న్యాయమూర్తిని కోరారు. 'అప్పీల్స్ కోర్టు నిర్ణయం అధ్యక్షుడు ఐదు నెలలుగా విదేశాలతో కొనసాగిస్తున్న చర్చలను అనిశ్చితిలోకి నెడుతుంది. ఇప్పటికే పూర్తయిన చర్చలను, జరగబోయే చర్చలను ప్రమాదంలో పడేస్తుంది' అని వ్యాఖ్యానించారు. ఈ వాదనను లిబర్టీ జస్టిస్ సెంటర్ వ్యాజ్య డైరెక్టర్, సీనియర్ న్యాయవాది జెఫ్రీ ష్వాబ్ తోసిపుచ్చారు. 'చట్టవిరుద్ధమైన సుంకాలు చిన్న వ్యాపారాలకు తీవ్ర హానీ కలిగిస్తున్నాయి. వాటి మనుగడ ప్రమాదంలో పడుతోంది. ఈ కేసులో మా క్లయింట్లకు సత్వరం పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై వ్యాపారవర్గాలు ఇప్పటికే రెండు న్యాయస్థానాల్లో పైచేయి సాధించాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించడంతో ప్రపంచ మార్కెట్లు వణికిపోయాయి. అమెరికాతో దూరం పాటిస్తున్న దేశాలు, మిత్ర దేశాలు ధరలు పెరుగుతాయని, ఆర్థికవృద్ధి మందగిస్తుందని భయాందోళనకు గురయ్యాయి. అయినప్పటికీ ట్రంప్ వెనక్కి తగ్గకుండా పన్నులతో ఐరోపా యూనియన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షల మోత మోగించలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే సెకండరీ సుంకాలను విధించానని, రెండు, మూడు విడతలను చేపట్టలేదని స్పష్టం చేశారు. సుంకాలతో అమెరికాను భారత్ చంపేస్తోందని ఆరోపించారు.



## సిసికెమెరాల పనితీరుపై సుప్రీం సుమోటో పిల్ విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** దేశ వ్యాప్తంగా ఉన్న పలు పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు పని చేయకపోవటం లేదంటూ తాజాగా వెలువడిన వార్తా కథనాలపై సుప్రీంకోర్టు స్పందించింది. వెలువడింది. ఇందుకోసం సుమోటోగా పిల్‌ను స్వీకరించి సుమోటో పిల్ విచారణ చేపట్టడానికి సిద్ధమైంది. ఈ ఏడాది ఎనిమిది నెలల్లో ఒక్క రాజస్తాన్‌లోనే 11 పోలీస్ కస్టడీ మరణాలు సంభవించాయని బెంచ్‌లోని న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సుమోటోగా పిల్‌ను స్వీకరించినట్లు తెలిపారు. 2020లోనే కీలక ఆదేశాలు జారీచేసిన సుప్రీం కోర్టు వాటి అమలును పునఃపరిశీలనచేసింది. నైట్ విజన్, ఆడియో రికార్డింగ్ ఉన్న సీసీటీవీ కెమెరాలను మాత్రమే వాడాలని స్పష్టం చేసింది. సీసీటీవీ ఫుటేజీ రికార్డులను కనీసం 18 నెలలపాటు భద్రపరచాలని తెలిపింది. కస్టోడియల్ వేధింపులు, మరణాలకు సంబంధించిన దర్యాప్తు సమయంలో ఆ సీసీటీవీ కెమెరాల రికార్డులు అందుబాటులో ఉండేలాగా చూసుకోవాలని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదే. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా దేశవ్యాప్తంగా ఉన్న చాలా పోలీస్ స్టేషన్లు పని చేయని సీసీటీవీ కెమెరాలతోటే కాలం వెల్లదీస్తున్నాయి. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేక దర్యాప్తునకు ఆటంకం ఏర్పడుతోంది. కస్టోడియల్ వేధింపుల సమయంలో సీసీటీవీ ఫుటేజీలు లేకపోవటం, టెక్నికల్ సమస్యలు దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నాయని పోలీస్ ఏజెన్సీలు తరచుగా చెబుతూ ఉన్నాయి.

## పౌరసత్వం రాకముందే సోనియాకు భారత్‌లో ఓటు హక్కు

### ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కేసు దాఖలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. సోనియా గాంధీ పేరును 1980లో ఓటర్ల జాబితాలో చేర్చారని, 1983లో ఆమె భారత పౌరసత్వం పొందారని పిటిషనర్ పేర్కొన్నారు. భారత పౌరసత్వం పొందే ముందు ఓటరు హోదాను పొందేందుకు నకిలీ పత్రాలను సృష్టించారని ఆరోపించారు. గురువారం అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా పిటిషన్‌పై వాదనలు ఆలకించారు. ఆ తర్వాత సెప్టెంబర్ 10న తదుపరి విచారణకు ఆదేశించారు. ఈ పిటిషన్‌ను న్యాయవాది వికాస్ త్రిపాఠి దాఖలు చేశారు. 1983 ఏప్రిల్‌లో సోనియా భారత పౌరురాలు కావడానికి ముందే ఆమె ఓటు ఎలా వేయగలిగారనే దానిపై విచారణ చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు అనిల్ సోని, పవన్ నారంగ్ ఫిర్యాదుదారుడి తరపున హాజరయ్యారు. మొదట ఇటాలియన్ పౌరురాలు అయిన సోనియా గాంధీ 1983 ఏప్రిల్ 30న పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 5 కింద భారతీయ పౌరురాలు అయ్యారు. అయితే ఆమె పేరు 1981-82 నాటికే న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో కనిపించింది.ఆ సమయంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాల గురించి ప్రశ్నలు తలెత్తాయి. 1982లో సోనియాతోపాటు ఆమె దివంగత మరిది సంజయ్ గాంధీ పేరును ఎన్నికల జాబితా నుంచి తొలగించారని న్యాయవాది నారంగ్ ఎత్తి చూపారు. అలాంటి తొలగింపు ఆమె మునుపటి ఓటర్ల జాబితాలో నమోదు సక్రమంగా లేదని సూచిస్తుందని తెలిపారు. ఎందుకంటే భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులు అని ఆయన వాదించారు. పిటిషన్ పత్రాలను ఉటంకిస్తూ, ఆమెకు పౌరసత్వం మంజూరు చేయడానికి ముందు నకిలీ లేదా తప్పుడు పత్రాలను ఉపయోగించి ఓటర్ల జాబితాలో చేర్చి ఉండవచ్చని ఆరోపించారు. ఒక ప్రభుత్వ అధికారిని తప్పుదారి పట్టించారని, మోసం జరిగినట్లు కనిపిస్తోందని కోర్టుకు తెలిపారు. పోలీసుల విచారణకు అర్హమైన కేసు, అది నేరమని ఆయన చెప్పారు. ఢిల్లీ పోలీసులు, సీనియర్ అధికారులను సంప్రదించినప్పటికీ, ఎటువంటి చర్య తీసుకోలేదని, పిటిషనర్ కోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాదించారు. అందువల్ల, ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆరోపించిన నేరాలపై దర్యాప్తు కోసం దిశానిర్దేశం చేయాలని పిటిషనర్ కోరుతున్నట్లు తెలిపారు. 1985 అలహాబాద్ హైకోర్టు రాకేష్ సింగ్ వర్సెస్ సోనియా గాంధీ కేసులో ఇచ్చిన తీర్పుపై కూడా పిటిషన్ ఆధారపడి ఉందని చెప్పారు. 1983ఏప్రిల్ 30న రిజిస్ట్రేషన్ ద్వారా భారత పౌరురాలిగా మారిందని కోర్టు అప్పుడు తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పిటిషన్ ఆ తేదీకి ముందు జరిగిన ఓటరు నమోదు చట్టవిరుద్ధమని అన్నారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన పత్రాలను దర్యాప్తు చేయడానికి, రికార్డులను పరిశీలించడానికి పోలీసులను ఆదేశించాలని పిటిషనర్ కోర్టును కోరారు.

## వారు ఏకమవుతున్నారు.. సిద్ధంగా ఉండండి

### పెంటగాన్‌కు యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 4:** చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధినేత జోంగ్‌ఉన్ ఒకే వేదికపై కనపించడం అమెరికా అగ్రనేత ట్రంప్‌ను కలవరపాటుకు గురిచేసింది. అవసరమైతే చైనా, రష్యాలను అడ్డుకొనేందుకు సిద్ధంగా ఉండాలని పెంటగాన్‌ను ఆయన ఆదేశించారు. అమెరికా సేనల్లో భారీ స్థాయిలో మార్పులు చేయాలని సూచించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఓ ఛానల్‌తో మాట్లాడుతూ తనకు ట్రంప్ నుంచి ఈ మేరకు ఆదేశాలు వచ్చినట్లు అంగీకరించారు. మిలిటరీలో భారీ పునర్వ్యవస్థీకరణను చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదేమీ యుద్ధం కోరుకుంటూ చేసేది కాదని వివరణ ఇచ్చారు. చైనా, రష్యా మరేదైనా దేశం విషయంలో తమ పాలసీ స్పష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం బీజింగ్‌లో విక్టరీ డే పెరేడ్ సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన తర్వాత ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. చైనా, ఉత్తర కొరియా, రష్యా దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నాయన్నారు. కానీ, అవి ఎటువంటివో మాత్రం ఆయన వెల్లడించలేదు. చైనాను విదేశీ పాలకుల నుంచి విడిపించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఆ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ గుర్తిస్తారా, లేదా అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ పేర్కొన్నారు.

## ట్రంప్‌తో అలాస్కా చర్చలనే మోడీకి వివరించా..

### కారులో గుసగుసలపై స్పందించిన పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 4:** షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే కారులో ప్రయాణిస్తూ మాట్లాడుకున్న విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ ఏకాంత భేటీలో వారిద్దరూ ఏం చర్చించుకున్నారనే దానిపై నెలకొన్న ఉత్కంఠకు పుతిన్ తాజాగా తెరదించారు. ఆ సంభాషణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావన వచ్చినట్లు ఆయన వెల్లడించారు. చైనా పర్యటన ముగించుకున్న అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి, మోడీతో కారులో జరిగిన సంభాషణ గురించి ప్రశ్నించగా, అందులో దాచిపెట్టాల్సిన రహస్యమేమీ లేదు. అలాస్కాలో డొనాల్డ్ ట్రంప్‌తో నాకు జరిగిన చర్చల గురించి ప్రధాని మోదీకి వివరించానని పుతిన్ స్పష్టం చేశారు. ఇటీవల ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశంపై పుతిన్, ట్రంప్ అలాస్కాలో సమావేశమయ్యారు. ఆ భేటీ వివరాలను కూడా పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ కేవలం 30సెకన్ల పాటు బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగిందని తెలిపారు. 'ట్రంప్‌ను ఆరోగ్యంగా చూసినందుకు సంతోషంగా ఉందని ఆయనతో చెప్పానని పుతిన్ పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా పుతిన్ తన కాన్వాయ్‌తో వచ్చి, మోదీ కోసం దాదాపు పది నిమిషాలు వేచి చూశారు. అనంతరం మోదీని తన కారులోనే సదస్సు ప్రాంగణానికి తీసుకెళ్లారు. దాదాపు 45 నిమిషాల పాటు ఇరువురు నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ వర్గాలు అప్పట్లో తెలిపాయి. ఈ ప్రయాణం తర్వాత మోడీకూడా వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో చర్చలు ఎప్పటిలాగే అద్భుతంగా సాగాయని పేర్కొన్నారు. అమెరికా సుంకాల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం.

## సంక్షిప్తంగా..

### జిఎస్టీ తగ్గించేందుకు ఎనిమిదేళ్లు పట్టిందా?: చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కేంద్ర ప్రభుత్వం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఎనిమిదేళ్లు ఎందుకు పట్టిందంటూ ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది ఎనిమిదేళ్ల ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్‌మీడియా వేదికగా చిదంబరం స్పందిస్తూ ప్రస్తుత జీఎస్టీ విధానాన్ని, ఇప్పటిదాకా ఉన్న రేట్లను మొదట్లోనే ప్రవేశపెట్టి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. 2017లో జీఎస్టీని తీసుకొచ్చినప్పటి నుంచి తాము దీని డిజైన్, రేట్లపై హెచ్చరిస్తున్నా ప్రభుత్వం తమ మాటలను పెడచెవిన పెట్టిందని ఆయన ఆరోపించారు. ఇంతకాలం తర్వాత ప్రభుత్వం హఠాత్తుగా ఈ మార్పులు చేయడానికి గల కారణాలపై ఆయన పలు అనుమానాలు వ్యక్తంచేశారు. మందగించిన ఆర్థికవృద్ధి, పెరుగుతున్న కుటుంబ అప్పులు, పడిపోతున్న పొదుపు, త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికలు లేదా అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి, వీటన్నింటిలో ఏదో ఒక కారణం ఉండి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

### ప్రారంభించిన వెంటనే సముద్రంలో మునిగిన పర్యాటక నౌక



**అంకారా, సెప్టెంబరు 4:** తుర్కియేలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.కొత్తగా నిర్మించి ప్రారంభించిన నిమిషాల్లోనే ఓ లగ్జరీ నౌక సముద్రంలో మునిగిపోయింది. ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన జోంగుల్డక్ తీరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.దాదాపు పది లక్షల డాలర్లతో ఈ లగ్జరీ నౌకను నిర్మించారు. దీని ఖరీదు భారత కరెన్సీలో దాదాపు 8.74 కోట్లన్నమాట. 24 మీటర్ల పొడవున్న ఈ లగ్జరీ నౌకకు 'డోల్స్ వెంటో' అని పేరు పెట్టారు. తుర్కియేలోని మెడ్ యిల్మాజ్ షిప్‌యార్డ్‌లో ఈ నౌక్‌ను గ్రాండ్‌గా ప్రారంభించారు. కొంత మంది ప్రయాణికులు, సిబ్బందితో నౌక సముద్రంలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అయితే ప్రారంభమైన 15 నిమిషాలకే ఈ నౌక సముద్రంలో మునిగి పోయింది. ఊహించని ఈ ఘటనతో భయాందోళనకు గురైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే సముద్రంలోకి దూకేశారు. అనంతరం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. యజమాని, కెప్టెన్ కూడా సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.

## అమరత్వం,ఆయుష్షులపై జిన్‌పింగ్ పుతిన్‌ల ముచ్చట్లు

### అంతర్జాతీయ మీడియాలో వీరి చిట్‌చాట్ వైరల్



**బీజింగ్, సెప్టెంబరు 4:** ప్రపంచ రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతలుగా ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. మనిషి ఆయుష్షు, అమరత్వం వంటి అంశాలపై వారిద్దరూ మాట్లాడుకోవడం చర్చనీయాంశం అయింది. చైనా రాజధాని బీజింగ్‌లోని తియానన్మెన్ స్క్వేర్‌లో నిన్న జరిగిన సైనిక పరేడ్‌ను చూడటానికి వెళుతున్న సమయంలో ఈ ఇద్దరు నేతల మధ్య ఈ మాటామంతీ నడిచింది. ఈ సంభాషణలో పుతిన్ మాట్లాడుతూ, బయోటెక్నాలజీ అభివృద్ధి వల్ల అవయవ మార్పిడులు సర్వసాధారణ మవుతాయని, దాని ద్వారా యవ్వనంగా ఉంటూ అమరత్వం సాధించవచ్చని వ్యాఖ్యానించారు. దీనికి జిన్‌పింగ్ స్పందిస్తూ, ఈ శతాబ్దంలో మానవులు 150 ఏళ్ల వరకు జీవించగలరనే అంచనాలు ఉన్నాయని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సమయంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారిని చూసి నవ్వుతూ కనిపించినప్పటికీ, వారి సంభాషణలో పాలుపంచుకున్నారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఈ భారీ ఆయుధ ప్రదర్శనను నిర్వహించింది. దాదాపు 50 వేల మంది సందర్శకుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచానికి యుద్ధం కావాలో, శాంతికావాలో తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి ముందు జరిగిన షాంఘై సహకార సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు 20 దేశాల అధినేతలు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, జిన్‌పింగ్ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతంచేసే దిశగా 20 ఒప్పందాలపై సంతకాలు చేశారు. కృత్రిమ మేధ, గ్యాస్ పైప్‌లైన్ సహా పలు రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు.

## ఎనిమిదేళ్లకు మోడీ ప్రభుత్వానికి జ్ఞానోదయం

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జీఎస్టీ సంస్కరణల విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జ్ఞానోదయం కలిగిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లకు కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణ నిద్ర వీడి మేల్కొనడం మంచి విషయమేనంటూ ఆయన గురువారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జీఎస్టీ కౌన్సిల్ ఇటీవల పన్ను స్లాబులలో కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గత దశాబ్ద కాలంగా జీఎస్టీని సరళీకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని ఖర్గే గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే పన్ను అనే నినాదాన్ని ఒకే దేశం, 9 పన్నులుగా మార్చేసిందన్నారు. సరళమైన పన్నుల విధానంతో జీఎస్టీ 2.0ను తాము 2019, 2024 మేనిఫెస్టోల లోనే ప్రతిపాదించామని తెలిపారు. ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోడీనే జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారని ఖర్గే ఆరోపించారు. 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్‌ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ అడ్డుపడింది. కానీ ఇవాళ అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగాయని సంబరాలు చేసుకుంటోంది. సామాన్యుల నుంచి పన్నులు వసూలు చేయడం గొప్ప ఘనత అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. వసూలవుతున్న మొత్తం జీఎస్టీలో 64 శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుంచే వస్తోందని, కేవలం 3 శాతం మాత్రమే కుబేరుల నుంచి వస్తోందని ఆయన ఆరోపించారు. తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశం ఉన్నందున, 2024-25ను ఆధార సంవత్స రంగా తీసుకుని ఐదేళ్లపాటు పూర్తి పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే, సంక్లిష్టమైన జీఎస్టీ నిబంధనలను తొలగిస్తేనే ఎంఎస్‌ఎంఇరంగానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### టారిఫ్ వార్ నిలిపివేయకపోతే భారీ మూల్యం తప్పదు

#### అమెరికాకు శశిథరూర్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌తో అనుసరిస్తున్న సుంకాల యుద్ధాన్ని అమెరికా తక్షణమే విరమించుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హెచ్చరించారు. ఒకప్పుడు చైనాను ఎవరు కోల్పోయారు అని వాషింగ్టన్‌లో చర్చ జరిగినట్టు, భవిష్యత్తులో భారత్‌ను ఎవరు కోల్పోయారని బాధపడే పరిస్థితిని తెచ్చుకోవద్దని అని ఆయన అమెరికాకు హితవు పలికారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలు ఇరు దేశాలకే కాక, ప్రపంచానికి కూడా మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఆంగ్ల పత్రికలో రాసినవ్యాసంలో శశిథరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ నుంచి దిగుమతులపై అమెరికా 50శాతం వరకు సుంకాలు విధించడం,ముఖ్యంగా రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకం వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

## నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులు చేస్తున్న పాక్



**కరాచి, సెప్టెంబరు 4:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో దెబ్బతిన్న కీలకమైన నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌కు మరమ్మతులుచేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న అన్ని ఎయిర్‌బేస్‌లను పాక్ ఇప్పుడు పునర్నిర్మిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం జరిపిన దాడుల్లో ధ్వంసమైన నూర్‌ఖాన్ ఎయిర్ బేస్ పునర్నిర్మాణ పనులు చేపడుతోంది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్స్ ఉన్న రావల్పిండిలో ఈ ఎయిర్‌బేస్ ఉంది. అంతేకాదు దేశ రాజధాని ఇస్లామాబాద్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అందుకే ఈ ఎయిర్‌బేస్ రాజకీయంగా, సైనిక పరంగా ఎంతో సున్నితమైందిగా చెప్తారు. అన్ని ఎయిర్‌ఫోర్స్ ఆపరేషన్లకు ఈ వైమానిక స్థావరమే అడ్డా.

## భారత్, చైనాలపై యుఎస్ స్వరం సరికాదు

### రష్యా అధినేత పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 4:** భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్-అమెరికాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలపై అమెరికా చర్యలు సరైనవి కావన్నారు. ఎస్ఇఒ సదస్సు, మిలిటరీ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆయన చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రంప్ పరిపాలన ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులనూ అణగదొక్కేందుకు ఆర్థిక ఒత్తిడిని ఒక సాధనంగా ఉపయోగిస్తుందని ఆరోపించారు. భారత్-చైనాలు భాగస్వాములని పేర్కొంటూ వీరి ద్వైపాక్షికాన్ని ట్రంప్ బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారు. '1.5 బిలియన్ల మంది జనాభా కలిగిన భారత్, చైనాలు శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థలు. ఆయా దేశాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థలు, దేశీయ చట్టాలు ఉన్నాయి. టారిఫ్‌లతో వారిని శిక్షించే ప్రయత్నాలు చేస్తే అవి ఆ దేశ నాయకులను క్లిష్టతరంలోకి నెట్టేస్తాయి. ఈ క్రమంలో వారిలో ఎవరైనా బలహీనపడితే.. అతని రాజకీయ జీవితం ముగిసిపోతుంది. ఇరు దేశాల చరిత్రలో వలసవాదం వంటి కష్టతరమైన కాలం నడిచింది. వారి సార్వభౌమాధికారంపై చాలాకాలం పాటు పన్ను విధించారు. ఇప్పుడు వాటన్నింటికీ కాలం చెల్లింది. ఇంకా వాటిని అణగదొక్కేలా మాట్లాడటం సరైనది కాదు. భాగస్వాములతో మాట్లాడేప్పుడు సరైన పదాలు ఉపయోగించాలి' అని పుతిన్ పేర్కొన్నారు. కాగా ఈ ఉద్రిక్తతలు త్వరలో ముగుస్తాయన్నారు. మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ క్రమంలో అమెరికాలోని కొందరు నాయకులు భారత్‌పై నోరు పారేసుకుంటున్నారు.దీంతో ఇరు దేశాల మధ్యసంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే, భారత్‌పై విధించింది సెకండరీ సుంకాల మాత్రమేనని ట్రంప్ అన్నారు. ఆ దేశంపై రెండు,మూడు విడతలు ఉన్నా యన్నారు.ఈ క్రమంలోభారత్‌తో కలిసే ఉన్నా మంటూనే ఆదేశం ప్రపంచంలోనే అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందని ఆరోపించారు.

## లారీని ఢీకొన్న కారు: ఐదుగురు వ్యాపారులు మృతి



**పాట్నా, సెప్టెంబరు 4:** వేగంగా వెళ్తున్న కారు లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. అందులో ప్రయాణించిన ఐదుగురు వ్యాపారులు ఈ ప్రమాదంలో మరణించారు.ఈసంఘటన బీహార్‌లో జరిగింది. రాజధాని పాట్నాతో పాటు పరిసర జిల్లాల్లో పురుగుమందులు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్న వీరు బిజినెస్ పని కోసం ఫతుహాకు కారులోవెళ్లారు. బుధవారం అర్థరాత్రి దాటిన తర్వాత పాట్నాకు తిరిగి వస్తున్నారు. పర్సా బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుయా మోర్ సమీపంలో జాతీయ రహదారి నంబర్ 83పై వేగంగా వెళ్తున్న ఆ కారు లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం లారీ కిందకు చొచ్చుకెళ్లి ఇరుక్కు పోయింది. పెద్ద శబ్దం విన్న స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. గ్యాస్ కట్టర్లు, క్రేన్ సహాయంతో రెండు గంటలు శ్రమించిన తర్వాత మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు.

# రాష్ట్రంలో సాఫీగా యూరియా సరఫరా

## వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సాఫీగా యూరియా సరఫరా సాగుతుందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్థక , మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు ప్రకటించారు."ఎక్స్" వేదికగా ఆయన చేసిన పోస్టులో ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని, ఎక్కడ నిరసనలు లేవని , వాటిని అణిచివేసే ధోరణి ఉత్పన్నం కాదని కూటమి ప్రభుత్వం అణిచివేత పనులు చేయదని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు .యూరియా సరఫరా లో గత ప్రభుత్వం కన్నా 48,478 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు పంపిణీ చేశామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవమని తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు.. గత ప్రభుత్వం లో మార్క్ ఫెడ్ ద్వారా సొసైటీలకు ఎరువుల సరఫరా నిర్వీర్యం చేస్తే... కూటమి ప్రభుత్వం మార్క్ ఫెడ్ ను గాడిలో పెట్టి సొసైటీలకు అధిక మొత్తంలో యూరియా సరఫరా చేసాం.యూరియా సరఫరా, పంపిణీ పూర్తి పారదర్శకంగా అమలు చేస్తూ, గతానికి భిన్నంగా మార్క్ ఫెడ్ పనిచేస్తుందన్నారు.ప్రైవేట్ పంపిణీ నిష్పత్తి ని 50 : 50 నుండి 70:30 పెంచాం. మార్క్ ఫెడ్ ద్వారా (ఆర్ ఎస్ కే, పీఏసీఎస్) 20 ఎక్కువగా యూరియాను పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు.2021- 22 నుండి 23 - 24 వరకు గత ప్రభుత్వం మూడు సంవత్సరాల సరాసరి యూరియా సరఫరా కేవలం 1,55,617 మెట్రిక్ టన్నులు కాగా ఈ ఒక్క సంవత్సరం (2025 26) లో ఆగస్టు చివరి నాటికి 2,04,096 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసామన్నారు.గతంతో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా సరఫరా 31 శాతం గతం కంటే ఎక్కువ..విజిలెన్స్, రెవెన్యూ అధికారుల నిరంతర నిఘా, క్రమం తప్పని తనికీలు ద్వారా అందుబాటు ధరలోనే మార్కెట్ లో యూరియా ఉందన్నారు.. ఎటువంటి బ్లాక్ మార్కెట్ లేదని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.క్రమశిక్షణతో వరుసగా లైన్ లో సాగుతూ ఎరువులను తీసుకుంటున్న రైతులను మెచ్చుకుంటూ వాడుక భాషలో బఫె మాదిరిగా అన్న పదానికి వైసీపీ నేతలు వక్రభాష్యం పలకటం వారి చౌక బారుతనానికి నిదర్శనం..ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపిస్తూ ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరపడం ద్వారా మన రాష్ట్రానికి క్లిష్టమైన పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల కంటే అధిక మొత్తంలో యూరియాను కేంద్రం కేటాయించిందన్నారు.

.ఇదే సమయానికి గత సంవత్సరాల కన్నా 87,880 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ పంటలకు రాష్ట్ర రైతాంగం వినియోగించిందన్నారు,.నల్లబర్లీ పొగాకు ,కోకో ,తోతాపురి మామిడి ,ఉల్లి ధరల విషయంలో ఆ పంటలకు మద్దతు ధర లేకపోయినా సీఎం చంద్రబాబు చొరవతో వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిన విషయాన్ని గోవర్ధన్ రెడ్డి మంత్రి అచ్చెన్నాయుడు గుర్తించాలన్నారు.



రైల్వే జిఎంకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ

# దుర్గమ్మ ఆలయంలో తిరుమల తరహాలో భక్తులకు సేవలు

## - మంత్రి ఆనం రామనారాయణ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త దుర్గమ్మ ఆలయంలో ఈ ఏడాది జరగబోయే దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన దసరా ఉత్సవాల ఏర్పాట్లపై జమ్మిదొడ్డి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగే దసరా ఉత్సవాల్లో తిరుమల తరహాలో భక్తుల రద్దీ నియంత్రణ, సేవలందించాలన్నారు. మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి శ్రీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూం ద్వారా భక్తులకు సేవలందించడానికి ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఉత్సవాల్లో ఎప్పటికప్పుడు సరైన సమాచారం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నందున మహిళా భక్తులు పెరుగుతారని అంచనా వేస్తున్నామని ఆమేరకు వారికి ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలో రెవెన్యూ, దేవదాయ, హోం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ముందుకెళతామన్నారు ఈనెల 15లోగా అన్ని పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో అన్ని అనుమతులు త్వరితంగా ఇస్తున్నట్లు కమీషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. భక్తుల సంఖ్య పెరిగే అవకావం వుండడంతో వెస్ట్ బైపాస్ వినియోగించుకుని ట్రాఫిక్ ఇబ్బంది అధిగమిస్తామన్నారు. ఈ సమీక్షలో విజయవాడ సిపి రాజశేఖర్ బాబు, దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, ఇఓ వికె శీనా నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు.4,57,31,258ల నగదుతో పాటు 400 గ్రాముల బంగారం, 7కెజిల 650 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ 524 యుఎస్ఎ డాలర్లు, 70 ఇంగ్లాండ్‌పౌండ్లు, 52 సింగపూర్ డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 590 యుఎఇ దిర్హమ్స్, 300 ఒమన్ బైసాలు, 73 ఖతార్ రియాల్స్, 210 మలేషియా రింగట్స్, 115యురోలు, 6.1/3 కువైట్ దినార్లు, 10 న్యూజిలాండ్ కరెన్సీ, 100 హాంకాంగ్ డాలర్స్,

270 కెనడా డాలర్లు లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీ దుర్గమ్మవారి భక్తులు, ఎస్‌పిఎఫ్, ఒన్‌టౌన్ పోలీస్, ఆలయ సిబ్బంది, దేవదాయ ఎశాఖ అదికారులు, సిబ్బంది పాల్గొనగా ఇఓ పర్యవేక్షించారు.

దుర్గమ్మవారిని దక్షిణమధ్య రైల్వే నూతన జిఎం సందీప్ మాధుర్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# టోక్యో అంతర్జాతీయ గిఫ్ట్ షోలో ఆంధ్ర హ్యాండ్లూమ్స్

**విజయవాడ సెప్టెంబర్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మార్గదర్శకత్వంలో రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (ఆప్కో ) జపాన్‌లోని అతిపెద్ద లైఫ్‌స్టైల్, గిఫ్ట్ ప్రదర్శన అయిన టోక్యో ఇంటర్నేషనల్ గిఫ్ట్ షోలో రాష్ట్ర చేనేత అద్భుత వారసత్వాన్ని ఆవిష్కరిస్తోంది. సెప్టెంబర్ 5 వ తేదీ వరకు ఈ ప్రదర్శన జరగనుంది. ఈ ప్రదర్శనలో ఆప్కో ప్రత్యేకంగా మహిళల దుస్తులు (టాప్స్, డ్రెస్సులు, జాకెట్లు, స్విమ్‌గౌన్లు - పులగుర్త, ఇస్కపల్లి, పొందూరు), పురుషుల షర్టింగ్ మరియు వస్త్రాలు (ప్లెయిడ్స్, గింగం - ఎథముక్కల, యెమ్మిగన్నూరు, అంపోలు, ఇస్కపల్లి), గృహోపకరణాలు (కుషన్స్, కర్టెన్స్ - ఇస్కపల్లి), వంటింటి వస్త్రాలు (బ్లాక్ ప్రింటెడ్, ఎంబ్రాయిడరీ టేబుల్‌క్లోత్‌లు, రన్నర్లు, ప్లేస్‌మ్యాట్స్ - ఇస్కపల్లి, అంపోలు) ప్రదర్శిస్తోంది. సాంప్రదాయ వీవర్లను శక్తివంతం చేసి, వారికి గ్లోబల్ మార్కెట్లతో అనుసంధానం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది. ఈ అంతర్జాతీయ వేదికలో ఆంధ్రప్రదేశ్ చేనేతలను ప్రదర్శించడంలో చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, కమిషనర్ రేఖా రాణి కీలకపాత్ర పోషించారు.

# చేనేత ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్‌తో కూడిన వీవర్ కార్డు

## - చేనేత మంత్రి సవిత



**విజయవాడ.సెప్టెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అన్ని ప్రాంతాల నుంచి విభిన్న రకాల చేనేత వస్త్రాలను నగర ప్రజలకు అందుబాటులో ఉండేలా చేనేత మరియు హస్తకళల ప్రదర్శనలో ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ ల మంత్రి ఎస్. సవిత తెలిపారు. నగరంలో శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో ఏర్పాటు చేసిన "గాంధీ బునకర్ మేళా" (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) ను గురువారం మంత్రి ఎస్. సవిత, ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో చేనేతకు మహర్దశ ప్రారంభమైందన్నారు. నేతన్నల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలోనూ, జాతీయ స్థాయిలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నేతన్నలను ఆదుకునేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి నెలా చేనేత, హస్తకళల అభివృద్ధికి ఎగ్జిబిషన్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా తయారీదారులే ప్రత్యక్షంగా చేనేత ఉత్పత్తులను అమ్ముకునే విధంగా ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు తక్కువ ధరలకే చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్.టీ రామారావు దగ్గర నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు చేనేతకు ఆదరణ కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం నేతన్నలకు నెలకు రూ. 4,000 పెన్షన్ ను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా 90 శాతం సబ్సిడీతో ఉపకరణాలు అందించటంతోపాటు లేటెస్ట్ డిజైన్స్ కు సంబంధించి శిక్షణ కూడా అందిస్తున్నామన్నారు. ఆప్కో ద్వారా పలు డిజైన్స్ ను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రజల్లో కూడా చేనేత వస్త్రాలు ధరించేలా అవగాహనకు వస్తున్నారన్నారు. నేతన్నలను ఆదరించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రతి వారం చేనేతను ధరిస్తున్నారన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి

## కేంద్ర మంత్రి కుమారస్వామితో రామచంద్రయాదవ్ భేటీ



**ప్రభాతవార్త ప్రతినిధి పుంగనూరు, సెప్టెంబర్ 4** విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికుల తరుపున బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పోరాటానికి సన్నద్ధమయ్యారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపేందుకు తొలి అడుగు వేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర ఉక్కుశాఖా మంత్రి కుమారస్వామితో గురువారం భేటీ అయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారాన్ని ఆయన కుమారస్వామి దృష్టికి తీసుకువచ్చారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికుల మనోవేదనను వినతిపత్రం రూపంలో కుమారస్వామికి అందజేశారు. రామచంద్రయాదవ్ చేసిన విజ్ఞప్తికి మంత్రి కుమారస్వామి సానుకూలత వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ వద్ద జరుగుతున్న తాజా పరిణామాలతో పాటు ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై వివరాలు కావాలని ఆయన వెంటనే అధికారులను ఆదేశించారు. కాగా,ఇటీవల రామచంద్రయాదవ్ విశాఖ పర్యటనలో భాగంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు భేటీ అయ్యారు. తమ సమస్యను రామచంద్రయాదవ్ కు వివరించారు. తీసుకువచ్చారు. దీంతో అప్పుడే రామచంద్రయాదవ్ ఉద్యోగ సంఘ నాయకులకు మాట ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా బిసివై పార్టీ పోరాటం చేస్తుందని ప్రకటించారు. అందులో భాగంగా ఆయన గురువారం కేంద్ర మంత్రి కుమారస్వామితో భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపాలను విజ్ఞప్తి చేశారు. రామచంద్రయాదవ్ తీసుకుంటున్న చొరవ పట్ల స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చెవిరెడ్డి ఇంట్లో కొనసాగిన సిట్ అధికారుల సోదాలు

## - ఆరు కంపెనీల రికార్డ్స్ స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు



మీడియాతో మాట్లాడుతున్న సిట్ అధికారి

**తిరుపతిరూరల్,సెప్టెంబర్04 ప్రభాతవార్త:** లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొని, రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట్లో సిట్ అధికారుల బృందం సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సిట్ అధికారుల బృందం దాదాపు 20మంది తుమ్మలగుంటలో ఉన్న చెవిరెడ్డి ఇంట్లో సోదాలు చేస్తున్నారు. మధ్యాహ్నం వరకు చెవిరెడ్డి కుటుంబ సభ్యులు, తనయులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలను మౌఖికంగా ప్రశించినట్లు సమాచారం. అనంతరం రికార్ట్స్ పరిశీలించి, వ్యాపార లావాదేవీలకు సంబందించి రికార్ట్స్ పరిశీలించి, కొన్ని రికార్డ్సును స్వాధినం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిన్న చెవిరెడ్డి కంపెనీలలో సోదాలు నిర్వహించి, తుమ్మలగుంటలో కూడా సోదాలు నిర్వహించటానికి రాగా కుటుంబ సభ్యులు ఇంట్లో లేనందున సిట్ అధికారులు వెనుతిరిగిన విషయం తెల్సిందే. మద్యం కుంభకోణం కేసులో 38వ ముద్దాయిగా 79రోజులుగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెల్సిందే. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చెందిన ఆరు రకాల కంపెనీలకు సంబంధించిన రికార్డ్సును స్వాధీనం చేసుకుని సిట్ కార్యాలయానికి పంపుతామని సిట్ అధికారి తెలిపారు. తిరిగి ఎప్పుడు విచారణ చేస్తామనేది ఇంకా తెలియరాలేదన్నారు.

సిట్ అధికారులకు సహకరించాం : తుడ మాజీ చైర్మెన్ మోహిత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎంతో కష్టపడి ఒకస్థాయికి వచ్చాడని, మీడియాలో లేనివి ఉన్నట్లుగా చూపించడం బాధాకరమని తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాపోయారు. సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చామని, కొన్ని రికార్ట్స్ సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

# గుత్తి, తాడిపత్రి స్టేషన్లలో ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ కల్పిస్తూ ఆమోదం

**అనంతపురం, సెప్టెంబర్ 4, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం పార్లమెంట్ పరిధిలో గుత్తి , తాడిపత్రి ప్రాంత ప్రజల విజ్ఞప్తుల మేరకు అనంతపురం పార్లమెంట్ సభ్యులు శ్రీ అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా కృషి చేయగా, రైల్వే బోర్డు స్పందించి పలు ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ కల్పిస్తూ ఆమోదం తెలిపింది.ఈ నిర్ణయం అనంతపురం పార్లమెంట్ పరిధి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. రాబోయే రోజుల్లో రైళ్లు గుత్తి , తాడిపత్రి స్టేషన్లలో ఆగనుండటం ద్వారా ప్రయాణికులకు సౌకర్యం కలగనుంది.గుత్తి రైల్వే స్టేషన్లో నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 16351) ఉదయం పూట 10.54 గంటలకు, ముంబై నుంచి నాగర్ కోయిల్ వెళ్ళు ఎక్స్‌ప్రెస్ ( ట్రైన్ నెంబర్ 16352) తెల్లవారుజామున 2. 14 గంటలకు గుత్తి స్టేషన్ లో ఇకనుంచి నిలబడుతుంది అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అదేవిధంగా తాడిపత్రి రైల్వే స్టేషన్లో ముంబై సి ఎస్ ఎం టి నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్ (16352) హాల్ట్ కల్పించిన రైళ్లు: తెల్లవారుజామున 1.29 గంటలకు తాడపత్రి రైల్వే స్టేషన్లో ఇకనుంచి నిలబడుతుంది అని ఎంపీ తెలిపారు. ఉంటుంది. తిరుపతి నుంచి ఔరంగాబాద్ వెళ్లే వారాంతపు ఎక్స్‌ప్రెస్ ( ట్రైన్ నెంబర్ 17622) 2.09 గంటలకు ఇకనుంచి తాడపత్రి లో నిలబడుతుంది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి ఆమదాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్) ట్రైన్ నెంబర్ (20953) ఉదయం పూట 4.39 గంటలకు తరపతి టు నిలబడుతుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.అదేవిధంగా, అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఎంపీ అంబికా గారు చేసిన మరిన్ని విజ్ఞప్తులు కూడా రైల్వే బోర్డు పరిశీలనలో ఉన్నాయి. వాటికి కూడా త్వరలో అనుకూలమైన నిర్ణయాలు వస్తాయని ఆశిస్తున్నాము. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "ప్రజల అవసరాలు నెరవేర్చడం నా ధ్యేయం. రైల్వే హాల్ట్‌ల ద్వారా గుత్తి, తాడిపత్రి ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. మిగతా విజ్ఞప్తులపై కూడా త్వరలో శుభవార్త రాబోతుంది" అని పేర్కొన్నారు. అనంతపురం, రాయల చెరువు పలు రైల్వే స్టేషన్లలో రైళ్ల హాల్ట్ కి సంబందించిన ప్రతిపాదనలు అందించగా, రైల్వే శాఖ ఆమోదానికి సిద్ధంగా ఉంది ఆయన వెల్లడించారు..

# పారదర్శకతతో రెవెన్యూ పాలనలో తహసీల్దారుల పాత్ర

## - ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు




**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** నెల్లూరు బారాషాహీద్ దర్గా ఎదురుగా ఉన్న నెల్లూరు క్లబ్ సమావేశ మందిరంలో జిల్లాలోని ముఖ్యమైన తాసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ పాల్గున్నారు ఈ కార్యక్రమంలో, తాసిల్దార్లు ఎదుర్కొంటున్న, పలు సమస్యలను రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకొని రాగా రాష్ట్ర అధ్యక్షులు రెవెన్యూ శాఖలో జవాబుతారీ వేగమంతపైన మరియు పారదర్శకతతో కూడిన రెవెన్యూ పాలన గురించి సుదీర్ఘం గా వివరించడం జరిగింది. రెవెన్యూ శాఖలో కీలకమైన తహసిల్దార్లు ప్రజల హక్కుల పరిరక్షణకు, భూసంబంధిత రికార్డుల నిష్పక్షపాత నిర్వహణకు, పారదర్శకతతో, సేవా నిబద్ధతతో, అంకిత భావంతో ప్రజలకు సేవలందించేందుకు, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, విధుల పట్ల నిజాయితీతో, నిష్ఠతో పని చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి మద్దతు గా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని అందరు తహసిల్దారులతో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ నెల్లూరు నగరంలోని నెల్లూరు క్లబ్‌లోని సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జవాబుదారీ, వేగవంతమైన మరియు పారదర్శకత తో కూడిన రెవెన్యూ పాలనలో తహసీల్దారుల పాత్ర" పై పూర్తి స్థాయి లో చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా ప్రెసిడెంట్ అల్లం పాటి పెంచల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డేనియల్ పీటర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మురళితో పాటు పలువురు తాసిల్దార్లు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను పరిష్కరించండి

## కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా శీతారామన్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పిం చారు. వ్యవసాయ యంత్రాలు, పరిక రాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై విధిస్తున్న 12 జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న ఈ జీఎస్టీ వల్ల ముఖ్యంగా చిన్న, సన్న రైతులు ఆధునిక పరికరాలను కొనుగోలు చేయలేకపోతు న్నారన్నారు. అలాగే ఇటీవల క్రూడ్ పామ్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 27.5 నుంచి 16.5 కి తగ్గించడం రైతులకు తీవ్ర సమస్యగా మారిందని చెప్పారు. దీని వల్ల దేశీయ ధరలు క్షీణించి రైతులకు చెల్లించే ఎఫ్‌ఎఫ్‌బిఎస్ ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు. 2018లో ఉన్నట్లుగా 44 దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఇక ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండడంతో పాటు, హ్యాండ్లూమ్ ఉత్పత్తులపై 5 జీఎస్టీ విధించడం నేతన్నల ఉత్పత్తులు మార్కెట్లో పోటీ తట్టుకోలేని పరిస్థితిని తెచ్చిందని పేర్కొన్నారు.

# మద్యం సేవించి పాఠశాలకు ఉపాధ్యాయుడు!

## సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు హాజరయ్యాడు. పది మందికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపా ధ్యాయుడు తప్పటడుగులు వేయడం తో అధికారులు సస్పెండ్ చేసి చర్యలు తీసుకు న్నారు. ఆసిఫాబాద్ జిల్లా లోని జైనూరు మండల పరిధిలోని సుకుతు పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. ఇదే పాఠ శాలలో జే విలాస్ అనే వ్యక్తి ఉపాధ్యా యుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత కొంతకాలంగా ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు హాజరవు తున్నాడు.

# గణనాథునికి వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం



**కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం జరిగిన తిరుకళ్యాణం, అశ్వవాహనసేవ సందర్భంగా ఉభయదారులైన వేర్వేరు వంశస్థులచే వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తిరుకళ్యాణం ఉభయదారులైన కాణిపాకం, తిరువణంపల్లె వణిగవంశస్థులు, అశ వ్వాహనసేవ ఉభయదారులైన బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాధుల గోనుగుంట బలిజ వంశస్థులు వేర్వేరుగా స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. వీరు స్థానిక మణికంఠేశ్వరాలయం నుండి మంగళవాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అష్టోత్తర శత కలశాలను గ్రామపురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకస్వాములు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన అష్టోత్తర శత కలశాలలోని పాలతో అభిషేకించారు. అలాగే పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా వేదపండితులు మంత్రపుష్పం గావించారు. అనంతరం భక్తులు స్వామివారి తీర్థ,ప్రసాదాలను అందజేశారు.దీనితో ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అనంతరం భక్తులు స్వామివారి తీర్థ,ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ముగ్గురు పిల్లలను హతమార్చి తండ్రి ఆత్మహత్య!



**కల్వకుర్తి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** కన్నబిడ్డలను కంటికిరెప్పలా చూసుకోవాల్సిన ఆ తండ్రి.. ఆ చిన్నారులను పెట్రోల్ పోసి అతికిరాతకంగా కాల్చి చంపాడు. ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా ఎర్రగుంట పాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు(35)కు, భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యతో గొడవపడిన గుత్తా వెంకటేశ్వర్లు కాలయముడిగా మారాడు. వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపం లోని చెరువు వద్ద వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకోవడం తో ఈ నెల 2న వెల్దండ ఎస్సై కురుమూర్తి సంఘటన స్థలాన్నికి చేరుకొని గుర్తుతెలియని శవంగా భావించి పంచా నామా నిర్వహించిన అనం తరం గుత్తా వెంకటేశ్వ ర్లుగా గుర్తించారు. ఈ క్రమంలో హాజీపూర్ నుంచి పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి అచ్చంపేట, ఉప్పు నుంతల, వెల్దండ పోలీసులు బృందాలుగా ఏర్పడి పిల్లల కోసం వెతికారు. అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిన తన ముగ్గురు పిల్లలను కుటుంబ సమ స్యల కారణంగా గత నెల 3న వారితో దోర్నాల మీదుగా డిండికి బైక్‌పై వచ్చి వర్షిణి(6), శివధర్మ(4) లను అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలం సూర్య తండా సమీపం లోని గుంటల ప్రాంతంలో తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మరో కుమార్తె మోక్షిత(8)ను కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ శివారులో పెట్రోల్ పోసి హతమార్చాడు.

5-9P g7exHMNWJQE 11_5-9P g7exHMNWJQE.qxd 9/5/2025 12:25 AM Page 1



# వరద నష్ట నివేదికలు జాగ్రత్తగా సిద్ధం చేయండి

## నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం విధానాలకు అనుగుణంగా వరద నష్ట నివేదిక తయారించాలని ఏ మాత్రం పొరపాటు జరిగినా విపత్తు సహాయం బాధితులకు అందకుండా పోతుందని అధికారులను నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో క్షేత్రస్థాయిలో, జిల్లా సమీక్షా సమావేశంలో సీతక్క మాట్లాడుతూ ప్రజల కష్టాలలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి శుక్రవారం కామారెడ్డిలో పర్యటిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ తక్కువ సమయంలో భారీ వర్షం కురవడం వల్ల ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చాయని, ప్రభుత్వం అలర్ట్ చేసిన వెంటనే అధికారులు, నాయకులు కలిసికట్టుగా పని. చేయడం వల్ల 300 పైగా ప్రజల ప్రాణాలు కాపాడగలిగామని అన్నారు. హైవే దెబ్బ తినడం వల్ల ఇబ్బందులు పడిన ఇతర రాష్ట్రాల ప్రజలకు కూడా ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించడం జరిగిందని అన్నారు .పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, వరదల సమయంలో ముఖ్య మంత్రి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలను ఆదుకున్నామని అన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా గతంలో రాలేకపోయామని, పోచారం, నిజంసాగర్ ప్రాజెక్టు వరద ఉధృతి ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు చేపట్టామని అన్నారు.జహీరాబాద్ ఎంపి సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ, వరదల వల్ల కామారెడ్డి జిల్లాలో తీవ్ర నష్టం జరిగిందని, ముఖ్యమంత్రి వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తం చేసి ప్రజల కష్టాల తొలగించేందుకు చర్యలు చేపట్టారని, దీని కోసం కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, వరదల సమయంలో అధికారులు బాగా పనిచేసే ప్రజల ప్రాణాల సంరక్షి ంచుకున్నారని అన్నారు. కామారెడ్డి ప్రజలలో ఆత్మస్థైర్యం నింపేందుకు ముఖ్యమంత్రి పర్యటించడం చాలా సంతోషంగా ఉందని, ఇక్కడే సమస్యలను శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు బ్రిడ్జి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఉన్నతాధికారు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ కాళ్లు హరీశ్‌రావు మొక్కారనడం సరికాదు

## పద్మాదేవేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** కాళేశ్వరంపై శాసనసభలో బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ డొల్లతనాన్ని ఎండగట్టారని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ మాజీ సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి కాళ్లను హరీష్ రావు మొక్కారనడం బాధ కలిగించిందని, హరీష్ రావు గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కవిత రౌండ్‌టేబుల్ భేటీపెట్టినా పార్టీ నేతలకు సమాచారం ఇవ్వలేదని, రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కవిత ఉన్నారని మండిపడ్డారు. కెసిఆర్ కుమార్తెగా కవిత గౌరవాన్ని నిలుపుకోలేకపోయారని, కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారని పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శలు గుప్పించారు.



బిసి భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, చిత్రంలో రాజ్ కుమార్, నీల వెంకటేష్ తదితరులు

# ఫీజు బకాయలు 6వేల కోట్లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** వారం రోజుల్లో కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయలు 6వేల కోట్లు ఇవ్వకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుం దని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బిసి భవన్‌లో 14 బి.సి సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేలను ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి 14 బీసీ సంఘాలు ప్రతినిధుల సంతకాలతో లేఖ రాశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు, స్కీమును ప్రభుత్వం నిరక్ష ్యం చేయడం తగదన్నారు.ఫీజులు కట్టాలని విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 20 నెలల్లో రూ.20లు కూడా విడుదల చేయలేదని విమర్శించారు.ఏపీలో 1500 కోట్లు విడుదల చేశారు. మన రాష్ట్రంలో ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సమావేశంలో బిసి సంఘాల ప్రతినిధులు రాజ్‌కుమార్, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, రాజేందర్, మోడీ రాందేవ్, రేగుల మధుసూదన్ రావు, లింగయ్య యాదవ్, నిఖిల్ పటేల్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇటి నర్సింహ

# రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడే జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోవాలి

## ఎంపిలకు సిపిఐ నేత ఇటి నర్సింహ విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాజ్యాంగం, ప్రాథమిక హక్కులను సమర్థించే ప్రతిపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పార్లమెంట్ సభ్యులకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ విజ్ఞప్తి చేశారు. నిరంకుశ, నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి రాజ్యాంగం, న్యాయవ్యవస్థలో అనుభవం ఉన్న వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి పదవికి అన్ని విధాల అర్హుడని ఆయన చెప్పారు. గురువారం సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వ ర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని జరుగుతున్న పోరాటంలో నిజాయితీగా ఆయన తన బాధ్యతను నిర్వహి స్తారని, గతంలో ఆయన న్యాయ మూర్తిగా ఉన్న సందర్భంలో ప్రజాస్వామ్య దృక్పథం కలిగి రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడటం కోసం తీర్పులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో అత్యంత విశిష్టమైన, ప్రగతిశీల న్యాయనిపుణులలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒకరన్నారు. ఇటీవల జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభలలో పార్టీ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.టి.నర్సింహను హైదరాబాద్ జిల్లా సమితి గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించింది.

# వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 24వ ర్యాంక్

## ప్రభుత్వ మద్దతు, సిబ్బంది కృషి ప్రధాన కారణం

## ఉపకులపతి అల్దాస్ జానయ్య

**అత్తాపూర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల పనితీరుపై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వే నివేదిక ఎన్‌ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమవర్క్ -2025 గురువారం విడుదల అయ్యింది. ఈ జాబితాలో దేశంలోని అన్ని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు, సంస్థల జాబితాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 24వ ర్యాంక్ ను సాధించింది. 2015 లో పీజెటీఏయూ ఆరవ ర్యాంక్ సాధించగా, 2023లో ఆ ర్యాంక్ 37కు పడిపోయింది.ఇప్పుడు పనితీరు మెరుగుపరుచుకుని 24 ర్యాంకు సాధించిందని పీజెటీఏయూ ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. దక్షిణాదిలోని అన్ని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో 4వ స్థానంలో పీజెటీఏయూ నిలవడం గర్వకారణమని జానయ్య అన్నారు. 10 నెలల క్రితం తాను పీజెటీఏయూ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అనేక కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఈ యేడాది ర్యాంకు మెరుగుపడిందని ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రత్యేకంగా 4 ఆధునిక



ఉపకులపతి అల్దాస్ జానయ్య

పరిశోధన కేంద్రాలు ప్రారంభించానన్నారు. సహజ వనరుల పరిరక్షణ, యూరియా, ఇతర రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు, నీటి సమర్థ యాజమాన్యం వంటి ముఖ్యమైన అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఖిఖిరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే వినూత్న కార్యక్రమాన్ని అమలుచేసి సుమారు 1200 గ్రామాల్లో 1,20,000 మంది రైతులని శాస్త్ర వేత్తలు ప్రత్యక్షంగా కలిసి ఆ అంశాలపై అవగాహన కల్పించారని జానయ్య వివరించారు. అలాగే సుమారు 11వేల గ్రామాల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకి నాణ్యమైన 40 వేల విత్తన కిట్లను పంపిణీ చేశామని జానయ్య పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ( ఐసీఏఆర్), ముఖ్యమంత్రి రేవంత్ ఒడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు నిరంతర మార్గదర్శకత్వం, తోడ్పాటుతో ఈ ర్యాంకు సాధించగలిగామన్నారు. అదేవిధంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల కృషి, తోడ్పాటు ర్యాంకుల పెరుగుదలకు దోహదం చేసిందని జానయ్య అన్నారు. వారందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2026 లో 10వ ర్యాంకు, 2027లో 5వ ర్యాంకు సాధిస్తామని అల్దాస్ జానయ్య ధీమా వ్యక్తం చేశారు.

# జిఎస్‌టి తగ్గింపు.. సామాన్యులకు ఎంతో ఊరట

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** న్యూఢిల్లీలో జరిగిన 56వ వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) మండలి సమావేశంలో, దేశవ్యాప్తంగా సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జిఎస్‌టి స్లాబ్‌లను సులభతరం చేసి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగేలా జిఎస్‌టి ట్యాక్స్ తగ్గిస్తూ కౌన్సిల్ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. 12శాతం, 28శాతం పన్నుస్లాబ్‌లను పూర్తిగా రద్దు చేసిందని, 12శాతం స్లాబ్ రద్దు చేయడంతో, ఆ పరిధిలో ఉన్న అనేక నిత్యావసర వస్తువులు ఇప్పుడు 5శాతం స్లాబ్‌లలోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులపై జిఎస్‌టి శాతం జీరోకు తగ్గించబడిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో, జిఎస్‌టి రేట్ల తగ్గింపు ద్వారా సామాన్యులు, రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కల్పిస్తుందన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. మోడీ ప్రభుత్వం వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగల వేళ బహుమతిగా పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వస్తువులపై ట్యాక్స్ తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ స్వాగతిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని ఆత్మనిర్భర అభివృద్ధి

పరచిన భారత్‌గా తీర్చిదిద్దుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతమేదీ సాధించలేక, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు చేస్తుందన్నారు. మోడీ తల్లిని దూషించేలా చేసిన వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి జిఎస్‌టి తగ్గించినందుకు, పండుగ సమయంలో ఊరట ఇచ్చినందుకు బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పాలభిషేకం కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలోని భాగ్యనగరం గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరు రానున్నారు. మొజంజాహి మార్కెట్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానానికి అనుగుణంగా శోభాయాత్రలో పాల్గొని, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నారని తెలిపారు. భారతదేశం అమెరికా, రష్యా వంటి దేశాలపై ఆధారపడే దేశం కాదు. అమెరికా విధించే టారిఫ్ వల్ల ప్రపంచ దేశాలు భయపడుతున్నా, భారత్ మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియాను ముందుకు తీసుకుని జిఎస్‌టి రేట్లు తగ్గించిందన్నారు. తెలంగాణలో యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తుందని, మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అవసరమైన యూరియాను పంపిణీ చేస్తుందని, రాష్ట్రంలో బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోలేకపోతుందన్నారు.





సమావేశలో మాట్లాడుతున్న ప్రొ. జి.హరగోపాల్

# కాల్పుల విరమణతోపాటు మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

## ప్రజాస్వామికవాదుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణలో కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ ఇప్పటికే 7,500 మంది ప్రముఖులు, పౌరులతో సంతకాలను సేకరించామని పలువురు ప్రజాస్వామిక వాదులు తెలిపారు. ఇంకా సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామన్నారు. పూర్వవిప్లవవిద్యార్థి వేదిక ఆధ్వర్యలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రజాస్వామికవాదులు మాట్లాడారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ బిజెపి కూటిమి తప్ప మిగతా అన్ని రాజకీయ పార్టీలు కూడా మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరుతున్నాయన్నారు. మావోయిస్టులు లేవదీసిన సామాజిక సమస్యలను పరిష్కారించాలేగాని, అణిచివేత పరిష్కారం కాదన్నారు. తెలంగాణ పౌర సమాజం అభిప్రాయాన్ని కూడగట్టడానికి పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రెండు నెలల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు. మావోయిస్టులపై కాల్పుల విరమణ ప్రకటన చేయాలని ఆయన ప్రభుత్వాన్ని, ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, బిజెపేతర ఇతర రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కోరారు. దేశ పౌరులందరికి రాజ్యాంగం కలి ్పంచిన జీవించే హక్కును కాపాడటానికి కాల్పుల విరమణ ప్రకటించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని హరగోపాల్ విజ్ఞప్తి చేశారు. ప్రముఖులు సజయ్, నాగయ్య, ఎ.కె.ప్రభాకర్, మేల్కో మార్గరేట్, దొంతం చరణ్, రెహెమాన్, ప్రహ్లాద్, విరహత్‌ఆలీ, నరేష్‌కుమార్, అనుశ్రీ మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగంపైన ప్రమాణం చేసి, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, జీవించే హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు.





తెలంగాణ ప్రజారాజ్యం కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్

# కెసిఆర్ కుటుంబం అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

## టిపిపి వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబ అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత కేవలం మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్‌కుమార్‌పైనే ఆరోపణలు చేసిందని, కేటీఆర్, కెసిఆర్‌లు కూడా అవినీతి అక్రమాలలో భాగస్వాములేనని ఆయన ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కల్వకుంట్ల కవితకు అవినీతి అక్రమాలు కనిపించలేదని, ఇప్పుడు నీతులు చెప్పుందని ఆయన ధ్వజం మెత్తారు. కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు కెసిఆర్ పాలనలో జరిగిన అన్ని అక్రమాలపై సమగ్రదర్యాప్తు జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఇసుక మాఫియాను నడిపించి ఎంతోమంది అమాయకుల ప్రాణాలు తీశారని దీనిపై కూడా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలుచేయాలి

## సిఎంకు న్యాయవాదుల పోస్ట్‌కార్డుల ఉద్యమం

**హైదరాబాద్ సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా విన్నవించాలని రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేరి ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి భాశెట్టి కార్తీక్ లు న్యాయవాద సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యక్ష సమా వేశంలో వారు మాట్లాడుతూ రోజురోజుకు న్యాయవాదులపై దౌర్జన్యాలు జరుపడమేగాక వారిని హత మారున్నన్నారని ఆవేదనను వ్యక్త పరిచారు. న్యాయవాద వృత్తిలో భాగంగా న్యా యం కోసం పోరాడుతున్న న్యాయవాదుల ప్రా ణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలుపరచాలని డిమాండ్ చేశారు.





రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వ హించిన ప్రత్యక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాదులు

# గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో బిజెపి నేతల భేటీ

## రజాకార్ సినిమా ప్రత్యేక ప్రదర్శనకు హాజరుకావాలని కోరిన నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబరు 17న నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్ర ఆధారంగా రూపొందిన రజాకార్ సినిమాను సెప్టెంబర్ 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో ప్రత్యేక ప్రదర్శనగా నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి హాజరు కావాలని గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కోరారు. గురువారం తెలంగాణ విమోచన కమిటీ సభ్యులు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ సి. అంజి రెడ్డి నేతృత్వంలోని బృందం గవర్నర్‌ను కలిసారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, గూడూరు నారాయణ్ రెడ్డి,గోలి మధుసూదన్ రెడ్డి, పి. విక్రం రెడ్డి, నందకం దివాకర్, పాతూరి కరుణ పాల్గొన్నారు. గవర్నర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామని విమోచన కమిటీ చైర్మన్ అంజిరెడ్డి తెలిపారు.

# రూ.4 కోట్ల విలువైన ఇంటిని యాదగిరీశుడికి విరాళమిచ్చిన భక్తుడు

## దాత ముత్తినేని వెంకటేశ్వర్లును అభినందించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** తిలక్‌నగర్‌లో నాలుగు కోట్లకి పైగా విలువ చేసే ఇంటిని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామికి విరాళంగా అందజేశారు. గురువారం చిక్కడపల్లిలో సబ "రిజిస్ట్రార్ ఆఫీసులో దేవుడి పేరు మీదకు యాదగిరిగుట్ట ఇఒ వెంకటరావు సమక్షంలో ఆ భవంతిని ట్రాన్స్ ఫర్ చేయించారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి ముత్తినేని వెంకటేశ్వర్లు, తిలక్ నగర్ లోని తన సొంత ప్రాపర్టీ 152 గజాలలో నిర్మితమైన జీ+3, పెంట్ హౌస్ కలిపి ఉన్న ఇల్లు దేవస్థానానికి అందజేశారు.

రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత డాక్యుమెంట్లను ఆయన, ఈవో వెంటకరావుకి, టెంపుల్ చైర్మన్ నరసింహమూర్తి, దేవస్థాన అధికారుల సమక్షంలో దేవస్థానానికి అందజేశారు. ఈ సందర్భంగా ఈవో వెంకటరావు, దాత వెంకటేశ్వర్లును స్వామివారి కండువాతో సన్మానం చేశారు. స్వామివారి ప్రసాదం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి మీద భక్తితో విలువల ప్రాపర్టీని ట్రాన్స్ ఫర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడైనా టెంపుల్ వచ్చి ఆ స్వామి వారి ఆశీస్సులు పొందవచ్చని చెప్పారు. స్వామివారి అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, దాత ముత్తినేని వెంకటేశ్వర్లును రాష్ట్ర దేవాదాయ శాఖ కొండా సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామాయ్యర్ ప్రత్యేకంగా అభినందించారు.



# సజ్జనార్ ఎన్నో సంస్కరణలు చేపట్టారు!

## ఆర్టీసి ఎండిగా నాలుగేళ్లు పూర్తి-చేసుకున్న ఆయనకు ఉన్నతాధికారుల సన్మానం

**హైదరాబాద్ సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) వైస్ చైర్మన్, ఎండీగా విసి సజ్జనార్ పలు సంస్కరణలు తీసుకొచ్చారని ఆర్‌టిసి ఉన్నతాధి కారులు అన్నారు. సంస్కరణల మూలంగా ఆర్‌టిసి ముందుకు సాగుతోందని అన్నారు. సజ్జనార్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్, ఎండిగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌టిసి ఉన్నతాధికారులు, అధికారులు గురువారం అభినందనలు తెలిపారు. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురు వారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్, ఎండిగా సంస్థలో సజ్జనార్ ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమాలను ఉన్నతాధికారులు, అధికారులు గుర్తుచేసుకున్నారు.

# బాలికపై అత్యాచారం కేసులో 22 యేళ్ల జైలు, జరిమానా

**చండూరు రూరల్, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దుండగుడికి కోర్టు 22 ఏళ్ళ జైలుశిక్షతో పాటు 35వేల జరిమాన విధించిన ఘటన మండల పరిధిలో దోనిపాముల గ్రామంలో చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపిన వివరాల ప్రకారం చండూరు మండలంలో గల దోనిపాముల గ్రామానికి చెందిన తిప్పర్తి యాదయ్య తండ్రి లింగయ్య,ఒక మైనర్ బాలికపై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడటం జరిగిందిజ బాధితురాలు తల్లి తేది 18 /12/2016 న ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితుడిపైన నసీఆర్‌నెం:139/2016 ఎస్సీ. పీఓసీఎస్ నెం : 214/2018 యూ/ఎస్ 452,506,376(1)(ఎన్) ఐపీసీ సెక్షన్ 5(హెచ్) ఆర్/డబ్ల్యూ 6 ఆఫ్ ఫోక్సో యాక్ట్2012 మరియు చండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా గురువారం రెండో అడిష నల్ కమ్ ఎస్సీ ఎస్టీ కోర్టు, అత్యాచారం, ఫోక్సో కేసుల కోర్ట్ నిందితునికి దోషిగా నిర్ధారించి, 1) సెక్షన్ ఐపీసీ ఫోక్సో చట్టం(సెక్షన్ 3 ఆర్/డబ్ల్యూ 4 ఆఫ్ ఫోక్సో యాక్ట్ 2012) ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా, 2) ఐపీసీ సెక్షన్ 4521 సంవత్సరం కారా గార శిక్ష మరియు రూ.5,000 జరినామ, 3) ఐపీసీ సెక్షన్ 506 (క్రిమినల్ ఇంటిమిడేషన్)కు గాను 1 సంవత్సరపు కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించగా మొత్తం కలిపి 22 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.35,000/జారీనామా బాధితురాలికి రూ.10 లక్షల రూపా యల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలు వడించిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్ తెలిపారు.

ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన సీఐ రమేష్ కుమార్,ఎస్సై భాస్కర్‌రెడ్డి అలాగే ప్రాసెక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డి.ఎస్.పి కె.శివరాం రెడ్డి, చండూరు సిఐ ఆదిరెడ్డి, యస్.ఐ నర్సింగ్ వెంకన్న, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్,దిదీవీ రామాంజనేయులు, లైజన్ అధికారులు, లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె.కల్పన, శి.నరేందర్, వి.మల్లికార్జున్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా సేవా కార్యాక్రమాలు చేపట్టాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్షంలో భాగంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమంలో నిమగ్నం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు పిలుపు ఇచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ కోసం జన్మ ఇచ్చిన తల్లి కోసం ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, రక్తదాన శిబిరం వరకు అనేక సేవా కార్యక్రమాల గురించి వారికి వివరించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు సామాజిక, సేవా కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంస్థాగత చంద్రశేఖర్ తివారి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, శాసనమండలి సభ్యులు మల్క కొమరయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, గీతామూర్తి, గణేష్ జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

MN 12 VJA_05-09pg10exHMNWJQE.qxd 9/4/2025 11:50 PM Page 1



# వరల్డ్ నం.1 బుమ్రా



బౌలర్ల ఐసిసి ర్యాంకింగ్స్

టాప్ లేపిన ముగ్గురు హీరోస్





**న్యూఢిల్లీ:** బౌలింగ్‌లో భారత్‌తో పాటు, వివిధ దేశాలకు ప్లేయర్లు టాప్ రేపారు. ఐసీసీ విడుదల చేసిన బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ముగ్గురు ప్లేయర్లు సత్తాచాటారు. ఈసారి మూడు ఫార్మాట్‌లు టెస్ట్, వన్డే, టీ20లలో ముగ్గురు వేర్వేరు బౌలర్లు ప్రపంచంలో నంబర్ 1 స్థానానికి చేరుకున్నారు. టెస్టుల్లో భారత్‌కు చెందిన జస్ప్రీత్ బుమ్రా, వన్డేల్లో దక్షిణాఫ్రికాకు చెందిన కేశవ్ మహారాజ్, టీ20లో న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ అగ్రస్థానంలో ఉన్నారు. భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం టెస్ట్ క్రికెట్‌లో నంబర్ 1 బౌలర్‌గా నిలిచాడు. అతడి వద్ద 889 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. బుమ్రా కెరీర్‌లో అత్యధికంగా 908 రేటింగ్ పాయిం ట్లను 2025లో ఆస్ట్రేలియాపై సిడ్నీ టెస్టులో సాధించాడు. తన స్పెషల్ బౌలింగ్ శైలి, పర్ఫెక్ట్ యార్కర్లకు బుమ్రా ప్రసిద్ధి. అతని బౌలింగ్‌తో ఎన్నోసార్లు మ్యాచ్‌ను మలుపు తిప్పి భారత్‌కు విజయాన్ని అందించాడు. ముఖ్యంగా విదేశీ పిచ్‌లపై అతడి ప్రదర్శన టీమిండియాకు పెద్ద బలంగా మారింది. ఇక వన్డేలో కేశవ్ మహారాజ్ సత్తా చూపించాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా స్పిన్ బౌలర్ కేశవ్ మహారాజ్ నంబర్ 1 స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం అతనికి 671 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అతని కెరీర్‌లో అత్యధికంగా 741 రేటింగ్ పాయింట్లను 2023లో కోల్‌కతాలో ఆస్ట్రేలియాపై సాధించాడు. మహారాజ్ తన కంట్రోల్డ్ బౌలింగ్, బ్యాట్స్‌మెన్‌లపై ఒత్తిడి పెంచేందుకు పేరుగాంచాడు. వన్డే క్రికెట్‌లో తన ఖచ్చితత్వం, ఓర్పుతో అనేక కీలక మ్యాచ్‌లలో తన జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అలాగే టీ20లో నంబర్ 1 స్థానాన్ని జాకబ్ డఫీ కైవసం చేసుకున్నాడు. టీ20 అంతర్జాతీయ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ మొదటి స్థానానికి చేరుకున్నాడు. అతని ఖాతాలో 717 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అతని కెరీర్‌లో అత్యధికంగా 750 రేటింగ్ పాయింట్లను 2025లో హరారేలో దక్షిణాఫ్రికాపై సాధించాడు. డఫీ తన వేగవంతమైన బౌలింగ్, స్వింగ్, డెత్ ఓవర్లలో కంట్రోల్డ్ కు పేరుగాంచాడు. అతని బౌలింగ్‌లో వైవిధ్యం బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెడుతోంది.

## వరల్డ్ నంబర్ 1గా షూటర్ సురుచి



**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 మహిళా ఎయిర్ పిస్టల్ షూటర్‌గా 19 ఏళ్ల సురుచి సింగ్ నిలిచింది. తాజా ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ షూటర్‌గా రికార్డుకెక్కింది. ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత, భారత యువ షూటర్ సురుచి తన కెరీర్‌లో తొలిసారిగా మహిళల ఎయిర్ పిస్టల్‌లో ఈ ర్యాంక్‌ను సాధించింది. 4162 పాయింట్లతో సురుచి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న ముగ్గురు చైనా షూటర్లను అధిగమించింది. ఈ సంవత్సరం ఆమె సీనియర్ అంతర్జాతీయ అరంగేట్రం చేసి వరుసగా 3వ్యక్తిగత ప్రపంచకప్ టైటిళ్లను గెలుచుకోవడంద్వారా తన కెరీర్‌కుఅద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. ఈ విజయం భారత షూటర్ సురుచికి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచుతుంది. ఇకపారిస్ ఒలింపిక్స్ పతక విజేత మనుభాకర్ ప్రస్తుతం మహిళల ఎయిర్ పిస్టల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 1988 రేటింగ్‌తో ఆరో స్థానంలో ఉంది. అలాగే ఆసియా ఛాంపియన్ అయిన సిఫ్ట్ కౌర్ సమ్రా, మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మొదటి మూడు స్థానాల్లో ఉన్న ఏకైక భారతీయ షూటర్. ఆమె ప్రస్తుతం 3034 రేటింగ్‌తో ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. నార్వేకు చెందిన మ్యూనిచ్ ప్రపంచ కప్ ఛాంపియన్ జీనెట్ హెగ్ ద్యూస్టాడ్ తర్వాత ఆమె ఉంది.




## హాకీ ఆసియా కప్.. కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

**న్యూఢిల్లీ:** హాకీ ఆసియా కప్-2025, సూపర్ 4లో కొరియాతో జరిగిన మ్యాచ్‌ను భారత్ 2-2తో డ్రా చేసుకుంది. పురుషుల ఆసియా కప్ రాజ్‌గిర్ 2025లో భారత పురుషుల హాకీ జట్టు విజయయాత్రకు అవాంతరం ఏర్పడింది. కొరియా తమ తొలి సూపర్ 4 గేమ్‌ను 2-2తో డ్రాగా ముగించింది. భారత్ తరపున హార్దిక్ సింగ్ (8), మన్దీప్ సింగ్ (53) గోల్స్ సాధించగా, కొరియా తరపున జిహున్ యాంగ్ (12), హైయోన్ హాంగ్ కిమ్ (14) గోల్స్ చేయడంతో, భారత్ ఒకే ఒక్క పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రెండవ మరియు ఏడవ నిమిషాల్లో వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకోవడం ద్వారా భారత్ ఆరంభాన్ని ఇచ్చింది.

8వ నిమిషంలో, సుఖ్జీత్ సింగ్ మిడ్‌ఫీల్డ్‌లో బంతిని గెలిచి హార్దిక్ సింగ్ (8)కి ఆడాడు. కొరియా వరుసగా 2 గోల్స్ చేసి పోటీలో ఆధిక్యాన్ని సంపాదించుకుంది. 12వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ చేసిన ఫౌల్ కారణంగా కొరియాకు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. జిహున్ యాంగ్ (12) షాట్‌తో కొరియా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. రెండవ క్వార్టర్ రెండు జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. 22వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ లాంగ్ పాస్ ఆడగా కొరియా గోల్ కీపర్ బలమైన సేవ్‌తో ఎదుర్కొన్నాడు. మూడవ క్వార్టర్ కూడా కొరియా స్వల్ప ఆధిక్యంలో నిలిచింది.

53వ నిమిషంలో, సుఖ్జీత్ సింగ్ కొరియా రక్షణ ద్వారా మన్దీప్ సింగ్ (53) కు సరైన పాస్ ఇచ్చి ఆటను మళ్ళీ సమం చేశాడు. ఆ తర్వాత భారతదేశం మరియు కొరియా రెండింటికీ పెనాల్టీ కార్నర్లు వచ్చాయి, కానీ వారు విజయ గోల్ సాధించలేకపోయారు. రెండు జట్లు చాలా పోటీతత్వంతో నాలుగు క్వార్టర్ల తర్వాత డ్రాగా ముగించాయి.

## యుఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2025లో పురుషుల డబుల్స్ విభాగంలో యుకీ భాంబ్రీ-వీనస్ జోడీ తొలి గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్‌తో కలిసి భంబ్రీ అనుభవజ్ఞులైన ద్వయం నికోలా మెక్టిక్-రాజీవ్ రామ్‌లపై 6-3, 6-7, 6-3 తేడాతో మూడు సెట్ల విజయాన్ని నమోదు చేశాడు. ఇండో కివీ జంట నాల్గవ గేమ్‌లో తొలి బ్రేక్ సంపాదించి, ప్రత్యర్థులపై ప్రారంభంలోనే ఒత్తిడి పెంచడంతో మ్యాచ్‌కు మంచి ఆరంభం లభించింది. వారు మ్యాచ్‌లో తొలి బ్రేక్ పాయింట్‌ను వదులుకోవడంతో తదుపరి ఆటలోనే వారికి సవాలు ఎదురైంది, కానీ చివరికి వారు దానిని కాపాడుకుని తమ ఆధిక్యాన్ని కొనసాగించారు. తొమ్మిదవ గేమ్‌లో ఇండో కివీ జంట మరో బ్రేక్ పాయింట్ అవకాశాన్ని కాపాడుకుంది. కొద్ది పోరాటం తర్వాత మ్యాచ్ యొక్క ప్రారంభ సెట్‌ను కైవసం చేసుకున్నారు. రెండు జతలు ఒక్కొక్క బ్రేక్ కోల్పోవడం, ఇతర సర్వింగ్ గేమ్‌లలో కూడా సుఖంగా కనిపించకపోవడంతో రెండవ సెట్‌లో కూడా సర్వ్‌లతో ఈ పోరాటం కొనసాగింది. అయితే, రెండు జతలు ఒకరి బలమైన రిటర్న్ గేమ్‌ను మరొకరు రద్దు చేసుకున్నారు మరియు రెండవ సెట్‌లో టైబ్రేక్‌ను బలవంతంగా సాధించారు, దీనిని రాజీవ్ మరియు మెక్టిక్ 8-6 తేడాతో గెలుచుకున్నారు. చివరి సెట్‌లో ఏడవ గేమ్ వరకు ఎటువంటి బ్రేక్‌లు ఇవ్వలేదు. కానీ, పరిస్థితులు మారిపోయాయి, ఇండోకివీ జంట చివరి సెట్‌ను గెలుచుకుని కీలకమైన 5-3 ఆధిక్యాన్ని సాధించింది, ఏడు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని చివరికి గేమ్‌ను కైవసం చేసుకుని చివరి నాలుగు స్థానాల్లో చోటు సంపాదించాడు.



## క్వాలిఫయర్స్‌లో విజయంతో ప్రారంభించిన భారత్

### 2-0 తేడాతో బహ్రెయిన్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్ 23, ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ ప్రచారాన్ని భారత్ విజయంతో ప్రారంభించింది. ఖతార్‌లోని దోహాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో బహ్రెయిన్‌పై 2-0 తేడాతో భారత్ ఫుట్‌బాల్ జట్టు గెలుపొందింది. గ్రూప్ బీ యొక్క మొదటి ఆటలో భారత్ మూడు పాయింట్లను నమోదు చేయడంతో ముహమ్మద్ సుహైల్, చింగాంగ్‌బామ్ శివల్డో సింగ్ రెండు గోల్స్ చేశారు. 31వ నిమిషంలో సుహైల్ అద్భుతమైన సోలో స్ట్రైక్‌తో భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. రెండవ అర్ధభాగంలో, సయ్యద్ మహమూద్ అల్మూసావి ఆఫ్‌సైడ్ కారణంగా గోల్ చేయకపోవడంతో, బహ్రెయిన్ ఈక్వలైజర్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది. చివరి నిమిషంలో శివల్డో చేసిన గోల్‌తో భారత్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. కాగా బ్లూ కోల్ట్స్ ఈ టోర్నమెంట్‌కు ఎప్పుడూ అర్హత సాధించలేకపోయింది. చరిత్ర సృష్టించే ప్రతిభ ఉన్న భారత జట్టుకు ఇది జీవితకాల అవకాశం. గ్రూప్ విజేతలు మరియు 11 గ్రూపుల నుండి ఉత్తమంగా రెండవ స్థానంలో నిలిచిన నాలుగు జట్లు ఎఎఫ్‌సి అండర్ 23 ఆసియా కప్ 2026కి అర్హత సాధిస్తాయి. సౌదీ అరేబియా ఇప్పటికే ఆతిథ్య దేశంగా టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయర్స్‌లో మిగిలిన 15 స్థానాల కోసం మొత్తం 44 జట్లు పోటీపడుతున్నాయి, ఒక్కొక్కటి నాలుగు గ్రూపులుగా విభజించబడ్డాయి.

## జీఎస్టీ మార్పులు రియాల్టీ, నిర్మాణరంగాలకు ఊతం!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేస్తూ ప్రకటించిన రెండు శ్లాబుల నిర్ణయం రియల్ ఎస్టేట్‌కు ఊతం లభిస్తుందని రియాల్టీ రంగ అంచనా. నిర్మాణరంగంలోని పలు వస్తువుల ధరలకు సంబంధించిన శ్లాబ్‌ను మార్చడంతో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. భారత్, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికా సీబీఆర్ఈ అధ్యక్షుడు, సీఈవో అన్షుమాన్ జీఎస్టీ మార్పుతో వ్యయ ప్రభావాలను హైలెట్ చేశారు. సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్ సాధారణంగా మొత్తం నిర్మాణ వ్యయంలో 40నుంచి 45 శాతం వాటా కలిగి ఉంటాయని తెలిపారు. దాంతో తగ్గింపు ప్రాజెక్ట్ ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. డెవలపర్లు ఇప్పుడు పొదుపులో కొంత భాగాన్ని గృహ కొనుగోలుదారులకు బదిలీ చేయవచ్చని, దాంతో గృహాలను కొనుగోలు చేసే అవకాశం పెరగడంతో అన్నిరంగాల్లో డిమాండ్‌ను పెంచుతుందన్నారు. పండుగ సీజన్‌లో సరైన సమయంలోనే జీఎస్టీ సంస్కరణలు వచ్చాయి. గృహాభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధారిత ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వ విస్తృత దృష్టికి ప్రభుత్వ చర్యలు ఊతమిస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. హీరానందాని గ్రూప్, నరేడ్కో నేషనల్ చైర్మన్ నిరంజన్ హీరానందని కేంద్రం నిర్ణయాన్ని భారతీయ వినియోగదారులకు 'పండుగ కానుక'గా, ఆర్థిక వ్యవస్థకు వ్యూహాత్మక ప్రోత్సాహకంగా అభివర్ణించారు. 'అందరికీ గృహనిర్మాణం' అనే ప్రభుత్వ కల సాకారానికి ఊతమిస్తుందని తెలిపారు. డెవలపర్లకు మాత్రమే కాకుండా వినియోగదారులకు, గృహనిర్మాణ రంగానికి దేశ దీర్ఘకాలిక వృద్ధికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, నరేడ్కో జాతీయ అధ్యక్షుడు జీ హరిబాబు మాట్లాడుతూ జీఎస్టీ హేతుబద్దీకరించడం రియల్ ఎస్టేట్,నిర్మాణరంగం, అనుబంధ రంగాల పరిశ్రమలకు ఉపశమనం కల్పిస్తుందని హరిబాబు తెలిపారు.

## మారుతి సరికొత్త 'విక్టోరిస్'

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త 'విక్టోరిస్' మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మధ్యస్థాయి ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను ప్రవేశపెట్టినట్టు కంపెనీ ఎండీ, సీఈవో హిసాచీ టకెచి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఫ్రాంక్స్, బ్రెజ్జా, జిమ్నీ, గ్రాండ్ విటారా మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్న విషయం తెలిసిందే. గడిచిన నాలుగేండ్ల కాలంలో కంపెనీ మొత్తం విక్రయాల్లో ఎస్‌యూవీ వాటా మూడింతలు పెరిగి 8.9 శాతం నుంచి 28 శాతానికి ఎగబాకిందన్నారు. ఈ నేపథ్యంలో ఎంట్రీఎస్‌యూవీని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్‌లకు పోటీగా సంస్థ ఈ నూతన మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర సంస్థ వెల్లడించలేదు. అయినప్పటికీ ఈ కారును తీర్చిదిద్దడానికి రూ.1,240 కోట్ల మేర పెట్టుబడి పెటినట్టు ప్రకటించింది.

## జీఎస్టీతో ఇవి కార్ల సేల్స్‌కు బూస్టప్..!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జీఎస్టీ రేట్‌శ్లాబ్‌ల హేతు బద్దీకరణతో విద్యుత్ కార్లకు మంచి మద్దతు లభించింది. దీనివల్ల ఇఎంఐల భారం కూడా తగ్గుతుందని, కార్ల మొత్తం విలువలపై విధించే జీఎస్టీ కూడా ఐదుశాతానికి కుదించడంతో దేశంలో విద్యుత్ వాహనాలకు డిమాండ్ పెంచే లక్ష్యంతోనే కేంద్రం ఈనిర్ణయం తీసుకుందని అంచనా. ప్రస్తుతం 18శాతం ఉన్న జిఎస్టీని ఇకపై ఐదుశాతానికి తెచ్చారు. అయితే చిన్న స్థాయి పెట్రోలు డీజిల్‌కార్లనుంచి పోటీ మాత్రం తప్పదన్న అంచనాలున్నాయి. ఈకార్లకు 18శాతం జీఎస్టీ అమలవుతోంది. జీఎస్టీ మండలి సమావేశానికి ముందు విద్యుత్‌కార్లు 20 లక్షలు, 40 లక్షలు పైబడిన వాటికి 18శాతం ఉంటుందని, 40లక్షల కార్లకు 28శాతం ఉంటుందన్న అంచనాలు వెలువడ్డాయి. అయితే అందరి అంచనాలు తల్లకిందులుచేస్తూ ఈవీ పరిశ్రమకు మద్దతిస్తూ ఐదుశాతానికి తెచ్చింది. ఈవీకార్లపై ఐదుశాతం జిఎస్టీని వసూలు చేయడం అనేది కర్బన ఉద్గారాలను తగ్గించేదిశగా కేంద్రం వెళుతోందని తెలుస్తున్నదని, ఇది స్వాగతించాల్సిన తరుణమని టాటా ప్యాసింజర్‌విద్యుత్‌కార్ల విభాగం ప్రెసిడెంట్ శైలేష్‌చంద్ర అన్నారు. మహీంద్ర మహీంద్ర ఈడీ సిఇఒ రాజేష్ జెజూరికర్ మాట్లాడుతూ ఐదుశాతం జీఎస్టీ ఆమోదనీయ నిర్ణమని అన్నారు. భారత విద్యుత్ ఆటోమొబైల్ డివిజన్‌కు ఈ నిర్ణయం ఇపుడు ఎంతో అవసరం అని ప్రభుత్వం ఈదిశగానే నిర్ణయించిందన్నారు. నిజానికి టాటామోటార్స్,వమీంద్ర అండ్ మహీంద్రాలే దేశంలో ఈవీఇకార్ల ఉత్పత్తిలో ముందున్నాయి. అయితే లగ్జరీ కార్ల తయారీ సంస్థలు వోల్వో కార్ ఇండియా జ్యోతి మల్హోత్ర మాట్లాడుతూ ఈవీ విభాగంలో ఐదుశాతం జిఎస్టీ విధింపు అనేది విద్యుత్ ఇంధనాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లయిందన్నారు.



వాణిజ్యం

### దీపావళి కొనుగోళ్లకు కేంద్రం

## జిఎస్టీ గిఫ్ట్!

**ముంబయి,సెప్టెంబరు 4:** జీఎస్టీ రేట్ల హేతుబద్దీకరణతో రానున్న దీపావళి సామాన్ల అందుబాటుధరల్లోకి వస్తాయని ట్రేడర్లఅంచనా. ఇక పండగ విక్రయాలు కొంతమేర ఊపందుకుంటాయని అంచనా. ప్రత్యేకించి మిఠాయి బాక్సులు, పూజా సామగ్రినుంచి ఆభరణాలు, వంటింటి సామాన్లు కార్లు ఇలా ఒకటేమిటి దీపావళి షాపింగ్‌కార్ట్‌లో అన్నీ కూడా కొంత ధరలు తగ్గుతాయని అంచనా. జిఎస్టీ మండలి ప్రకటించిన జిఎస్టీ 2.0 సంస్కరణలు పన్నుల వలయాన్ని మరింత సులభతరంచేసింది. ఒకరకంగా చెప్పాలంటే దీపావళి గిఫ్ట్ అనే బడా పారిశ్రామికవేత్తలు కూడా పేర్కొంటున్నారు. కేవలం రెండే రెండు శ్లాబ్‌లు అంటే ఐదు, 18శాతం మాత్రమే ఉంటాయి. 40శాతం మాత్రం విలాసవస్తువులకోసం కొత్తశ్లాబ్ సృష్టించారు. దీపావళి బాస్కెట్‌లో మిఠాయిలు, పండుగ తినుబండారాలు మరింత చౌక అవుతాయి. యుహెచ్‌టి పాలు, పన్నీరుపై జీఎస్టీ తొలగించగా వెన్న, నెయ్యి, జున్ను వంటి వాటిని 14నుంచి ఐదుశాతానికి తెచ్చారు. ఇక తీపితినుబండారాలు, కన్ఫెక్షనరీ ఉత్పత్తులు,చాకొలేట్లు, కోకో ఆధారిత ఉత్పత్తులు, ఐస్‌క్రీమ్‌లు గతంలో 18శాతం ఉంటే ఇపుడు ఐదుశాతానికి వచ్చాయి. ఐస్‌క్రీమ్, ఇతర శీతల ఉత్పత్తులుకూడా ఐదుశాతానికి వచ్చాయి. స్నాక్స్, నమ్‌కీన్స్ భుజియా, మిక్సర్లు, పాస్తా, బిస్కట్లు, కేకులు, పాస్ట్రీస్, బేకరీ ఉత్పత్తులు అన్నీ కూడా ఐదుశాతం కిందకే వచ్చాయి. డ్రైఫ్రూట్స్ అంటే ఆలమండ్స్, పిస్థాచియోస్, క్యాష్యూస్, డ్రైడ్ ఫిగ్స్, డేట్స్, సిట్రస్ పండ్లు 12శాతం కాకుండా ఐదుశాతానికి వచ్చాయి. పండ్ల రసాలు, జామ్‌లు, స్క్వాష్‌లు, కొబ్బరినీళ్లు వంటి కూడా ఐదుశాతానికి వచ్చాయి. కొవ్వొత్తులు, చేతితయారీ కొవ్వొత్తులు, హరికేన్ లాంటర్లు, ఇతర లైటింగ్ ఉత్పత్తులు కూడా ఐదుశాతానికి చేరాయి. చెక్క, రాయి, ఇత్తడి, సిరమిక్, గ్లాస్, ఇతర లోహ విగ్రహాలు, సుందరీకరణ ఉత్పత్తులుకూడా ఐదుశాతంలోనే ఉన్నాయి. ఇక కాస్మెటిక్స్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు సబ్బులు, షాంపూలు, హెయిరాయిల్, టూత్‌పేస్ట్, టాల్కమ్ పౌడర్, షేవింగ్‌క్రీమ్‌లపై ఐదుశాతం జీఎస్టీమాత్రమే ఉంటుంది.

## జిఎస్టీ మార్పులు స్వాగతించిన కార్పొరేట్ దిగ్గజాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** ప్రధాని మోదీ ప్రకటించిన దీపావళి కానుక అద్భుతంగా ఉందని, ప్రతి భారతీయుడికి ఇది అతిపెద్ద దీపావళి కానుక అని దిగ్గజ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా కొనియాడారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ప్రతి భారతీయుడికి ఇది అతిపెద్ద దీపావళి గిఫ్ట్. నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు చెందిన పరికరాలపై జీఎస్టీ తగ్గింది. ఇప్పుడు కిరాణ సామగ్రి తక్కువగా దొరుకుతుంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చు చాలా వరకు తగ్గుతుంది. విద్య అందుబాటు ధరలో లభిస్తుంది. రైతులకు మద్దతు లభిస్తుంది. మొత్తంగా తదుపరి జీఎస్టీ అంటే జీవన సౌలభ్యం + ఆర్థిక వ్యవస్థకు ఊతం అని హర్ష్ గోయెంకా పోస్ట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా సైతం స్పందించారు. వేగవంతమైన సంస్కరణల వినియోగం, పెట్టుబడులు వృద్ధికి మార్గాలు. వీటి ద్వారా ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తుంది. ప్రపంచ వేదికలపై భారత దేశ స్వరం ఎక్కువగా వినిపిస్తుంది. ఈ సందర్భంగా లే.. మేలుకో గమ్యం చేరే వరకు విశ్రమించొద్దు అనే స్వామి వివేకానంద మాటలు గుర్తు చేసుకోవాలి. దయచేసి మరిన్ని సంస్కరకణలు తీసుకురండి అని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ఆటోమొబైల్ రంగానికి మంచి ఊతం లభిస్తుందని, జిఎస్టీ తగ్గింపులతో విద్యుత్‌కార్ల కొనుగోళ్లకూడా పెరుగుతాయని మహీంద్ర అంచనావేసారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14